అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 29-1-2023 సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 8 సంచిక : 335 | Published from Karimnagar , Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 10 పేజీలు వెల : 8.00

సమాచారానికి సంకెళ్లు..



అన్నింటా సెన్సార్‌షిప్ విధిస్తున్న మోడీ సర్కార్

ఐటీ నిబంధనలు..ఆర్టీఐ చట్టాల్లో మార్పులు

- పార్లమెంట్ ఆమోదించకున్నా..'ఐటీ నిబంధనలు, 2021'తో ఆదేశాలు
- డిజిటల్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు బెదిరింపులు
- సందేశాలు, వీడియోలు తొలగించాలంటూ ఆదేశాలు
- బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శించకుండా కరెంట్ కట్..నిషేధాజ్ఞలు



తాము మెచ్చింది..తమకు నచ్చిందే ప్రజలు తెలుసుకోవాలని..చూడాలని మోడీ సర్కార్ బలంగా భావిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక సమాచారం బయటకు రాకుండా ఆంక్షలు విధిస్తోంది. చట్టాల్ని మార్చుతోంది. 'సెన్సార్‌షిప్'ను అమల్లోకి తెస్తోంది. ఐటీ నిబంధనలు(సవరణ)-2021 ముసాయిదా బిల్లును పార్లమెంట్ ఆమోదించలేదు. అయినా అందులోని 'అత్యవసర అధికారాల్ని' ప్రయోగిస్తూ 'బీబీసీ డాక్యుమెంటరీ'ని కేంద్రం నిషేధించింది. ఇండియా : ద మోడీ క్వశ్చన్..ప్రసారం చేయవద్దని బీబీసీ అధికారిక వర్గాల్నే బెదిరించింది. ట్విట్టర్, యూట్యూబ్‌ల్లో ప్రసారం కాకూడదంటూ ఆదేశాలు జారీచేసింది.

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ చిన్న వార్త బయటకు రాకుండా మోడీ సర్కార్ పెద్ద ఎత్తున అధికార వ్యవస్థల్ని రంగంలోకి దించుతోంది. రాజకీయ, అధికార బలాన్ని, ప్రభుత్వ పరపతిని వినియోగిస్తోంది. 'సెన్సార్‌షిప్' అనేక రూపాల్లో, విధానాల్లో అమలవుతోంది. అత్యంత కీలక సమాచారమంటూ కోర్టులకు సీల్డ్ కవర్లలో అధికారిక సమాచారాన్ని ఇవ్వటం దగ్గర్నుంచి...వర్సిటీల్లో 144 సెక్షన్ విధింపు వరకు ఇదీఅదీ అన్న తేడా లేదు. ఎక్కడికక్కడ కఠినమైన ఆంక్షలు, సెన్సార్‌షిప్ విధించటమే ముఖ్య విధానంగా మోడీ సర్కార్ పాలన కొనసాగుతోంది. పాలకులకు వ్యతిరేకంగా వార్తలు రాసే జర్నలిస్టులపై కేసులు నమోదు చేయటం అందులో ఒకటి. కాశ్మీర్ జర్నలిస్టు ఆసిఫ్ సుల్తాన్‌ను ఆగస్టు 2018 నుంచి జైల్లో నిర్బంధించారు. బీబీసీ డాక్యుమెంటరీని బయటకు రాకుండా, ప్రదర్శించకుండా కేంద్రం చేయని ప్రయత్నం లేదు. వర్సిటీల్లో ఈ వీడియో ప్రదర్శనలు జరగకుండా పోలీసులను పెద్ద సంఖ్యలో రంగంలోకి దింపింది. విద్యార్థి సంఘాలపైకి పోలీసుల్ని ఉసిగొల్పింది. జనవరి 26 గణతంత్ర దినోత్సవం వేడుక జరుపుకుంటున్నవేళలో, మరోవైపు ఢిల్లీలోని జేఎన్‌యూ, జామియా మిలియా, ఢిల్లీ యూనివర్సిటీ, చండీగఢ్..అనేక వర్సిటీల్లో డాక్యుమెంటరీ ప్రదర్శనలను కేంద్రం అడ్డుకుంది. క్యాంపస్ కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా, వైఫై ఇంటర్నెట్ నిలిపివేసింది. పోలీసులను పెద్ద సంఖ్యలో మోహరించి.. విద్యార్థుల్ని భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఇదంతా చూస్తే..దేశంలో ప్రజాస్వామ్య పాలన ఉందా? అనే సందేహం కలుగుతోంది. ప్రధాని మోడీ ఒక నియంతలా దేశాన్ని ఏలాలని తపనపడుతున్నారు.

ఆర్టీఐ చట్టానికి తూట్లు

ఆర్టీఐ సమాచారం పౌరులకు ఒక ఆయుధంగా మారుతోందన్న భయం మోడీ సర్కార్‌ను వెంటాడుతోంది. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ సమాచారం పౌరులకు చేరటం అన్నది కేంద్రంలోని పాలకులకు సహించటం లేదు. భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన 'ప్రాథమిక హక్కుల'ను సైతం బలహీనం చేయాలన్న వ్యూహంతో వెళ్తోంది. భావ ప్రకటనా స్వేచ్ఛను ఇప్పటికే చాలావరకు దెబ్బతీసింది. 'ఆర్టీఐ' పంటి కింది రాయిగా మారిందని భయపడుతోంది. దాంతో ఈ చట్టానికి తూట్లు పొడుస్తూ..బలహీనం చేయటమే పనిగా పెట్టుకుంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ...5లో

పత్రికా స్వేచ్ఛ ముఖ్యం

'బీబీసీ డాక్యుమెంటరీ' విషయంలో భారత్‌కు జర్మనీ పిలుపు

వివరాలు 2లో..

ఇంచు కూడా వెనక్కి తగ్గం

డాక్యుమెంటరీ ప్రదర్శనను ఆపం

'టాటా ఇన్‌స్టిట్యూట్' ప్రగతిశీల విద్యార్థి సంఘం స్పష్టీకరణ



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

దమ్ముంటే పార్లమెంట్‌ను రద్దు చేసి..

ముందస్తుకు వెళ్లండి

ఎన్నికల్లో తేల్చుకుందాం

- అప్పులు చేయడంలో మోడీ నెంబర్ 1: మంత్రి కేటీఆర్
- చివరి బడ్జెట్‌లోనైనా నిధులు తెప్పించాలని బీజేపీ నేతలకు హితవు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ


బీజేపీ నేతలకు దమ్ముంటే పార్లమెంటును రద్దుచేసి ముందస్తు ఎన్నికలకు రండి.. అందరం కలిసే పోదాం.. ముందస్తు ఎన్నికల్లో మీ సత్తా ఏంటో.. మా సత్తా ఏంటో నిరూపించుకుందామని మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. నిజామాబాద్ నగరంలో శనివారం మంత్రి కేటీఆర్ పర్యటించారు. రూ.22 కోట్లతో కంఠేశ్వర్ కమాన్ వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. పాత కలెక్టరేట్ వద్ద రూ.50 కోట్లతో ఇందూరు కళాభారతి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీస్‌లో విలేకరులలో మంత్రి మాట్లాడారు. గతంలో దేశం కోసం పనిచేసిన 14 మంది ప్రధాన మంత్రులు మొత్తం కలిసి 2014 వరకు రూ.56 లక్షల కోట్ల అప్పులు చేస్తే, ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక్కరే 8 ఏండ్ల పాలనలో రూ.100 లక్షల కోట్ల అప్పు చేశారని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ అప్పుతో దేశంలోని ప్రతి పౌరునిపై రూ.1,25,000 అప్పు ఉంటుందన్నారు.

రాష్ట్రంలో తాము చేసిన అప్పు భావితరాల ఉజ్వల భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. కేంద్రం మాదిరి కార్పొరేట్ దోస్తులకు పంచి పెట్టలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని, విభజన చట్టంలోని ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ చివరిదని, రాష్ట్ర బీజేపీ నేతలకు దమ్ముంటే ఈసారైనా అధిక నిధులు తీసుకొచ్చి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని హితవు పలికారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని దేవుడంటున్న బీజేపీ నేతలు ఏ విషయంలో ఆయన దేవుడో స్పష్టత ఇవ్వాలన్నారు. గ్యాస్ ధర పెట్రోల్ ధర నిత్యవసర సరుకుల ధరలు పెంచినందుకు దేవుడా? ప్రజల సొమ్మును కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నం దుకు దేవుడా..? చెప్పాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు ...5లో

స్వాతంత్ర్య పోరాటంలో

సామాన్యులెందరో...

వారందరి గురించి నేటి తరం తెలుసుకోవాలి : పాలగుమ్మి సాయినాథ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బ్రిటీష్ సామ్రాజ్యవాద వలస పాలన నుంచి దేశ విముక్తి కోసం ఎంతో మంది సామాన్యులు పోరాడారని ప్రముఖ పాత్రికేయులు, రచయిత పాలగుమ్మి సాయినాథ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ' హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ' కోర్ కమిటీ సభ్యురాలు సునీతా రెడ్డి, సాయినాథ్ రచించిన ది లాస్ట్ హీరోస్ ఫుట్ సోల్జర్స్ ఆఫ్ ఇండియన్ ఫ్రీడం పుస్తక విశేషాలపై ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహెూత్స వాలను నిర్వహించిందనీ, అయితే ఆ కార్యక్రమం ద్వారా నేటి ...5లో

హిమాయత్‌నగర్‌లో

కుంగిన రోడ్డు

- గుంతలో ఇరుక్కుపోయిన టిప్పర్
- డ్రైవర్‌తో పాటు ఇద్దరు కార్మికులకు స్వల్ప గాయాలు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఇటీవల హైదరాబాద్‌లోని గోషామహల్ చట్నీ వాడి ఘటన మరవక ముందే నగరంలో మరో చోట రోడ్డు కుంగిపోయింది. హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 5లో గల ప్రధాన రోడ్డు శనివారం సాయంత్రం ఒక్కసారిగా కుంగిపోయింది. అదే సమయంలో మట్టి లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ గుంతలో ఇరుక్కుపోయింది. ఈ ఘటనలో టిప్పర్ ...5లో



అమెరికా పోలీసుల చేతిలో

మరో నల్లజాతీయుడు బలి

వాషింగ్టన్ : అగ్రరాజ్యమైన అమెరికా మరో నల్ల జాతీయుడిని బలి తీసుకుంది. 2020 మే నెలలో జార్జ్‌ఫ్లాయిడ్ అనే యువకుడిని అమెరికా పోలీసులు చితకబాదడంతో ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా ఆ ఘటనను తలపించే విధంగా ఈ నెల 7న మరో సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దక్షిణ యూఎస్ నగరమైన మెంఫిస్‌లో జరిగిన ఈ వివరాల్లోకి వెళితే.. అమెరికా పోలీసులు ఈ నెల 7న రాత్రి టైర్ నికోలస్ (29) అనే యువకుడిని పట్టుకుని రోడ్డుపై చితకబాదారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నికోలస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ...10వ తేదీన చనిపోయాడు. కాగా, నికోలస్‌ని పోలీసులు తీవ్రంగా గాయపరిచే దృశ్యాలు స్థానిక సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన నాలుగు వీడియోలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఆ వీడియోల్లో పోలీసులు నికోలస్‌ని పట్టుకుని చితకబాదుతున్నారు. ఆ సమయంలో 'నేనేమీ చేయలేదు' అని నికోలస్ అంటున్నా... వినకుండా పోలీసులు కొడుతూనే ఉన్నారు. ఇక మరో వీడియోలో పోలీసుల నుంచి నికోలస్ తప్పించుకుని పారిపోతుంటే.. అతన్ని పట్టుకుని పెప్పర్ స్ప్రేని ఉపయోగించారు. ఇంకో వీడియోలో నికోలస్ 'అమ్మా అమ్మా' అని అరవడం వీడియోలో వినిపిస్తుంది. వీడియోలో ఓ పోలీసు అధికారి బ్లాక్‌మెన్ అని అంటున్న మాటలూ వినిపిస్తాయి. ఈ వీడియోల్లోని పోలీసుల తీరును చూసిన ఆ దేశ అధ్యక్షుడు ...5లో

అదాని పుట్ట పగిలి...

జనం పుట్టి మునిగి..



న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుడు గౌతం అదానీ సంస్థల బండారం బట్టబయలైంది. హిండేన్ బర్గ్ రీసెర్చ్ బయటపెట్టింది అదానీ బాగోతమే కాదు ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ అక్రమాల అసలు మతలబుని. రెండు రోజుల్లో 4,18,000 కోట్ల మేర అదాని సంస్థల సంపద ఆవిరైంది. అసాంఖ్యాక ప్రజల, ఎన్నో సంస్థలకి నమ్మక ద్రోహం చేసిన ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వానిది ప్రధాన భూమిక. మూడు దశాబ్దాల్లో ప్రపంచ మూడవ కూబేరుణ్ణి చేసిన ఘనత కచ్చితంగా ఈ మోడీ ప్రభుత్వానిదే. రెగ్యులేటరీ నిబంధనలను సవరింపజేసి, పెన్షన్, ప్రావిడేంట్ ఫండ్‌ను, ప్రభుత్వ రంగాలైన ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ వంటి దిగ్గజాలతో పెట్టుబడులు పెట్టించిన ప్రభుత్వం ప్రధాన బాధ్యురాలేనని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. అయితే ఈ సీక్రెట్ వ్యవహారాలకు ఆశ్రిత విధానాలతో స్టాక్ మార్కెట్టు అదానీకి ...2లో

ఫ్లోరోసిస్ బాధితుడు

అంశాల స్వామి మృతి


- ఫ్లోరైడ్‌పై అలుపెరుగని పోరాటం
- ఇటీవల మంత్రి కేటీఆర్‌తో భోజనం చేసిన స్వామి
- సీఎం కేసీఆర్, కేటీఆర్ దిగ్భ్రాంతి



నవతెలంగాణ- నల్లగొండ

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడేనికి చెందిన ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి ఉద్యమ నాయకుడు అంశాల స్వామి(32) శనివారం ఉదయం మృతిచెందాడు. శుక్రవారం రాత్రి తన ట్రై సైకిల్ పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు తీవ్రగాయాల య్యాయి. స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం మృతిచెందాడు. స్వామికి ముగ్గురు చెల్లెళ్లు. తండ్రి సత్యనారాయణకు ఐదేండ్ల కిందట పక్షవాతం వచ్చింది. తల్లి వెంకటమ్మ 20 ఏండ్ల నుంచి నరాల వ్యాధితో బాధపడుతూ ఎటూ కదల లేక జీవచ్ఛంలా ఉంది. ఒక చెల్లి ఫ్లోరోసిస్‌తో బాధపడుతూ చనిపోయింది. మరో చెల్లి అనారోగ్యంతో మృతిచెందింది.

ఫ్లోరైడ్ బారినపడిన అంశాల స్వామి ఎక్కడా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. బాధితుడిగానే కాదు ...5లో



ఈ సారైనా నిధులు పెరిగేనా?

వైద్యఖర్చులతో సతమతమవుతున్న పేదలు

- నిధుల కొరతతో నిలిచిపోయిన భవనాలు
- సిబ్బంది కొరత
- పని గంటల కుదింపు
- కేంద్ర బడ్జెట్‌లో ప్రజారోగ్యానికి అరకొర నిధులే

కరోనా ప్రపంచానికి గుణపాఠం నేర్పింది. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల మేరకు పడకలు, వైద్య, నర్సింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచకపోతే మహమ్మారులను ఎదుర్కోవడం ఎంత ఇబ్బందిగా మారుతుందో కోవిడ్ తెలిపింది. ప్రజారోగ్యానికి తమ బడ్జెట్‌లో సముచిత కేటాయింపులు చేసే దేశాలు కోవిడ్‌కు తట్టుకుని నిలబడితే ఆ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన దేశాలు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యాయి.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరోనా ప్రపంచానికి గుణపాఠం నేర్పింది. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల మేరకు పడకలు, వైద్య, నర్సింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచకపోతే మహమ్మారులను ఎదుర్కోవడం ఎంత ఇబ్బందిగా మారుతుందో కోవిడ్ తెలిపింది. ప్రజారోగ్యానికి తమ బడ్జెట్‌లో సముచిత కేటాయింపులు చేసే దేశాలు కోవిడ్‌కు తట్టుకుని నిలబడితే ఆ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన దేశాలు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యాయి. ప్రజారోగ్యానికి బడ్జెట్‌లో కనీసం ఆరు శాతం నిధులు కేటాయించాలనే డిమాండ్ పాతదే అయినప్పటికీ కరోనా తర్వాత ఆ డిమాండ్ మరింతగా మారు మోగుతోంది. ఇందుకు ...5లో

రాష్ట్రానికి ఇబ్బందులు ...

సరైన సిబ్బంది, సౌకర్యాలు లేక రోగులకు ఆదరణ కరువు

రాష్ట్రానికి మెడికల్ కాలేజీలనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం పదే పదే కోరుతున్నప్పటికీ కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడం లేదు. ఒకే సారి దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలకు అనుమతించిన సమయంలోనూ తెలంగాణకు మొండిచేయి చూపిం చింది. సకాలంలో ప్రతిపాదనలు పంపించడంలో రాష్ట్ర సర్కారు విఫలమైందని కేంద్రం సమర్థించుకున్నప్పటికీ చివరి బడ్జెట్ లో ప్రతిపాదనల మేరకు సహకరిస్తుందా? లేదా? అనేది చూడాలి. బీబీనగర్‌లో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఏర్పాటు చేసినప్పటికీ సరైన సిబ్బంది, సౌకర్యాలు లేపోవడంతో రోగుల ఆదరణ పొందలేకపోతున్నది. ఇక్కడ ప్రాక్టికల్స్ నిర్వహించాల్సిన వైద్య విద్యార్థులు సైతం వాటి కోసం ఇతర ఆస్పత్రులకు వెళ్లున్నారు. కనీసం చివరి బడ్జెలోనైనా సరే తగినన్ని నిధులు కేటాయించాలని నిపుణులు కోరుతున్నారు.

బిజినెస్

బీఎండబ్ల్యూ ఎక్స్1 విడుదల

- ధర రూ.45.90 లక్షలు



న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు శనివారం భారత మార్కెట్లోకి కొత్త బిఎండబ్ల్యు ఎక్స్1 స్పోర్ట్స్ ఆక్టివిటీ వెహికల్ (ఎస్ఎవి)ని విడుదల చేసింది. పెట్రోల్, డీజిల్ వర్షన్లలో ఇది లభ్యమవు తుందని ఆ కంపెనీ వెల్లడించింది. పెట్రోల్ వేరియంట్ ధరను రూ.45.90 లక్షలుగా, డీజిల్ వేరియంట్ ధరను రూ.47.90 లక్షలుగా నిర్ణయించింది. వీటిని బిఎండబ్ల్యు గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పవ్వా ఆవిష్కరించారు. ఈ రెండు వాహనాలను కూడా చెన్నయ్ ప్లాంట్‌లో తయారు చేశామన్నారు.

కొత్త వ్యాపారాల్లోకి పీజీఐఎం



ముంబయి: తాము రెండు కొత్త వ్యాపారాలను ప్రారంభిస్తున్నట్టు మ్యూచువల్ ఫండ్ కంపెనీ పీజీఐఎం ఇండియా తెలిపింది. అంతర్జాతీయ, ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్లను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది. ప్రూడెన్షియల్ ఫైనాన్షియల్‌కు చెందిన అంతర్జాతీయ పెట్టుబడి నిర్వహణ వ్యాపారమైన పీజీఐఎం కొత్త వ్యాపారాల కోసం భారతీయ అనుబంధ సంస్థకు అదనపు దీర్ఘ కాలిక పెట్టుబడి సమకూర్చడానికి అంగీకరించినట్లు పేర్కొంది. నియంత్రణ ఆమోదాలకు లోబడి 2023 ఏప్రిల్ 1న రెండు కొత్త వ్యాపారాలను ప్రారంభించ నున్నామని పీజీఐఎం ఇన్వెస్ట్‌మెంట్స్ ఆసియా వైస్ ఛైర్మన్ డేవిడ్ ఛాంగ్ తెలిపారు. "భారతదేశంలోని అధిక నికర విలువ, రిటైల్ మార్కెట్లలో సంపద ఉత్పత్తి. దేశంలో ఆఫ్‌షోర్ పెట్టుబడుల ద్వారా పెరుగుతున్న అవకాశాలను మేము గమనిస్తున్నాం. గత కొద్ది సంవత్సరాల్లో పీజీఐఎం ఇండియా గణనీయమైన వృద్ధిని సాధించింది. అనుభవ సంపద, నిరూపితమైన మా స్థానిక నాయకత్వం పనితీరు మరియు పెట్టుబడి నైపుణ్యాలు తదుపరి దశ వృద్ధిపై మాకు అపారమైన విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి" అని డేవిడ్ ఛాంగ్ పేర్కొన్నారు. "మా మ్యూచువల్ ఫండ్ క్లయింట్ల అత్యద్భుతమైన మద్దతుకు మేము ఎంతో సంతోషిస్తున్నాము, ఒక సమర్థవంతమైన పెట్టుబడి బృందాన్ని సమకూర్చుకొని, విస్తృతమైన కేంద్రీకరణతో కూడిన పీజీఐఎం ఇండియా 2.0ను ప్రారంభించడానికి అది మమ్మల్ని ప్రోత్సహించింది." అని పీజీఐఎం ఇండియా మ్యూచువల్ ఫండ్ సిఐఒ శ్రీనివాసరావు రావూరి పేర్కొన్నారు.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్‌కు రూ.53 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ప్యాకేజింగ్ కంపెనీ ఏజీఐ గ్రీన్ ప్యాక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.53.23 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రిత ఏడాది ఇదే క్యూ3లో రూ.29.44 కోట్ల లాభాలు నమోదు చేసింది. దీనితో పోలిస్తే క్రితం క్యూ3 లాభాల్లో 81 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. కంపెనీ మొత్తం ఆదాయం రూ.396 కోట్ల నుంచి రూ.567 కోట్లకు పెరిగింది. 2022-23 మూడు త్రైమాసికాల్లో రూ.1,061 కోట్ల ఆదాయంతో రూ.153 కోట్ల లాభాలు సాధించినట్లు పేర్కొంది.

ఎంపీ అవినాశ్‌రెడ్డిని నాలుగు గంటలు విచారించిన సీబీఐ

నవతెలంగాణ - ప్రత్యేక ప్రతినిధి

సంచలనం రేపిన వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు కేసుకు సంబంధించి కడప వైఎస్ఆర్‌సీపీ ఎంపీ అవినాశ్ రెడ్డిని హైదరాబాద్‌లో సీబీఐ అధికారులు శనివారం విచారించారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు కోఠిలోని సీబీఐ కార్యాలయంలో ఆయనను సీబీఐ బృందం విచారించింది. దాదాపు నాలుగేండ్ల క్రితం కడప జిల్లా పులివెందుల లోని తన నివాసంలో వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే కొందరు నిందితులను సీబీఐ అరెస్టు చేసింది. అనంతరం ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్‌కు మార్చిన సీబీఐ అధికారులు విచారణకు హాజరు కావాలంటూ అవినాశ్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. కాగా, శనివారం విచారణకు హాజరవుతానని తెలిపిన అవినాశ్‌రెడ్డి ఆ మాట మేరకు హైదరాబాద్‌లో సీబీఐ అధికారుల ఎదుట హాజరయ్యారు. కాగా, నాలుగు గంటల పాటు విచారించిన తర్వాత వెలుపలికి వచ్చిన అవినాశ్‌రెడ్డి తనకు సీబీఐ అధికారులు వేసిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చినట్టు తెలిపారు. ఈ కేసులో విచారణకు సంబంధించి తనను ఎప్పుడు పిలిచినా హాజరవుతానని సీబీఐ అధికారులకు తెలిపినట్టు అవినాశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

పత్రికా స్వేచ్ఛ ముఖ్యం

న్యూఢిల్లీ: బీబీసీ డాక్యుమెంటరీపై మోడీ సర్కారు నిర్ణయం భారత్‌లోనే కాక అంతర్జాతీయంగానూ విమర్శలను ఎదుర్కొంటున్నది. కేంద్రం నిర్ణయాన్ని పత్రికా, భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ విషయంలో ఐరోపా దేశం జర్మనీ కూడా స్పందించింది. పత్రికా మరియు భావ ప్రకటనా స్వేచ్ఛ ముఖ్యమని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. డాక్యుమెంటరీపై భారత్‌లో వివాదం కొనసాగుతున్న వేళ జర్మనీలో పత్రికా సమావేశంలో భాగంగా ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి దీనిపై స్పందించారు. భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛలను కల్పిస్తుందని ఆయన అన్నారు. వాటిలో భావ ప్రకటన మరియు పత్రికా స్వేచ్ఛ ఉన్నదని తెలిపారు. భారత్‌తో ఈ విలువలను జర్మనీ పంచుకుంటుందని తెలిపారు. ఈ విలువల కోసం జర్మనీ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. జర్మనీ ప్రకటనకు రెండు రోజుల ముందే యూఎస్ సెనేట్ విభాగం అధికార ప్రతినిధి నెడ్ ప్రైస్ కూడా భారత్‌లో కొనసాగుతున్న వివాదం " పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన అంశం" అని కీలక వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. ఇప్పుడు జర్మనీ కూడా ఈ వివాదంపై స్పందించడంతో భారత్‌లో పత్రికా, భావ ప్రకటనా స్వేచ్ఛపై మోడీ సర్కారు చేస్తున్న దాడులు అంతర్జాతీయంగా చర్చకు దారి తీస్తున్నాయని నిపుణులు తెలిపారు. కేంద్రం నిర్ణయాలు అంతర్జాతీయ వేదికల్లో భారత ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంచు కూడా వెనక్కి తగ్గం

ముంబయి : నగరంలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్)లో బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనను ఆపేది లేదని ఆ విద్యాసంస్థకు చెందిన ప్రగతిశీల విద్యార్థి సంఘం తెలిపింది. ఈ విషయంలో 'ఇంచు కూడా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. కాగా, ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యం ప్రదర్శనకు అనుమతి లేదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీనికి స్పందనగా ప్రగతిశీల విద్యార్థి సంఘం ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకున్నది. భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడికి వ్యతిరేకంగా పోరాడాలని విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. జేఎన్‌యూ, జామియా మిలియా ఇస్లామియా, ఢిల్లీ యూనివర్సిటీలలో డాక్యుమెంటరీ ప్రదర్శనపై అంతరాయాలు ఏర్పడిన విషయం తెలిసిందే. డాక్యుమెంటరీ ప్రదర్శపై ప్రకటన రావడంతో టాటా ఇన్‌స్టిట్యూట్ బయట బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శన ప్రతిపాదనకు వ్యతిరేకంగా నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముంబయి యూనిట్ బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. మా ఆందోళనలపై విద్యాసంస్థ అధికారుల నుంచి సంతృప్తికరమైన స్పందన రాలేదని, మా నిరసనను కొనసాగిస్తామని ఆ పార్టీ యువమోర్చా అధ్యక్షులు తాజిందర్ సింగ్ తివానా తెలిపారు.

అదాని పుట్ట పగిలి... జనం పుట్టి మునిగి..

(మొదటిపేజీ తరువాయి)

బాగా ఉపయోగపడ్డాయి, ఒక్క వార్త వేలకోట్ల సామ్రాజ్యాన్ని పేక మేడలా కూలేటట్లు చేయగల సామర్థ్యం స్టాక్ మార్కెట్ ఆధారిత వ్యవస్థకు మాత్రమే సాధ్యం. ప్రపంచ కుబేరుడు గౌతమ్ అదాని వ్యాపార వ్యవహారాలపై హిండెన్ బర్గ్ ఇచ్చిన ఒక దర్యాప్తు నివేదిక వారి సామ్రాజ్యానికి బీటలు వారేలా చేసింది. కుబేరుల్లో మూడు నుంచి ఏడవ స్థానానికి రెండు రోజుల వ్యవధిలోని పడిపోయినట్లు నాలుగున్నర లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైనట్లు వార్తా మాధ్యమాలన్నీ గొల్లుమన్నాయి. అయితే కూలిపోయిన అదాని పేక మేడకు ఆశపడి రాళ్ళెత్తిన అనేక ప్రభుత్వ, ప్రైవేటు, వ్యక్తిగత మదుపుదారులందరూ కన్నీళ్లు కార్చడం తప్ప వేరే దారి లేదు. దీని పర్యవసానంగా అదాని గ్రూపులో పెట్టుబడులు పెట్టిన అనేక ప్రభుత్వ, ప్రైవేటు రంగాల కంపెనీల వాటాలన్నీ కూడా పడిపోతున్నవి. ఎస్‌బీఐ, ఎల్ఐసీ వంటి సంస్థల వాటాలు కూడా వేలకోట్ల నష్టాలు చవిచూశాయని వార్తలున్నాయి. ఇలాంటి సంస్థల కన్నా వ్యక్తిగత మదుపుదారులే భయాందోళనకు గురై అమ్ముకున్న కారణంగా చాలా నష్టపోయారు. షేర్లలో అవకతవకలకు, అకౌంట్స్‌లో మోసాలకు, మనీలాండరింగ్‌కు అదానీ గ్రూపు పాల్పడిందన్నది హిండెన్‌బర్గ్ నివేదిక సారాంశం. ఆ రిపోర్టులో లేవనెత్తిన పలు అంశాలు, ప్రశ్నలపై అదానీ సమాధానం చెప్పకుండా, తమను దెబ్బతీయడానికి చేసిన కుట్ర అని ఎదురుదాడి చేశారు. ప్రతిగా తమ నివేదికపై కట్టుబడి ఉన్నామని, ఎలాంటి చర్యలకైనా సిద్ధమని హిండెన్‌బర్గ్ చేసిన సవాల్‌పై అదానీ వైపు నుంచి స్పందన శూన్యం.

పైకి రోల్‌మోడల్స్‌గా కనిపించే కార్పొరేట్ల చీకటి దందాలు హిండెన్‌బర్గ్ నివేదికతో మరోసారి బహిర్గతం అయ్యాయి. అదానీ గ్రూపులోని ఏడు ప్రధాన కంపెనీల షేర్లను తిమ్మినిబమ్మిని చేసి కృత్రిమంగా ధరలు పెంచుకున్నారు. ఆ షేర్లను తాకట్టుపెట్టి బ్యాంకుల నుంచి అడ్డగోలుగా అప్పులు తెస్తున్నారు. అందినకాడికి పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నారు. పన్ను ఎగవేతదారులకు అనుకూలంగా ఉన్న సింగపూర్, మారిషస్, కరీబియన్ దీవులు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో డొల్ల కంపెనీలను ఏర్పాటు చేసి లాభాలను వాటిలోకి మనీలాండరింగ్ పద్ధతుల్లో తరలిస్తున్నారు. ఇటువంటి అక్రమాలతోనే అదానీ గ్రూపులోని షేర్లు ఎకాయికిన 819 శాతం పెరిగాయి. నికర విలువ 231 శాతానికి ఎగబాకింది. మూడేళ్ల క్రితం గ్రూపు వర్త్ రూ.1.62 లక్షల కోట్లు కాగా ఇప్పుడు 9.78 లక్షల కోట్లు. ఈ స్వల్ప సమయంలో 8.1 లక్షల కోట్లు పెరగడం అసాధారణం. కరోనా విలయంతో ప్రజలు అల్లాడుతుండగా అదానీ సంపద అనూహ్యంగా పెరిగింది మోసాల నిచ్చెనతోనేనన్న విషయంలో ఎలాంటి సందేహం ఉండనవసరం లేదు. హిండెన్‌బర్గ్ పేల్చిన బాంబుతో అదానీ కంపెనీ షేర్లు కుప్పకూలాయి. రూ.వేల కోట్ల విలువైన సంపద ఆవిరైంది. షేర్ మార్కెట్‌లో సంపద గాలి బుడగ అనడానికి ఇదొక ఉదాహరణ. అదానీ గ్రూపులోని షేర్లలో 85 శాతం కుప్పకూలతాయని హిండెన్‌బర్గ్ చేసిన హెచ్చరికకు తాజా పరిణామం బలాన్ని చేకూరుస్తోంది.

హిండెన్‌బర్గ్ నివేదిక అదానీకో లేదంటే ఆ సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరులకో పరిమితం కాదు. మోడీ ప్రభుత్వానికీ పెద్ద కుదుపు. అదానీ-మోడీ మధ్య అవినాభావ సంబంధం బహిరంగం. 1988లో చిన్న ఎగుమతి, దిగుమతి కంపెనీతో వ్యాపారం ప్రారంభించిన అదానీకి 1991 నుంచి దేశంలో ప్రారంభమైన సరళీకరణ విధానాలు ఊపునిచ్చాయి. గుజరాత్ సిఎంగా మోడీ వచ్చాక అదానీ ప్రభ వెలిగింది. మోడీ దేశ ప్రధాని అయ్యాక అదానీ వాణిజ్య సామ్రాజ్యం అవధులు దాటింది. ఎయిర్‌పోర్టులు, పోర్టులు, రైల్వే రోడ్లు, విద్యుత్, గ్యాస్, బొగ్గు, రియల్, ఒకటేమిటి... సకలం అదానీ వశమవుతున్నాయి. కేంద్ర బిజెపి ఆశ్రితపక్షపాతం లేకుండా అదానీ ఇంతగా ఎదగడం అసాధ్యం. శ్రీలంక, బంగ్లాదేశ్‌ల్లోనూ అదానీ చక్రంతిప్పడానికి మోడీ సర్కారే కారణం. డ్రగ్స్ అక్రమ రవాణాకు అదానీ పోర్టులు కేంద్రాలుగా మారాయని వెల్లడైంది. ఇంతకుముందు అక్రమాలకు సంబంధించిన కేసులలో అదానీ కంపెనీలపై సెబి నిషేధం విధించగా, దానిని జరిమానా కింద మార్పించుకుని అదానీ బయట పడ్డారు. సెబి, ఆర్‌బిసి, ఇడి, సిబిఐ, నిఘా సంస్థలు కొమ్ము కాస్తున్నందునే అదానీ మార్కెట్ మాయాజాలం సక్సెస్ అయింది. ఇప్పటికైనా హిండెన్‌బర్గ్ రిపోర్టుపై కేంద్రం అదానీ ఆర్థిక అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయిస్తుందో లేదో వెండితెరపై చూడాల్సిన బొమ్మే!

మంత్రి సబిత రాజీనామాకు కుట్ర!

ఇంటర్ విద్యా జేఏసీ చైర్మెన్ మధుసూదన్‌రెడ్డి

- ఆన్‌లైన్ మూల్యాంకనంతో విద్యార్థులకు ఇబ్బందులు
- అధికారులు, అధ్యాపకులకు ఇంకా శిక్షణ ఇవ్వలేదు
- గ్లోబరీనాకు టెండర్ కట్టబెట్టేలా నిబంధనలు
- నవీన్ మిట్టల్‌ను నియంత్రించే శక్తి విద్యామంత్రికి లేదు
- సీఎం కేసీఆర్ జోక్యం చేసుకోవాలి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ విద్యలో ఆన్‌లైన్ మూల్యాంకనం ద్వారా జరిగే పరిణామాల ద్వారా విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి రాజీనామాకు దారితీసే కుట్ర జరుగుతున్నదని ఇంటర్ విద్యా జేఏసీ చైర్మెన్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం (జీజేఎల్ఏ) అధ్యక్షులు పి మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ వ్యవహారంపై మంత్రి ఉదాసీనత వల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయన్ను నియంత్రించే శక్తి మంత్రికి లేకుండా పోయిందన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న జీజేఎల్ఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ విద్యలో దశలవారీగా ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని చేపడితే బాగుంటుందని చెప్పారు. కానీ ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఇచ్చిన టెండర్ నోటిఫికేషన్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే లాంగ్వేజ్ సబ్జెక్టులకు 20 లక్షలు, ఆర్ట్స్, కామర్స్ (హ్యూమానిటీస్) సబ్జెక్టులకు పది లక్షలు, ఒకేషనల్ సబ్జెక్టులకు ఐదు లక్షలు కలిపి మొత్తం 35 లక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేపట్టాలంటూ ప్రకటించారని గుర్తు చేశారు. ఈ టెండర్ నోటిఫికేషన్ గురించి అధికారులకు అవగాహన లేదనీ, అధ్యాపకులకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదని అన్నారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయని వివరించారు. మార్చి 15వ తేదీ నుంచి వార్షిక పరీక్షలను నిర్వహిస్తారని చెప్పారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ మూల్యాంకనంపై అవగాహన కల్పించేందుకు సమయం ఎక్కడుందని ప్రశ్నించారు. తొలుత అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో లాంగ్వేజ్ సబ్జెక్టులకు ఆన్‌లైన్ మూల్యాంకనం చేపట్టి సత్ఫలితాలు వస్తే మిగిలిన వాటికి అమలు చేస్తే బాగుండేదని సూచించారు. కానీ ప్రస్తుత వార్షిక పరీక్షల్లోనే 50 శాతం జవాబు పత్రాలకు ఆన్‌లైన్ మూల్యాంకనం నిర్వహిస్తే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందనీ, వారి భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకోవైపు గ్లోబరీనా సంస్థకు టెండర్ కట్టబెట్టేలా నిబంధనలను రూపొందించారని విమర్శించారు. గతంలో ఇంటర్ ఫలితాల్లో అవకతవకలకు కారణమైన ఆ సంస్థను ప్రభుత్వం, ఇంటర్ బోర్డు బ్లాక్‌లిస్టులో పెట్టలేదనీ, నిషేధించలేదని గుర్తు చేశారు. దీంతో ఇప్పుడు టెండర్‌కు దరఖాస్తు చేసే అర్హత ఆ సంస్థకు ఉందన్నారు. ఇందులోనూ సాంకేతిక విద్యాశాఖాధికారి సూర్యప్రసాద్ జోక్యం ఉందన్నారు. గతంలో గ్లోబరీనాకు ఇంటర్ ఫలితాల ప్రాసెస్ చేసే టెండర్ ఖరారులో ఆయన కీలకంగా పాత్ర వహించారని గుర్తు చేశారు. ఇలాంటి తరుణంలో ఇంటర్ విద్య మళ్లీ సంక్షోభంలోకి నెట్టబడుతుందని హెచ్చరించారు. ఇంటర్ బోర్డులో జరుగుతున్న తప్పిదాల గురించి మంత్రి సబితకు వివరించినా నవీన్ మిట్టల్‌పై చర్యలు తీసుకోవడం లేదనీ, ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అందువల్ల టెండర్ నోటిఫికేషన్‌పై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆ నిబంధనలపై సాంకేతిక నిపుణులతో అధ్యయనం చేయించాలని కోరారు. ఆన్‌లైన్ మూల్యాంకనం ద్వారా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తితే ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టలే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

విషమంగా తారకరత్న ఆరోగ్య పరిస్థితి..

- హెల్త్ బులిటెన్ విడుదల
- ఆస్పత్రికి చేరుకున్న చంద్రబాబు, కుటుంబ సభ్యులు



బెంగళూరు : సినీ నటుడు, టీడీపీ నేత నందమూరి తారకరత్న ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. తాజాగా తారకరత్న హెల్త్ కండీషన్‌పై బులెటిన్‌ను హృదయాలయ డాక్టర్లు శనివారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఈ సందర్భంగా తారకరత్న ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు. తారకరత్నను గత రాత్రి ఒంటి గంటకు కుప్పం నుంచి బెంగళూరు నారాయణ హృదయాలయ ఆస్పత్రికి తీసుకువచ్చారని వెల్లడించారు.

అప్పటికి ఆయన ఆరోగ్యం అత్యంత విషమంగా ఉందని తెలిపారు. నిపుణులతో కూడిన తమ వైద్య నిపుణుల బృందం ప్రస్తుతం తారకరత్న ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ఆయన పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు బెంగళూరు లోని ఆస్పత్రికి చేరుకున్నారు. తారకరత్నకు చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకు న్నారు. తారకరత్న తండ్రి మోహన కృష్ణ, పురంధేశ్వరి, నందమూరి సుహాసిని, పరిటాల శ్రీరామ్, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, చిన రాజప్ప తదితరులు ఆస్పత్రికి చేరు కున్నారు. నందమూరి అభిమానులు భారీగా తరలిరావడంతో నారాయణ హృదయాలయ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. నిన్న కుప్పంలో యువగళం పాదయాత్రలో పాల్గొన్న తారకరత్న సొమ్మసిల్లి పడిపోయిన విషయం తెలిసిందే.

పిల్లల ప్రతిభాపాటవాలకు వేదిక తెలంగాణ బాలోత్సవం

- సుద్దాల అశోక్ తేజ
- ముగిసిన బాలోత్సవం



నవతెలంగాణ-ముషీరాబాద్

పిల్లల ప్రతిభాపాటవాలు.. సృజనాత్మకత శక్తికి గీటురాయి తెలంగాణ బాలోత్సవం అని బాలోత్సవ ఆహ్వాన సంఘం అధ్యక్షులు సుద్దాల అశోక్‌తేజ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం బాలోత్సవం ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండ్రోజులు జరిగిన ఈ కార్యక్రమంలో 4000 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. 22 అంశాలపై నిర్వహించిన పోటీల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నట్టు తెలిపారు. పిల్లల ప్రతిభాపాటవాలను మార్కులతోనో, మూస వార్షిక పరీక్షలతోనో కొలవలేమన్నారు. ఇలాంటి బాలోత్సవాలను పట్టణాల్లోనే కాదు ప్రతి గ్రామానికీ విస్తరింపజేయాలని సూచించారు. బాలోత్సవ గౌరవ అధ్యక్షులు సీహెచ్ వేణుగోపాల రెడ్డి మాట్లాడుతూ.. పిల్లల కోణం నుంచి ప్రపంచాన్ని చూస్తే కలిగే ఆనందం అనిర్వచనీయమన్నారు. అనుకూలమైన విద్యావిధానం రావాలని చెప్పారు. సైన్స్ ఎగ్జిబిషన్ చూసినప్పుడు పిల్లల ఆలోచనలు, ప్రతిభాపాటవాలు మనకు అందని స్థాయిలో ఉంటాయన్నారు. నేటి తరం విద్యార్థుల్లో అవకాశాలు ఇస్తే ఆకాశాన్ని తాకే శక్తి ఉందన్నారు. విశాలత్వం, సమ భావన, సృజనోత్సవం కలగలిపితే తెలంగాణ బాలోత్సవం అని చెప్పారు. తెలంగాణ బాలోత్సవం అనుభవంతో జిల్లా, మండల, గ్రామస్థాయిలో జరపాలని తీర్మానించారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర నాయకులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయకుమార్, బాలోత్సవం కార్యదర్శి ఎన్.సోమయ్య ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి, అనుముల ప్రభాకర్, జలజ, మమత తదితరులు పాల్గొన్నారు.

భళారే బాలోత్సవ్..

రెండ్రోజుల బాలోత్సవం భళా అనిపించింది. ఎటు చూసినా పిల్లలే.. ఎటు పోయినా వేదికలే.. చిన్నారుల కళలు.. పసిగలాలు.. బుడిబుడి అడుగులు.. బంగారు బొమ్మలు కూచిపూడి నాట్య మయూరాలయ్యాయి. బాలోత్సవంతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం పులకరించిపోయింది. 52 పాఠశాలల నుంచి సుమారు 4000 మంది విద్యార్థులు హాజరు కాగా, 22 రకాల సృజనాత్మక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను 38 మంది న్యాయనిర్ణేతలు సమన్వయం చేశారు.



విద్యుత్ వినియోగదారులపై అదనపు చార్జీలను ఉపసంహరించుకోవాలి

- 31న మండల స్థాయిలో ధర్నా : ప్రజాపంథా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అడ్వాన్స్ కంజంప్షన్ డిపాజిట్ (ఏసీడీ) పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలను మోపడాన్ని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 31న మండలస్థాయిలో విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు మరింత కష్టాల్లోకి కూరుకుపోయి విద్యుత్ వినియోగానికి దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమం, అడ్వాన్స్ పేరుతో ప్రభుత్వం వసూళ్లకు పూనుకోవడం దుర్మార్గమని విమర్శించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ 24 గంటలపాటు ఇస్తున్నామంటూ కోతలు ప్రారంభించిందని తెలిపారు. తన నష్టాలను ప్రజలపై మోపడానికి కుట్ర పన్నుతున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ స్వతంత్రంగా ఆలోచించకుండా ప్రభుత్వ విధానాలకు వత్తాసు పలుకుతున్నదని విమర్శించారు.

అదానీ కోసం ఎల్ఐసి, ఎస్‌బిఐలు బలి..!

- కేంద్రంపై మంత్రి కేటీఆర్ ప్రశ్నలు

హైదరాబాద్ : అదానీ గ్రూపు మోసాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌పై మంత్రి కెటిఆర్ స్పందించారు. అదానీ గ్రూప్ స్టాక్‌ల్లో ఎల్ఐసి, ఎస్‌బిఐ సంస్థలు వరుసగా రూ.77వేల కోట్లు, రూ.80వేల కోట్లు చొప్పున ఎందుకు పెట్టుబడులుగా పెట్టాల్సి వచ్చిందని కెటిఆర్ శనివారం ప్రశ్నించారు. ఎల్ఐసి, ఎస్‌బిఐ సంస్థలను అలా నెట్టిందెవరు?.. అని కేంద్రాని ఆయన ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎవరు సహాయం చేశారు?.. అని పేర్కొన్నారు. ఈ తీవ్రమైన ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పాలన్నారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ దెబ్బకు అదానీ గ్రూపు కంపెనీల షేర్లు 25 శాతం వరకు పతనం అయిన విషయం తెలిసిందే. ఈ ప్రభావం భారత స్టాక్ మార్కెట్లపై అదే విధంగా ఎల్ఐసి, ఎస్‌బిఐ షేర్లపై తీవ్రంగా పడుతోంది. ఇతర బ్యాంకింగ్ స్టాక్స్ కూడా ఒత్తిడికి గురి అవుతున్నాయి.

మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించాలి : ఎంఎల్‌సి కవిత

స్టాక్ మార్కెట్‌లో ఒడుదొడుకులు, షేర్ల పతనం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ట్విట్టర్ ద్వారా ఆమె డిమాండ్ చేశారు. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో ఎల్ఐసి, ఎస్‌బిఐ సహా ఇతర షేర్లలో తగ్గుదల, ఒడుదొడుకులు తీవ్రంగా ఆందోళన కలిగిస్తున్నాయని కవిత పేర్కొన్నారు. ఈ పరిణామాలపై ప్రతీ ఒక్క భారతీయుడికి కేంద్రం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. దీనిపై నెలకొన్న అన్ని అనుమానాలను నివృత్తి చేయడానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సెబీ చీఫ్ మాధవి పూరీ బుచ్ దిద్దుబాటు చర్యలు ప్రారంభించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన లక్షలాది మంది పెట్టుబడిదారులు, వారిపై ఆధారపడిన కుటుంబాలతో ప్రభుత్వం తరపున స్పందించాలన్నారు.

బీజేపీ అభ్యర్థులు దొంగలు.. గూండాలు

- త్రిపురలో సొంత పార్టీ నేతల ఆందోళన



ఇంటర్నెట్ : త్రిపురలో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీ అభ్యర్థులు దొంగలు, గూండాలు, వివిధ కుంభకోణాలకు పాల్పడుతున్నారని సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. పార్టీ కార్యాలయాల వద్ద బీజేపీ హఠావో - త్రిపుర బచావో అంటూ నినాదాలు చేశారు. పార్టీ కార్యాలయాల వద్ద జెండాలను తొలగించి నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకుగాను అభ్యర్థులను ప్రకటించినప్పటి నుండి బీజేపీ నియోజకవర్గ కార్యాలయాల్లో పార్టీ నేతల మధ్య గొడవలు తారాస్థాయికి చేరాయి. పలు చోట్ల పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేశారు. మరోవైపు లెఫ్ట్ పార్టీల అభ్యర్థులను గెలిపించుకోవాలని త్రిపుర ప్రజలు భారీగా వారి వెంట ర్యాలీ అవుతున్నారు.

ఒకేరోజు కూలిన మూడు యుద్ధవిమానాలు..



మధ్యప్రదేశ్: భారత వాయుసేనకు చెందిన మూడు యుద్ధ విమానాలు శనివారం కుప్పకూలాయి. మధ్యప్రదేశ్‌లో శిక్షణలో ఉన్న రెండు ఫైటర్ జెట్లు, రాజస్థాన్‌లో మరో యుద్ధవిమానం ప్రమాదానికి గురైనట్టు రక్షణశాఖ అధికారులు వెల్లడించారు. వివరాల ప్రకారం.. రోజువారీ శిక్షణలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ఎయిర్ బేస్ నుంచి గాల్లోకి ఎగిరిన సుఖోరు-30, మిరాజ్ 2000 విమానాలు కాసేపటికే మెరెనా ప్రాంతంలో కూలిపోయాయి. కాగా రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో వాయుసేనకు చెందిన యుద్ధ విమానం కూలిపోయింది. సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లకు స్వల్పగాయాలయ్యాయి.

ఢిల్లీ మద్యం కుంభకోణంపై విచారణ వాయిదా

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జ్‌షీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై విచారణను సీబీఐ స్పెషల్ కోర్టు వాయిదా వేసింది. ఈ అంశంపై ఫిబ్రవరి 2న విచారణ చేపడతామని రౌస్ ఎవెన్యూలోని సీబీఐ ప్రత్యేక కోర్టు పేర్కొంది. మద్యం కుంభకోణంలో మనీల్యాండరింగ్ సెక్షన్ల కింద ఈనెల 6న ఈడీ 13,657 వేల పేజీలతో సప్లమెంటరీ ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. 428 పేజీలతో ఈడీ కంప్లైంట్ కాపీని న్యాయమూర్తికి సమర్పించింది. ఈ ఛార్జ్ షీట్‌లో ఐదుగురు నిందితులు, ఏడు కంపెనీలపై ఈడీ అభియోగాలు మోపింది. రాబిన్ డిస్టిల్లరీస్ డైరెక్టర్ అభిషేక్ బోయినపల్లి, అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి, ఇండోస్పిరిట్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ మహేంద్రు, ఆప్ కమ్యూనికేషన్ ఇంచార్జ్ విజయ్ నాయర్, బిజినెస్ మెన్ బినోయ్ బాబుల, అమిత్ అరోరా పేర్లను నిందితులుగా చేర్చింది. కాగా, ఈ సప్లమెంటరీ ఛార్జ్ షీట్ పై విచారణ శనివారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎంకె నాగ్‌పాల్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అయితే ఈ అనుబంధ ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవాలా? వద్దా అనే అంశంపై ఫిబ్రవరి 2న విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

61 ఏండ్ల వరకు కాంట్రాక్టు అధ్యాపకుల కొనసాగింపు

- ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరం (2022-23)లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పునరుద్ధరిస్తున్నట్టు ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. వారిని ప్రస్తుత విద్యాసంవత్సరంలో పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12న ఉత్తర్వులు విడుదల చేసిందని గుర్తు చేశారు. దీంతో కాంట్రాక్టు పద్ధతిలో 3,722 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. వారిలో 3,541 మంది కాంట్రాక్టు పద్ధతిలో, 103 మంది మినిమం టైం స్కేల్ లేదా పార్ట్‌టైం పద్ధతిలో, 78 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారని వివరించారు. వారిని 61 ఏండ్ల వరకు కొనసాగించొచ్చని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి వర్తిస్తుందని తెలిపారు. దీంతో 58 ఏండ్లు నిండిన కాంట్రాక్టు అధ్యాపకులు కొనసాగేందుకు అవకాశం లభించింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉద్యోగ విరమణ పొందిన వారు మళ్లీ విధుల్లో చేరేందుకు అవకాశమున్నది.

సీఎంకు కృతజ్ఞతలు

కాంట్రాక్టు అధ్యాపకులు 61 ఏండ్ల వరకు కొనసాగేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు, మంత్రులు టి హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, తెలంగాణ రైతు బంధు సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఇంటర్ విద్యా కమిషనర్ నవీన్ మిట్టల్‌కు టిగ్లా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జంగయ్య, మాచర్ల రామకృష్ణగౌడ్, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం- 475 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, కొప్పిశెట్టి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంకింగ్ వ్యవస్థలో తిరోగమన విధానాలు

- నిర్వీర్యం చేస్తున్న మోడీ సర్కారు
- సవాళ్లు ఎదుర్కొంటున్న ఉద్యోగులు
- ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు బ్యాంకుల జాతీయీకరణ దోహదం
- 30, 31న దేశవ్యాప్త సమ్మె వాయిదా
- ఏఐబీఈఏ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటాచలం



నవతెలంగాణ-ముషీరాబాద్

భారత దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే జాతీయ బ్యాంకులను కేంద్రంలోని మోడీ సర్కార్ నిర్వీర్యం చేస్తున్నదని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం యూనియన్ బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర 2వ వార్షిక మహాసభ ఘనంగా ప్రారంభమైంది. తొలుత ఏఐబీఈఏ పతాకాన్ని సిహెచ్.వెంకటాచలం ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేసి మహాసభను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల జాతీయీకరణ దేశంలోని సాధారణ పౌరులు సురక్షితమైన బ్యాంకింగ్ వ్యవస్థపై ఆధారపడటానికి సహాయపడిందన్నారు. అలాగే వ్యవసాయం, విద్య, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వంటి రంగాలకు బ్యాంకులు ప్రాధాన్యతారంగ రుణాలు అందించడంలో కూడా జాతీయీకరణ దోహదం చేసిందని తెలిపారు. అలాంటి బ్యాంకులను నేడు నిరంకుశంగా ప్రధాని మోడీ ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐబీఈఏ చరిత్రను వెనక్కి తిరిగి చూసుకుంటే గొప్ప గర్వం, స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ఈ సంఘంలో సాధారణ మధ్యతరగతి బ్యాంక్ ఉద్యోగుల ప్రయాణం, వారి సంపూర్ణ ఐక్యత ద్వారా గౌరవం, భద్రత, మెరుగైన జీవన పరిస్థితులను పొందవచ్చునని తెలిపారు. ఆర్థిక సంస్థల్లో దివాలా, ఎన్.పీ.ఏల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

ప్రధాని మోడీ సామాన్య ప్రజల సంక్షేమాన్ని విస్మరించి.. కొంతమంది కార్పొరేట్ మిత్రుల సంక్షేమం కోసమే కట్టుబడి ఉన్నారని విమర్శించారు. తిరోగమన విధానాల వల్ల ప్రభుత్వరంగ బ్యాంకుల ఉద్యోగులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, అందులో ఉద్యోగ భద్రత ఒకటని తెలిపారు. బ్యాంకులు, బీమా, బొగ్గు గనుల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రభుత్వరంగ ఉద్యోగులు పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. జనవరి 31న యూనియన్లతో సమావేశం నిర్వహించేందుకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ అంగీకరించిందని, దాంతో 30, 31 తేదీల్లో దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెను వాయిదా వేసినట్టు తెలిపారు. ఐదు రోజుల బ్యాంకింగ్, పెన్షన్ అప్‌డేట్, అవశేష సమస్యలు, నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రద్దు చేయడం, వేతన సవరణ కోసం డిమాండ్ల చార్టర్‌పై ఐబీఏతో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ చర్చలు జరుపుతుందని వెల్లడించారు.

ప్రతినిధుల సభకు యూనియన్ ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్ స్వాగతం పలుకగా, అధ్యక్షులు టి.రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. మహాసభ ఆహ్వాన సంఘం చైర్మెన్ బి.ఎస్.ఆర్.మోహన్ రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. యూనియన్ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్రటెలి, ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, అఖిల భారత యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.శంకర్, చైర్మెన్ విన్ సెంట్ డిసౌజా, ఏపీ యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వి.ఉదయ కుమార్, యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్‌లు పి.సత్యం, సీఎస్. జనని తదితరులు పాల్గొన్నారు.

9,10 తరగతులకు బోధించలేం

- 6,7,8 విద్యార్థులకే పాఠాలు చెప్తాం
- మంత్రి సబితకు పండిత, పీఈటీ జేఏసీ అల్టిమేటం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు బోధించలేమని పండిత, పీఈటీ జేఏసీ స్పష్టం చేసింది. జాబ్ చార్ట్ ప్రకారం ఆరు, ఏడు, ఎనిమిదో తరగతి విద్యార్థులకే పాఠాలు చెప్తామని వివరించింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేనను శనివారం హైదరాబాద్‌లో జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు సి జగదీశ్, ఎండీ అబ్దుల్లా, చక్రవర్తుల శ్రీనివాసులు, నర్సిములు, క్రాంతికృష్ణ, గౌరీ శంకర్ కలిసి అల్టిమేటం జారీ చేశారు. పండితులు, పీఈటీల పదోన్నతులపై కోర్టులో ఉన్న అంశాన్ని త్వరగా తొలగించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే తమ ప్రాథమిక సభ్యుల మనోభావాలకు అనుగుణంగా ఉద్యమ కార్యాచరణకు పూనుకుంటామని హెచ్చరించారు. భాషా పండితులకు పదోన్నతులు ఇవ్వకపోతే ప్రపంచ తెలుగు మహాసభల సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటకు విలువ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోలను కాపాడుకుంటూ తమకు పదోన్నతులివ్వాలని కోరారు. మరింత చొరవ తీసుకుని ప్రభుత్వం తరఫున తగు చర్యలు తీసుకోవాలంటూ అధికారులను మంత్రి ఆదేశించారని వివరించారు. ఫిబ్రవరిలో ఉన్నత తరగతులకు బోధనను ఆపుతున్నందున రూ.150 అలవెన్సును బిల్ రూపంలో చేయొద్దని సూచించారు.

దళితులపై దాడిని ఖండించండి

- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ
- వామపక్ష నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ- ఆత్మకూర్

దళితులపై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో శనివారం వామపక్ష రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు మండలం పిన్నించర్లలో దళితులపై జరిగిన దాడి గురించి బాధితులు వివరించారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పిన్నించర్ల గ్రామంలో రెండ్రోజుల కిందట దళితులపై దాడి చేశారని చెప్పారు. సంఘటనలు జరిగినప్పుడు బాధితులు పోలీస్ స్టేషనుకు వెళితే ఫిర్యాదులు తీసుకోవడం లేదన్నారు. కేసులు నమోదు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అవతలివైపు వారికే వత్తాసుగా ఉంటున్నారని ఆరోపించారు. దళితులపై పథకం ప్రకారం దాడి చేసినట్టు కనపడుతుందన్నారు. గ్రామంలో కాలువ నిర్మాణం విషయంలో చాలా మంది గుంపుగా వచ్చి దళితులపై దాడి చేశారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కలిసి కట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం తహసీల్దార్ సింధూజకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు, మహమ్మద్, గోపి, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు అరుణ్ కుమార్, ప్రసాద్, అడ్వకేట్లు ఏపీ రాజేందర్, ఆర్ఆర్ మన్యం, సీపీఐ నాయకులు శ్యాంసుందర్, బీఎస్పీ నాయకులు ప్రకాష్, దాసరి సంఘం నాయకులు కొండన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు రవీందర్, దళిత సంఘ నాయకులు కత్తిపల్లి కురుమన్న, నరసింహ, అజయ్, రాజు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిస్తీలు కట్టలేకపోతున్నాం..

- మంత్రి హరీశ్‌రావుకు సర్పంచ్‌ల మొర



నవతెలంగాణ- జగదేవపూర్

గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నామని, ట్రాక్టర్ కిస్తీలు కట్ట లేకపోతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు రాచర్ల నరేష్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు శనివారం హైదరాబాద్‌లో ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో ట్రాక్టర్‌ల నెలవారీ కిస్తీలు కట్టలేకపోతున్నామన్నారు. చిన్న గ్రామ పంచాయతీలలో ట్రాక్టర్ లోన్లు ఇబ్బందికరంగా మారాయని, లోన్లు మాఫీ చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో పంచాయతీ నిధుల నుంచి నెలవారీ కిస్తీలు కట్టడం భారంగా మారిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఆత్మ కమిటీ చైర్మెన్ గుండా రంగారెడ్డి, మందాపూర్ సర్పంచ్ బిక్షపతి, జంగంరెడ్డిపల్లి సర్పంచ్ కుమార్, అనంతసాగర్ సర్పంచ్ లావణ్య మల్లేశం, పలుగుగడ్డ సర్పంచ్ శ్రీపతి రాజేశ్వరి రవి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్యం

- ఈ ఏడాది చివరకు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రెడీ..
- ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ-వరంగల్

పేద ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ తరహా వైద్యం అందించేందుకు వరంగల్ జిల్లాలో సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నట్టు ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం వరంగల్‌లోని సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆస్పత్రి నిర్మాణానికి నిధుల కొరత లేదని, 33 జిల్లాల్లో 33 మెడికల్ కాలేజ్‌లు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం కావాలి అనే రోజులు వచ్చాయని చెప్పారు. ఇటీవల 926 మంది డాక్టర్‌లను నియమించామని, త్వరలో మెడికల్ కాలేజీల్లో 1200 మంది ప్రొఫెసర్‌లను నియమిస్తామని చెప్పారు. 15 మెడికల్ కాలేజ్‌లు ఉన్నాయని, ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 9 కొత్త కాలేజీలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిలో 35 రకాల సేవలతో పాటు అవయవ మార్పిడి సేవలు కూడా ఉంటాయని చెప్పారు. మెరుగైన వైద్య సేవల కోసం అధునాతన పరికరాలతో ఈ ఆస్పత్రికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. 2000 పడకల ఆస్పత్రి ఈ ఏడాది చివరి నాటికి భవన నిర్మాణం పూర్తవుతుందన్నారు. దసరా నాటికే పూర్తయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. 24 అంతస్తుల నిర్మాణంలో.. వరంగల్ హెల్త్ సిటీ చారిత్రాత్మక భవనం రాష్ట్రానికే కాదు దేశంలోనే అత్యుత్తమ వైద్య సేవలు ఇక్కడ అందబోతున్నాయని చెప్పారు. 216ఎకరాల్లో ఈ హెల్త్ సిటీ రూపుదిద్దుకుంటోందన్నారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల కోసం ప్రభుత్వం ఖర్చు పెడుతుందని అన్నారు. వీరి కోసం ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయసాధన కోసం పునరంకితమవుదాం

- కొలిశెట్టి వజ్రమ్మ సంస్మరణ సభలో జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

అమరవీరుల ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు కొలిశెట్టి వజ్రమ్మ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. నాడు తెలంగాణ ప్రాంతంలో భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి పేద ప్రజల విముక్తి కోసం జరిగిన వీర తెలంగాణ విప్లవపోరాటంలో అనేకమంది అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కొలిశెట్టి వెంకయ్య ప్రత్యక్షంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. పోరాట కాలంలో అనేక ఇబ్బందులు వచ్చినప్పటికీ కడవరకు భర్త వెంకయ్యతో కలిసి వజ్రమ్మ పని చేశారని కొనియాడారు. నాటి నుంచి నేటి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం కమ్యూనిస్టుగా వజ్రమ్మ జీవించారని చెప్పారు. కుమారుడు కొలిశెట్టి యాదగిరిరావును పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని, పూర్తికాలం కార్యకర్తగా పంపించారని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్మాయిల్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టుల త్యాగాల వల్ల నేడు మనమందరం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామని చెప్పారు. వారి త్యాగాలు వెలకట్టలేనివన్నారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్, డీటీఎఫ్ జిల్లా నాయకులు దశరథ రామారావు మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. ప్రజలకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పింది కమ్యూనిజం మాత్రమేనని చెప్పారు. నేటి యువత నాటి అమరవీరులను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలని, అప్పుడే సమసమాజం సాకారం అవుతుందన్నారు. అంతకుముందు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, బుర్రి శ్రీరాములు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, చెరుకు ఏక లక్ష్మీ, కోటగోపి, చివ్వెంల మాజీ ఎంపీపీ కరుణ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ. 500 కోట్లు కేటాయించాలి

- టీపీసీసీ ఎన్నారై విభాగం డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రానున్న బడ్జెట్ సమావేశాల్లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500 కోట్లు కేటాయించాలని టీపీసీసీ ఎన్నారై విభాగం చైర్మెన్ వినోద్‌కుమార్, కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2014లో టీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికలో గల్ఫ్ కార్మికులకు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. గత ఎనిమిదేండ్లలో 1700 మంది తెలంగాణ వలస కూలీలు గల్ఫ్ దేశాలలో వివిధ కారణాలతో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు శంషాబాద్ విమానాశ్రయం పోలీస్‌స్టేషన్‌లో శవపేటికల రిజిష్టరే సాక్ష్యమని వివరించారు. కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం ఆ కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ నుంచి వాపస్ వచ్చిన కార్మికుల పునరావాసం, పునరేకీకరణ గురించి ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టాలనీ, సమగ్ర ఎన్నారై పాలసీలో భాగంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న 15 లక్షల మంది తెలంగాణ వలస కార్మికులు ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున ప్రతినెలా రూ. 1,500కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని పంపిస్తున్నారని తెలిపారు. ఎనిమిదేండ్ల కాలంలో లక్షా53 వేల కోట్ల రూపాయలు రాష్ట్రానికి చేరాయని తెలిపారు. విలేకర్ల సమావేశంలో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గోపిడి ధనుంజయ రెడ్డి ఉన్నారు.

జ్యూట్ బోర్డు వద్ద కార్మికుల ధర్నా

- సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ జ్యూట్ కార్మికులు ధర్నాకు దిగారు. శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని బోర్డు కార్యాలయం వద్ద బైఠాయించారు. హైదరాబాద్‌లోని నేషనల్ జ్యూట్ బోర్డును కోల్‌కతాలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయం కారణంగా తయారీదారులందరూ తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి కేంద్ర జౌళిశాఖ మంత్రికి లేఖ రాశారు. ధర్నాకు ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, నాయకులు చరణ్ కౌశిక్, మెట్టు సాయి కుమార్ తదతరులు సంఘీభావం తెలిపారు.

ఆ మూడింటికీ బడ్జెట్‌లో నిధులు కేటాయించండి

- సీఎం కేసీఆర్‌కు ఉత్తమ్ బహిరంగ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పంట రుణాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలకు రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈమేరకు శనివారం ఆయన సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. పంట రుణాల కోసం రు. 20వేల కోట్లు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. నాలుగువేల కోట్లు, విద్యార్థులకు రూ. మూడువేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

గుడి ధ్వంసంపై ఆదివాసీల ఆగ్రహం

- ఫారెస్ట్ ఆఫీస్ ముట్టడి.. రాస్తారోకో
- పోలీస్‌ల జోక్యంతో శాంతించిన వైనం



నవతెలంగాణ -తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలో ఆదివాసీలు తరతరాలుగా కొలుస్తున్న సారలమ్మ దేవర గుడిని ధ్వంసం చేయడంపై ఫారెస్ట్ ఆఫీస్‌ను ముట్టడించారు. శుక్రవారం సాయంత్రం అటవీశాఖ అధికారులు గుడిని ధ్వంసం చేసిన విషయం విధితమే. దాంతో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, ఆదివాసి ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆదివాసీలకు మద్దతుగా శనివారం భారీ ర్యాలీగా తరలివచ్చి అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడే రాస్తారోకో చేశారు. దీంతో తాడ్వాయిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పస్రా- ఏటూర్ నాగారం163వ జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచాయి. పస్రా సీఐ వంగ శ్రీనివాస్, స్థానిక ఎస్ఐ చవళ్ళ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ఆదివాసీలతో మాట్లాడారు. శాంతియుత మార్గంలో సమస్యకి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. దాంతో ఆందోళన విరమించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ మాట్లాడారు. సారలమ్మ గుడిని ధ్వంసం చేసిన అటవీ శాఖ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రకారం గుళ్ళు, మసీదులు, చర్చీలను మతాలకతీతంగా గౌరవించాలని, దానికి భంగం కలిగిస్తే నేరస్థులుగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. పీసా చట్టం అమలులో ఉన్న ప్రాంతమని, ఇక్కడ ప్రభుత్వ శాఖలు అన్ని పీసా గ్రామ సభలకు అనుగుణంగా పని చేయాలన్నారు. గుడిని ధ్వంసం చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయాలని, అప్పటి వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యమ నేత, సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్, మేడారం పూజారుల సంఘం అధ్యక్షులు సిద్దబోయిన జగ్గారావు, ఉద్యోగుల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంకిడి బుచ్చయ్య, పునరుద్ధరణ కమిటీ మాజీ చైర్మెన్ కోర్నిబెళ్లి శివయ్య, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి, ప్రధాన కార్యదర్శి కోర్నిబెల్లీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అదానీ అవకతవకలపై సెబి, ఈడీ విచారణ జరపాలి


- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అదానీ సంస్థల షేర్ల అవకతవకలకు సంబంధించి హిండెన్ బెర్గ్ ఇచ్చిన నివేదికపై సెబి, ఈడీ వంటి సంస్థల ద్వారా విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేరం రుజువైతే తక్షణమే అదానీని అరెస్టు చేయాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. దేశ ప్రజల్లో ఈ అంశాలపై అనుమానాలున్నాయనీ, వాటిని నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక మంత్రి ఒక ప్రకటన చేయాలని కోరారు. ప్రధాని మోడీ ఈ మోసాలకు నైతిక బాధ్యత వహించి ప్రజలకు వాస్తవాలు తెలిసేలా దర్యాప్తు సంస్థలను ఆదేశించాలని పేర్కొన్నారు. ఈ నివేదిక వెలువడిన తర్వాత వరుసగా రెండు రోజులపాటు అదానీ సంస్థల షేర్లు, అందులో పెట్టుబడులు పెట్టిన ప్రభుత్వ రంగ సంస్థ ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ వంటి సంస్థల షేర్లు నాలుగు లక్షల కోట్ల రూపాయల మేర భారీగా పతనం కావడం ఆందోళన కలిగిస్తున్నదని వివరించారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ సంపద అనూహ్య రీతిలో పెరిగి, ఆయన ప్రపంచ కుబేరుల జాబితాలో మూడో స్థానానికి ఎగబాకారని గుర్తు చేశారు. ఇది దేశ చరిత్రలోనే కేంద్ర ప్రభుత్వ ఆశ్రిత పక్షపాతానికి నిదర్శనమని విమర్శించారు. అదానీ షేర్ల డొల్లతనం బయటపడి, రెండు రోజుల్లో స్టాక్ మార్కెట్ పతనంతో ఎల్‌ఐసీ రూ.18 వేల కోట్లు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెడితే ఏమవుతుందో ఈ ఉదంతం పెద్ద ఉదాహరణని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను వాటి పద్ధతిలో నడవనీయాలనీ, బలవంతంగా షేర్లు కొనుగోలు చేసేలా చేయడం వల్ల ఇలాంటి ఆర్థిక సంక్షోభాలు తలెత్తుతాయని పేర్కొన్నారు.

సాగునీరు పుష్కలం - రాష్ట్రం సస్యశ్యామలం

సమాచార శాఖ ప్రకటన



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సాగునీటి రంగం అభివద్ధిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు దేశానికే దిక్సూచిగా నిలిచాయి. 2014లో రాష్ట్ర అవతరణ తర్వాత సాగునీటి రంగానికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం సాహసోపేతమైన అనేక చర్యలు తీసుకుంది. ప్రభుత్వం సాగునీటి పారుదలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడంతో గత ఎనిమిదేండ్ల వ్యవధిలో రాష్ట్ర నీటి పారుదల రంగం అత్యున్నతస్థానానికి చేరింది. తెలంగాణ సస్యశ్యామలం కావాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిరకాల కోరిక నెరవేరటంలో ఎన్నో మైలురాళ్ళున్నాయి. నీటి ప్రాజెక్టుల రూపకల్పన, వాటిని నిర్దేశించిన వ్యవధిలో పూర్తి చేసేందుకు పడిన తపన అంతా ఇంతా కాదు. రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర గణాంక 2022 నివేదిక ప్రకారం సాగునీటి విస్తీర్ణం 2014 సంవత్సరంలో కేవలం 62 లక్షల 48 వేల ఎకరాలకు ఉండగా, 2022 నాటికి సాగునీటి విస్తరణ 1 కోటి 35 లక్షల 60వేల ఎకరాలకు పెరిగింది. 2014 రాష్ట్రంలోని సాగునీటి అత్యవసరాలను దష్టిలో పెట్టుకుని ప్రాజెక్టుల రీడిజైనింగ్, రీ ఇంజినీరింగ్ వంటి వినూత్న ప్రణాళికతో కార్యక్షేత్రంలోకి దిగిన ప్రభుత్వం, విజయవంతంగా ఎన్నో ప్రాజెక్టులను చేపట్టింది. 24 ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో రాష్ట్రంలో 69.02 లక్షల ఎకరాల ఆయకట్టు కొనసాగుతున్నది. వాటి కింద రాష్ట్ర అవతరణ తర్వాత కొత్తగా 19.48 లక్షల ఎకరాలకు నీటిపారుదల సామర్థ్యం పెంచారు. 27 మధ్యతరహా ప్రాజెక్టుల పరిధిలో దాదాపు 3 లక్షల 4 వేల ఎకరాల అయకట్టుకు, చిన్న తరహా ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో మరో 5 లక్షల 53 వేల ఎకరాలకు, మరో 9 మధ్యతరహా, భారీ ప్రాజెక్టుల పరిధిలో 21 లక్షల 33వేల ఎకరాలకు నీటి సరఫరా పెంచడం జరిగింది. కల్వకుర్తి , నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ , ఎల్లంపల్లి , మిడ్‌మానేరు , దేవాదుల, తదితర అన్ని ప్రాజెక్టులనూ పూర్తిచేసింది.

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు: ఈ ప్రపంచంలోనే అతిపెద్ద సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టు. విభిన్న రీతిలో డిజైన్ చేసిన భారీ ప్రాజెక్టు ఇది. తెలంగాణలో సాగునీటికి ఇంతవరకు నోచుకోని భూములకు నీటిని అందించేందుకు ప్రభుత్వం నిర్మించిన బహుళ దశల ప్రాజెక్టు కాళేశ్వరం. ఈ ప్రాజెక్టులో భాగమైన అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. సాధారణంగా రిజర్వాయర్ల నిర్మాణం నదీ మార్గంలో జరుగుతుంది. కానీ, దీనికి భిన్నంగా నదీ , వాగు, ఏదీలేనిచోట అతిపెద్ద రిజర్వాయర్ మల్లన్నసాగర్ నిర్మాణం కావడం సాగునీటిరంగ చరిత్రలోనే ఒక అద్భుతం. అంతే కాకుండా గోదావరినీటిని 90 మీటర్ల నుంచి 618 మీటర్లకు ఎత్తినీటిని తరలించే బహత్తర కార్యాచరణ ఇందులో ప్రధానాంశం. అసాధ్యాన్ని సుసాధ్యం చేయటంలో తనకు తానే సాటి అని తెలంగాణ ప్రభుత్వం నిరూపించుకున్నది. గోదావరి నది పై మూడు బ్యారేజీలు, 20 మెగా నీటి లిఫ్టులు ,21 పంపుహౌజ్‌లు , 180 రిజర్వాయర్లతో పాటు 1832 కి.మీ పొడవునా సొరంగమార్గాలు, పైపులైన్లు, కెనాళ్లు నిర్మించారు. మూడు సంవత్సరాల వ్యవధిలో అతి భారీ ప్రాజెక్టును పూర్తి చేసి రికార్డు సృష్టించింది.

సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ : గోదావరి నీటిని తరలించి భద్రాద్రి - కొత్తగూడెం , ఖమ్మం , మహబూబాబాద్ జిల్లాల్లోని 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ చేపట్టింది. ప్రాజెక్టు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2014లో 68 లక్షల మెట్రిక్ టన్నులున్న వరి ధాన్యం ఉత్పత్తి 2022 నాటికి 2.49 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగింది. మిషన్ కాకతీయ పథకం కింద చెరువులు బాగు చేయడంతో చెరువుల కింద 25 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. భూగర్భజలాలు రాష్ట్ర వ్యాప్తంగా గణనీయంగా పెరిగి వ్యవసాయ సాగు కూడా రెట్టింపవుతున్నది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) కూడా గణనీయంగా పెరుగుతున్నది.

నీటితీరువా పన్ను రద్దు : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావానికి ముందు రైతులు చెల్లిస్తున్న నీటితీరువా పన్ను బకాయిలను కేసీఆర్ సర్కారు ఏర్పడిన తర్వాత రద్దు చేసింది. అంతే కాకుండా శాశ్వతంగా నీటిపన్నును రద్దుచేసి, రైతులకు ఉచితంగా సాగునీటిని అందిస్తున్నది. ఈ మేరకు శనివారం రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రకటన విడుదల చేశారు.

అనేక పొరపాట్లకు జాప్యమే కారణం.

- జెఫర్సన్

ఓ మహాత్మా!


సంపాదకీయం

"ఏది చీకటి ఏది వెలుతురు! ఏది జీవితమేది మృత్యువు! ఏది పుణ్యం, ఏది పాపం! ఏది సత్యం ఏదసత్యం! ఏది కారణమేది కార్యం! ఏది నీతి ఏదనీతి! ఓ మహాత్మా! ఓ మహర్షి!..." ఇప్పటికీ ఈ శ్రీశ్రీ పాటలోని ప్రశ్నలకు సమాధానాలను వెతుక్కుంటూనే ఉన్నాము. అసత్యాలన్నీ సత్యాలుగా చలామణి అవుతున్నాయి. మన కెదురవుతున్న సవాళ్ళకు

> గాంధీ ఆలోచనలపై ఆచరణపై భిన్నమైన అభిప్రాయాలెన్ని ఉన్నప్పటికీ నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకూ, భారతీయ జీవన గమనానికి ముంచుకొస్తున్న ముప్పుకూ ఆనాటి గాంధీని హతమార్చిన విద్వేష హింసాలోచనల పరంపరనే కారణమన్న సత్యాన్ని అర్థం చేసుకోవాలి. ఆయన హత్య ఒక ఉన్మాద సంఘటనయితే, ఇప్పుడదే ఉన్మాదం సామూహిక విపత్తుగా పరిణమించింది. దీన్ని అందరూ కలిసి ఎదుర్కోవాల్సి ఉంది. మహాత్ముని స్మరణకు సార్థకమదే.

సమస్యలకు కారణం తెలుసుకోలేకపోతున్నాం. మనం చేయాల్సిన కార్యమేమిటో కూడా స్పష్టంగా నిర్ణయించుకోలేకపోతున్నాం. మహాత్ముని పేర పాడుకున్న ప్రశ్నాపాదాలు నేటికీ పదునెక్కిన పదాలుగానే మనకెదురవుతున్నాయి. సత్యం, అహింస గురించి బోధించిన మహాత్మాగాంధీ అత్యంత హింసాత్మకంగా హత్యగావించబడిన డెబ్బయి ఐదేండ్ల తర్వాత హింస, అసత్యం ధర్మాలుగా ప్రవచించబడుతున్నాయి. ఇది సరికాదన్న చోట హింస చెలరేగుతోంది.

'ఈశ్వర్ అల్లా తేరానామ్, సబ్‌కో సమ్మతి దేభగవాన్' అని పాడుకున్న నాయకుని గుండెలపై తుపాకీ గుండు పేలిన విషాద సంఘటనకూ, ఇరువైయేండ్ల క్రితం గుజరాత్‌లో జరిగిన మారణకాండకు అవినాభావ సంబంధం ఉంది. రెండూ హత్యాకాండలే, ఇప్పుడు హత్యల గురించే మాట్లాడు కుంటున్నాం. మహాత్ముడి సత్యాహింసలు, సత్యాగ్రహ సూత్రాలు ప్రపంచ ప్రాచుర్యం పొందినట్లుగానే ఆ మహాత్మునికి జన్మనిచ్చిన నేలలో జరిగిన హింసోన్మాదం గురించీ ప్రపంచ మీడియా చర్చిస్తున్నది. కానీ అధర్మం, అసత్యం రాజ్యమై సత్యాలోచనలను అణచివేస్తున్నది. విశేషమేమంటే సత్యమూ, అహింస గురించి ప్రబోధించిన గాంధీ జన్మభూమిలో నుండే హింస, అసత్య ప్రబోధకులూ నాయకులై ఎదిగి రాజ్యం చేస్తున్నారు. ఇదొక వైచిత్రి. ఆనాడు మహాత్ముణ్ణి జాతిపితగా పిలుచుకుని నేటికీ పూజనీయునిగా భావిస్తున్న ప్రజలే మరో వైపు అందుకు పూర్తి భిన్న ఆలోచనలు గల వారిని నేతలుగా కొలవటం అంటే...



ఇంకా ఏది సత్యం, ఏదసత్యం? ఓ మహాత్మా! అనే మీమాంసలోనే ప్రజలు ఉన్నట్టు కదా! ఇంకా ముఖ్యమైన విషయమే మంటే, ఎవరైతే మహాత్ముని అంత మొందించారో, ఆ హంతకున్ని దేశభక్తుడుగా పేర్కొంటూ, అతని ఆలోచనతో కొనసాగే వారు నేడు మన పాలకులుగా కొనసాగడం బాధాకరమైన యధార్థం. అందుకనే గాంధీ వర్థంతి రోజు కానీ జయంతిరోజు కానీ గాంధీని గురించి మాట్లాడుతారు తప్ప అతన్ని హతమార్చిన హంతకుని గురించి చర్చే చేయరు.

అందుకే మనమిప్పుడు హంతకుల గురించి మాట్లాడుకోవాలి. అతని ఆలోచనలూ రాజకీయాల గురించీ చర్చించాలి. అప్పుడే సత్యా సత్యాల విషయం బోధపడుతుంది. మహాత్ముని ఎందుకు చంపాడు గాడ్సే. మత సామరస్యాన్ని బోధించినందుకు. హిందువులు, ముస్లింలు అన్ని మతాల ప్రజలు అన్నదమ్ములుగా సహనంతో జీవించాలని ఘోషించినందుకు మతోన్మాదికి ఆగ్రహం తెవచ్చింది. చెప్పేదానికి, చేసేదానికి భేదం ఉండరాదనీ సత్యాన్నే పలకాలనీ చెప్పాడు గాంధీ. ఇది కూడా వాళ్లకు నచ్చే విషయం కాదు. స్వేచ్ఛ, సమానత్వాలను కోరుకున్నాడు. ఇవేవీ గాడ్సే భావానుచరులకు మింగుడుపడని విషయాలు. అందుకే వాళ్లిప్పుడు సత్యం, న్యాయం, సమానత్వం గురించి మాట్లాడే వారిని అణచివేసే హత మార్చే పనిలో ఉన్నారు. అందులో భాగంగానే పన్సారేను హతమార్చారు. కల్బుర్గీని, గౌరీలంకేశ్‌లను అంతమొందించారు. ఎవరు గొంతు విప్పినా నిర్బంధకాండకు పూనుకుంటున్నారు. ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మరోవైపు వాళ్ళు మాట్లాడుతున్న దానికీ ఆచరణకూ పూర్తి వైరుధ్యము కొనసాగుతున్నది. మత సామరస్యత పోయి, మత విద్వేషం, మానవతా విధ్వంసం పెల్లుబుకుతున్న సందర్భాన శాంతి, అహింసల గాంధీతత్వాన్ని చర్చించటం ఒక అవసరమే అనుకుంటా.

ఒక మతాన్ని అవలంభించినా పరమత సహనాన్ని బోధించి, ఆచరించిన వాడిగా, మన దేశ సామాజిక సాంస్కృతిక బహుళత్వాన్ని అర్థం చేసుకుని, ఐక్యతను సాధించాలని తపన పడిన నాయకుడిగా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమంలో నిర్వహించిన పాత్ర, ప్రజలను ఏకం చేసిన తీరు చరిత్రలో నిలిచిపోయే ఒక అధ్యాయం. కానీ నేడు గాంధీ చరిత్రనూ కనుమరుగు చేసే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. గాంధీ ఆలోచనలపై ఆచరణపై భిన్నమైన అభిప్రాయాలెన్ని ఉన్నప్పటికీ నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకూ, భారతీయ జీవన గమనానికి ముంచుకొస్తున్న ముప్పుకూ ఆనాటి గాంధీని హతమార్చిన విద్వేష హింసాలోచనల పరంపరనే కారణమన్న సత్యాన్ని అర్థం చేసుకోవాలి. ఆయన హత్య ఒక ఉన్మాద సంఘటనయితే, ఇప్పుడదే ఉన్మాదం సామూహిక విపత్తుగా పరిణమించింది. దీన్ని అందరూ కలిసి ఎదుర్కోవాల్సి ఉంది. మహాత్ముని స్మరణకు సార్థకమదే.

"పుష్ప విలాపం"

జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి పుష్పవిలాపం కాదు కాని, బంతి పువ్వులు, గులాబీలు, తెల్ల చామంతులు గొల్లున ఏడ్చాయి. బిల్కిస్ బానో రేప్ కేసులో శిక్ష అనుభవిస్తున్న దోషులను "పెద్ద మనుసు"తో గుజరాత్ సర్కార్ విడుదల చేసినందుకే కాదు, విశ్వహిందూ పరిషత్‌వారు ఈ దోషులను తమతో కట్టిన దండలతో సత్కరించినందుకు భోరు మన్నాయి. ఇటువంటి ఘటనలను ఎవరూ మర్చిపోరాదనే "రిపోర్టింగ్ టు రిమెంబర్" (గుర్తుపెట్టుకోడానికే వార్తలు రాయడం) అనే సంస్థ వెలిసింది. తమాషాగా అది స్థాపించిన జాస్మిన్ (మల్లెపువ్వు) పథేజా పేరు కూడా మరో పువ్వుపేరుతో ప్రారంభం కావడం కాకతాళీయమే. నిత్యం నాలుగు మాటలు తన బుర్రలో సవ్వడి చేస్తూంటా యంటారామె. అవి 'స్పందించడం', 'తెలుసు కోవడం', 'మనసును తాకడం', 'మానవత్వం'. మనకి మనం కొన్ని విషయాలపై స్పందించి, ఆ స్పందించిన విషయాలను తెలుసుకుని, ఆ తెలుసుకున్న విషయాలను మనసుకు హత్తుకునేలా చేసి, మానవత్వంతో కూడిన అంశాలను ఇతరులతో పంచుకోవాలంటారు జాస్మిన్. తనకు తాను కళాకారినిగా చెప్పుకునే జాస్మిన్ పథేజా గత 20ఏండ్లుగా తాను సృజనాత్మక పద్ధతుల్లో ప్రజలు మర్చిపోయే (బహుశా ఎప్పుడూ నేర్చుకోని) ప్రపంచంలో పనిచేస్తున్నానంటారు.



ఆలోచనా పూర్వక విషయాల నుండి క్రియాశీలక అంశాల వరకు చర్చించే, తాను సృష్టించిన "బ్లాంక్ నాయిస్" అనే ఫెమినిస్టు సంస్థ తాను బెంగుళూరులో "సృష్టి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్, డిజైన్ అండ్ టెక్నాలజీ సంస్థ విద్యార్థిగా ఉన్నప్పుడే పురుడు పోసుకుందని చెపుతారు. పథేజా ఆ సంస్థను తన సొంత ఇల్లుగా భావిస్తారు.

'షీ' రోస్

'బ్లాంక్ నాయిస్' మొట్టమొదట చేపట్టిన అంశం 'ఈవ్ టీజింగ్'. ఆమె ఒక 'ఈవ్‌టీజింగ్ ఫుడ్ చార్ట్' రూపొందించారు. రోడ్లపై మహిళల్ని 'లాలీపాప్', 'చామ్ చామ్', 'హరిమిర్చి' తమను తాము రక్షించుకునేందుకు కారంపొడి వగైరా పట్టుకు తిరుగుతారు కాబట్టి 'ఆత్మరక్షణ పరికరాల మ్యూజియమ్స్' అంటూ బనాయిస్తూంటారని జాస్మిన్ పథేజా చెపుతారు. ఇటువంటి వివిధ ఆలోచనలను అమల్లోకి తెచ్చే ఈ 'బ్లాంక్ నాయిస్' కార్యకర్తలను ఆమె హీరోల్లాగే 'షీరో'లని పిలుస్తూంటారు.

ఆమె బెంగుళూరు కబ్బన్‌పార్క్‌లో ఒక చిన్న కునుకు తీస్తే, చిన్న అలికిడికి కూడా ఉలిక్కిపడి లేచేది. ఆ సందర్భంలో 'మీట్ టు స్లీప్' అనే ఆలోచన వచ్చింది. దేశంలో వేల మంది మహిళలు బహిరంగ ప్రదేశాల్లో నిద్రించాలనే ఆలోచన ఆమెకొచ్చింది. మహిళలపై అత్యాచారాలు చేసే వారి చెంప చెళ్ళుమనిపించేలా హింసకి గురైన మహిళల దుస్తులు ఆమె పోగుచేయడం మొదలుపెట్టింది. అటువంటి వాటిని పదివేలు పోగుచేసి ఢిల్లీలోని ఇండియా గేట్ సమీపంలో ప్రదర్శించాలని ఆమె స్వప్నిస్తోంది. ఆ రకంగానైనా మహిళలపై హింస తగ్గుతుందేమోనని ఆశిద్దాం...

పూలను, ఆడపిల్లలను ఒకదానికొకటి పర్యాయపదాలుగా రాస్తుంటారు కవులు. కుటుంబాల్లో భారం మోస్తూ, బాధల్ని భరిస్తూ నెట్టుకొచ్చే, నెగ్గుకొచ్చే స్త్రీలైనా పూలైనా విలపించ కుండా చూడటం సమాజం బాధ్యతే!

– ఆరెస్బీ

(ప్రియారమణి హిందూలో రాసిన వ్యాసానికి స్వేచ్ఛానువాదం)

'ఫేక్' ఉత్తర్వులతో సోషల్ మీడియాపై కత్తి

ఓడ ఎక్కేవరకూ ఓడమల్లయ్య అన్న పెద్దమనుషులు ఓడెక్కాక ఏమంటారో ఆ సామెత తెలిసిన తెలుగువాళ్లకు బాగా తెలుసు. ప్రధాని నరేంద్రమోడి సర్కారు విధానం అచ్చంగా ఆ సామెతకు నకలుగా తయారైంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా మూడు పర్యాయాలు ఎన్నికైన మోడీ ప్రధాని అభ్యర్థిగా ప్రచారంలోకి రావడానికి సోషల్ మీడియాను సోపానంగా వాడుకున్నారు. కార్పొరేట్ల సాయంతో వేలాది మంది యువతను వినియోగించి అహోరాత్రులు ఆయన ఘనతను హోరెత్తించారు. ఉత్తుత్తి ఫొటోలు సృష్టించారు. పాత చరిత్రను మార్చి కొత్త ఇమేజి తేవడానికి తంటాలు పడ్డారు. ఆఖరుకు నరేంద్రమోడీ బీజేపీ కార్యాలయం తుడుస్తున్న ఫొటో, ఛాయ్‌వాలా కథ, చదువుకున్న పట్టాలు ఏవీ నిజమని నిరూపించుకోలేకపోయారు. ఈపట్టాను గురించిన సమాచారం ఇవ్వవలసిందిగా సంబంధిత సంస్థను ఆదేశించినందుకు తెలుగువాడైన జాతీయ సమాచార హక్కు కమిషనర్ డా.మాడభూషి శ్రీధర్‌ను తప్పించారు కూడా. బీజేపీ ఆరెస్సెస్ మార్కు అసత్య కథనాలు కట్టుకథలు తట్టుకోలేక వార్తాసంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవలసి వచ్చింది. ప్రత్యేక పరిశోధకులను నియమించి నిరూపించవలసి వచ్చింది. ఇదిగో ఈ ఫొటోను మార్ఫింగ్ చేసి కొత్తది తయారు చేశారని, లేదంటే ఆబద్ధాలతో లేని కథ వండివార్చారని సోదాహరణలతో ఎన్నో కథనాలు బయిటపెట్టారు. తమ నిజస్వరూపం బయిట పెట్టిన వారిపై కక్షసాధింపులకూ వేధింపులకూ పాల్పడిందీ ప్రభుత్వం. ఆల్ట్ మీడియా అనే సంస్థ ఇందులో విశేషమైన కృషి చేసింది గనక ఆ సంస్థ అధినేతలలో ఒకరైన మహమ్మద్ జుబేర్‌ను జైలుపాలు



తెలకపల్లి రవి

> బడా మీడియా మోడీకి లొంబడిపోయిన నేపథ్యంలో సోషల్‌మీడియానే ప్రత్యామ్నాయంగా ఉంది. దాంట్లో అనేక అవాస్తవాలు అవాంఛనీయ ధోరణులు ఉన్నా అనేక వాస్తవాలు కూడా వెలుగుచూస్తున్నాయి. పైగా సోషల్ మీడియాలో పౌర చొరవకూ పాత్రికేయుల స్వతంత్రతకూ చోటుంటుంది. తప్పొప్పులు సరిచేయాలంటే మీడియా, సోషల్‌మీడియాలో స్వీయ నియంత్రణా వ్యవస్థ ఏర్పాటు కావాలి గాని అధికారవర్గాలకు నిషేధాధికారాలు ఇవ్వడం అనర్థదాయకం.


చేసింది. సరిగ్గా ఇప్పుడు ఆ అనుభవాన్నే మోడీ సర్కారు మరోవైపు నుంచి ప్రయోగించడానికి సిద్ధమైంది. ఫేక్‌న్యూస్ ప్రసారం చేస్తే సహించేది లేదని బెదిరించడమే గాక ఏది నిజం ఏది ఫేక్ అని నిర్ధారించే అధికారం తన చేతుల్లోకి తీసుకుంటున్నది. విమర్శనాస్వేచ్ఛకు, వాస్తవాల వెల్లడికి సాధనాలుగా ఉండాల్సిన మీడియా, సోషల్‌మీడియాలను నియంత్రించేందుకు కొత్త చట్టాలు బిగిస్తున్నది.

ఏమిటీ సవరణ?

సోషల్‌మీడియా ఇంతగా విస్తరించక ముందు "ఇన్ఫర్మేషన్ చట్టం 2000" పనిచేస్తూ వచ్చింది. ఈ చట్టంలో సెక్షన్69(1) కింద ఏదైనా సంస్థ లేదా మీడియా ప్లాట్‌ఫారమ్ ప్రకటించిన వార్త దేశానికి హానికరమైనదని, ఉద్రేకాలు పెంచుతుందని భావిస్తే పోలీసులు కేసు పెట్టొచ్చు. నోటీసు ఇవ్వొచ్చు. మారిన పరిస్థితులలో ఆ చట్టం సరిపోలేదని 2019లో ఫేక్ వార్తల అదుపునకు తీసుకోవలసిన చర్యలు సూచించేందుకు పిఐబి ఆధ్వర్యంలో ఒక కమిటీని వేశారు. సోషల్‌మీడియా వ్యాప్తి తర్వాత అంతకు ముందునాటి చట్టం చాలదన్న భావనతో 2021లో కొత్త సవరణ తీసుకొచ్చారు. దాని ప్రకారం బనాయించిన అనేక కేసులు సుప్రీం కోర్టు ముందు విచారణలో ఉన్నాయి. చాలాసార్లు అత్యున్నత న్యాయమూర్తులే వీటిపై విమర్శలు చేశారు. కేంద్రం తన వైఖరి చెప్పాలని తాఖీదులిచ్చారు. కేంద్రం ఆరునెలల గడువు కోరింది. ఈ కాలంలో ఆ ఆంక్షలు అమలులో ఉండవని సుప్రీం ప్రకటించింది. మరోవైపు 2021 సమాచార సాంకేతిక పరిజ్ఞానం నిబంధనల సవరణ ముసాయిదా తీసుకొచ్చింది. దాంతో వ్యూహాత్మకంగా కేంద్రం కొత్త ఎత్తు ఎత్తింది. ఆ ప్రకారం పిఐబి నియమించే ఫేక్‌వార్తల నియంత్రణ కమిటీ లేదా ప్రభుత్వం అందుకోసం నియమించే మరేదైనా కమిటీకి ఏకపక్ష నిషేధ అధికారం కల్పించారు. పైకి చెప్పడానికి ఆన్‌లైన్ గేమింగ్ నిరోధించ డానికి ఈ చట్టం తెచ్చామని చెబుతున్నారు గానీ, నచ్చని అంశాల ప్రచురణలను తొక్కిపట్టడం కోసం అంతకన్నా తీవ్రమైన అంశం జోడించారు. సోషల్ మీడియా వేదికలలో అంటే యూట్యూబ్ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి వంటివాటిలో వచ్చిన వార్తా కథనాలు(కంటెంట్) అవాస్తవమైతే వాటిని తొలగించే అధికారం పిఐబికి ఉంటుందని ఆ సవరణలో ప్రతిపాదించారు. వాటిని తీసేయవలసిందిగా ఆదేశిస్తే మధ్యంతర వ్యవస్థలైన అగ్రిగేటర్లు (అంటే వాటిని నిర్వహించే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి సంస్థలు) అమలు చేయవలసి ఉంటుంది. బూటకపు కథనాలు తొలగిస్తే మంచిదే కదా అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ అసలు సమస్య అక్కడే ఉత్పన్నమవుతుంది. ఏది నిజమో ఏది బూటకమో నిర్ణయించేది ఎవరు? వాటికి కొలబద్దలేమిటి?

గత అనుభవాలేమిటి?

గతంలో నియమితమైన పిఐబి కమిటీ అనుభవం తీసుకుంటే చాలా దారుణంగా ఉంది. అనేకసార్లు ఈ కమిటీ కొన్ని వార్తలు ఫేక్ బూటకమని ప్రకటించింది. కానీ ఈ ప్రకటనలే బూటకమైనాయి. సంఘ్ పరివార్ లేదా ప్రభుత్వం విడుదల చేసే ఫేక్‌లు తేల్చడానికి సోషల్ మీడియాలో కొందరు కృషిచేస్తూ వచ్చారు. ఉదాహరణకు 2020 డిసెంబరులో కేంద్ర నిఘా విభాగం(ఐబి) తరపున విడుదలైన నియామకాలకు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్ బూటకమని గొప్పగా ప్రకటించింది. తర్వాత చూస్తే అది అధికారికంగా ఇచ్చిందేనని తేలింది. పిఐబి తన ట్వీట్‌నే తొలగించుకోవాల్సి వచ్చింది. ఇక పరివార్ దుష్ప్రచారాలకు లోటేలేదు. కరోనా సమయంలో ఆర్నాబ్ గోస్వామి వంటివారు వలస కార్మికులు తరలిపోతున్న ఫొటోను మసీదు బ్యాక్‌గ్రౌండ్‌తో ఇవ్వడం ఎంత కలవరం కలిగించిందో గుర్తుండే ఉంటుంది. కరోనా కాలంలో ఢిల్లీలోని తబ్లీగీ జమాయిత్ మర్కజ్ ఇస్లామీ సంస్థలో ఏమి జరిగింది? ఈ విషయంలో అప్పట్లో ప్రధానితో సహా చేసిన ప్రకటనలు ఎలావున్నాయి? మతాల మధ్య చిచ్చు పెట్టడానికి తప్పుడు కథనాలు వదలడంపై చివరకు సుప్రీం కోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. హత్రాస్ ఘటనలోనూ బూటకపు చిత్రాలు వచ్చాయి. నిజమైన ఫొటోలు మార్ఫింగ్ ఫొటోలు పక్కపక్కనే చాలాసార్లు ప్రచురితమైనాయి. (ఇలాంటి దారుణమైన అనుభవాలు తెలుగు రాష్ట్రాలలోనూ ఉన్నాయి. వాటిలోకి వెళితే ఎవరు ఏమిటి అన్నది మరో వివాదమవుతుంది.) విచిత్రమేమంటే పిఐబి ఏర్పాటు చేసిన కమిటీ ఇలాంటి పరివార్ ప్రచారాల జోలికి పోయిందే లేదు. వారు వెల్లడించిన, ఖండించిన కథనాలలో నూటికి తొంభై ప్రతిపక్షాలకు సంబంధించినవే. రాహుల్‌గాంధీ యాత్ర సందర్భంలో ఫొటోలు లేదా ప్రకటనలు, ఇతర ప్రతిపక్షాలు లేదా మీడియా సంస్థల కథనాలు సమాచారాలపైనే ఎక్కడలేని కేంద్రీకరణ చూపించడం అనుభవంలో చూశాం. పిఐబి అనేది మౌలికంగా ప్రభుత్వ విధానాలను లేదా కృషిని ప్రజలకు మీడియాకు తెలియజేయడానికి ఉద్దేశించిన సంస్థ. ఆ సంస్థ ప్రచారంలో పెట్టే, విడుదలచేసే ప్రకటనలు ఎంత వరకు నిజమో తేల్చవలసిన బాధ్యత మీడియాపైన సోషల్ మీడియాపైన ఇంకా ప్రతిపక్షాలు ప్రజా సంస్థలపైన ఉంటుంది. దీన్ని అటూ ఇటూ తిప్పి తక్కిన వారిపై నిఘావేసి కంటెంటు తొలగించే అధికారాలివ్వడం తలకిందుల తర్కం. ఉదాహరణకు ఇటీవల ప్రధాని విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు జరిగిన కార్యక్రమాలలో తొంభైశాతం శంకుస్థాపనలు మాత్రమే. ఆ విషయం గట్టిగా చెబితే పిఐబి దాడి చేస్తుంది. ఎందుకంటే ఆ శంకుస్థాపనల అంచనాలు మొత్తం వారు అభివృద్ధి కింద చూపిస్తుంటారు. వూరి సైనిక కేంద్రంపై దాడి, పాకిస్థాన్‌పై సర్జికల్ స్ట్రయిక్స్ వంటివాటిపై విపరీత ప్రచారం జరుగుతోంది. వాటికి సంబంధించిన నిజానిజాలు అడిగితే దేశభద్రతకు ముప్పంటారు. ఇంకా మాట్లాడితే దేశద్రోహం



ముద్ర వేస్తారు. భారత చైనా సరిహద్దులలో పరిస్థితిపై ఏవో కథనాలు వస్తాయి. పూర్తి వివరాలు అడిగితే దాటేస్తారు. ప్రత్యారోపణలు చేస్తారు. ఇలాంటి అనేక సందర్భాలు చూశాం. అసలు పరిశోధనాత్మక జర్నలిజంలో జరగాల్సిందే అది. మోడీ ప్రభుత్వం క్రమంగా ఆ విధమైన పరిశోధనాత్మక జర్నలిస్టులనే వేటాడి ద్రోహుల జాబితాలో చేర్చింది. సర్వాధికారాలు పిఐబికి కట్టబెట్టే కొత్త నిబంధనలు వస్తే గనక ఏలినవారు చెప్పే అసత్యత కథనాలు, లేనిపోని గొప్పలే జనానికి వార్తలవుతాయి. ప్రశ్నించడం పరిశోధించి రాయడం అపరాధమవుతుంది. పిఐబి వాటిని తొలగించాలని ఆదేశి స్తుంది. అంటే ఏ ప్రభుత్వ నిర్వాకాలనూ నిజాలను నిగ్గుతేల్చడం జరగాలో అదే అంతిమ తీర్పరిగా, నియంత్రణ కర్తగా మారిపోతుంది.

తస్మాత్ జాగ్రత్త


ఈ కారణంగానే ప్రతిపక్షాలూ మీడియా సంస్థలూ పత్రికా యాజమాన్యాలు, ముక్తకంఠంతో ఒక్క గొంతుతో సమాచార స్వాతంత్యం మెడపై కత్తిలాటి ఈ సవరణలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నాయి. ఎడిటర్స్ గిల్డ్, న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్(ఎన్‌బిడిఎ), ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ(ఉయత) అనేక జర్నలిస్టుల సంఘాలు ఈ మేరకు సవివరమైన సోదాహరణమైన ప్రకటనలు చేశాయి. ఒత్తిడి, విమర్శలు పెరిగాక కేంద్ర ప్రభుత్వ ఐటి శాఖామంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కొన్ని సన్నాయినొక్కులతో కొన్ని వివరణలు ఇచ్చారు. ఈ విషయమై

> దేశంలో ప్రస్తుత పరిస్థితి, ఆచరణను బట్టి చూస్తే నిస్సందేహంగా మోడీ ప్రభుత్వం మరోసారి సోషల్ మీడియా పీక నొక్కడానికి సమాయత్తమవుతున్నదనేది స్పష్టం.ఈ కారణంగానే ప్రతిపక్షాలూ మీడియా సంస్థలూ పత్రికా యాజమాన్యాలు, ముక్తకంఠంతో ఒక్క గొంతుతో సమాచార స్వాతంత్యం మెడపై కత్తిలాటి ఈ సవరణలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నాయి. ఎడిటర్స్ గిల్డ్, న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్(ఎన్‌బిడిఎ), ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ(ఉయత) అనేక జర్నలిస్టుల సంఘాలు ఈ మేరకు సవివరమైన సోదాహరణమైన ప్రకటనలు చేశాయి.

విడుదల చేసిన నిబంధనలపై ఫిబ్రవరిలో సంబంధిత సంస్థలతో(స్టేక్‌హోల్డర్స్) చర్చలు జరిపిన తర్వాతే అమలులోకి తెస్తామన్నారు. ఇవి కేవలం కేంద్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించి మాత్రమే జరుగుతుందని అయా శాఖలతో నిర్ధారించుకున్నాకే వాటిని తొలగించడం జరుగుతుందని వివరించారు. ఈ సన్నాయినొక్కులు ఎలా ఉన్నా దేశంలో ప్రస్తుత పరిస్థితి, ఆచరణను బట్టి చూస్తే నిస్సందేహంగా మోడీ ప్రభుత్వం మరోసారి సోషల్ మీడియా పీక నొక్కడానికి సమాయత్తమవుతున్నదనేది స్పష్టం. కనీస పరిశీలన(స్క్రూటనీ) కూడా లేకుండా పిఐబి చెప్పిందే అమలు చేయవలసి ఉంటుందని ఎన్‌డిబిఎ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వంపై ఏ విధమైన విమర్శ వచ్చినా ఏదో ఒక పేరుతో అణచివేయ వచ్చు. పైగా డిజిటల్ సంస్థలూ ఇంటర్మీడియరీలు సర్కారు వత్తిడికి గురై తలవంచే పరిస్థితి దాపురిస్తుంది. అసలు ఇంత పెద్ద పరిణామం జరిగినా దేశంలో మీడియా సంస్థలైన పత్రికలు ఛానళ్లలో పెద్ద చర్చ లేకపోవడమే అందుకో నిదర్శనం. బడా మీడియా మోడీకి లొంబడిపోయిన నేపథ్యంలో సోషల్‌మీడియానే ప్రత్యామ్నాయంగా ఉంది. దాంట్లో అనేక అవాస్తవాలు అవాంఛనీయ ధోరణులు ఉన్నా అనేక వాస్తవాలు కూడా వెలుగుచూస్తున్నాయి. పైగా సోషల్ మీడియాలో పౌర చొరవకూ పాత్రికేయుల స్వతంత్రతకూ చోటుంటుంది. తప్పొప్పులు సరిచేయాలంటే మీడియా, సోషల్‌మీడియాలో స్వీయ నియంత్రణా వ్యవస్థ ఏర్పాటు కావాలి గాని అధికారవర్గాలకు నిషేధాధికారాలు ఇవ్వడం అనర్థదాయకం. ఎమర్జన్సీలో విధించిన సెన్సార్‌ను మించిన స్వీయ సెన్సారింగ్ మీడియాలో సత్యాలను తొక్కిపడుతున్నదని ఇప్పటికే సాయినాథ్ వంటివారు హెచ్చరించారు. ఈ సమయంలో మోడీపై బిబిసి డాక్యుమెంటరీని అడ్డుకున్న తీరు తాజాగా మన కళ్లెదుటే ఉంది. ఈ కొత్త నిబంధనలు రాజ్యాంగం 19(1)(ఎ)అధికరణంలోని ప్రాథమిక హక్కులకూ భావ ప్రకటనా స్వేచ్ఛకూ కూడా ముప్పు తెస్తాయి. అందుకే ప్రజాస్వామ్య ప్రియులెవరైనా ఇందుకు వ్యతిరేకంగా ఎలుగెత్తిపోరాడాలి.

త్యాగం చేద్దాం రారండి..

ఈ గణతంత్ర శుభదినాన మనదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడినవారిని యాది చేసుకోవాలి. వారి జీవితాల్లోని ముఖ్యమైన సంఘటనల్ని గుర్తుచేసుకోవాలి. వారి త్యాగాలను మననం చేసుకోవాలి. మనకో రాజ్యాంగాన్ని రాసిన మహనీయులను, ఆ రాజ్యాంగం అమలులోకి వచ్చిన గణ తంత్ర దినోత్సవాన్నీ సగర్వంగా జరుపు కోవాలి... అలా నాయకుల ఉపన్యాసాలు సాగి సా.... గిపోతూ ఉంటాయి. అలా పాత నాయకులు చేసిన త్యాగాలేమిటి, నేటి నాయకులు చేసిన త్యాగాలేమిటి అని తెలుసుకుందామని మనసు లబలబలబలాడి పోయింది, గుండె దబడబడల కొట్టేసు కుంది...



జె. రఘుబాబు

చేయడం కష్టంగా, చెప్పడం సులభంగా ఉండేది ఏది? ఒక ఉదాహరణ ఇవ్వండి అని అడిగితే టక్కున సలహా ఇవ్వడం అని చెబుతారు చాలామంది. అయితే దానికి తోడు ఇంకోటి కూడా ఉంది. అదే త్యాగం చేయడం. త్యాగం చేయండని చెప్పడం చాలా సులువు. స్వయంగా చేయడం చాలా కష్టం.

మనవి త్యాగం చేయడం ఒక రకమైతే, ఇతరులవి త్యాగం చేయడం మరో రకం. మొదటిదాన్ని తీసుకున్నట్లైతే స్వాతంత్ర్య పోరాట కాలంలో తమ ఇళ్ళను, ఆస్తులను, తాము చేస్తున్న ఉద్యోగాలను కూడా జాతికోసం త్యాగం చేసేసి బ్రిటిషు వారిపై పోరాటం చేసినవారు ఎందరో. గాంధీ సినిమా చూస్తే తమ మెడలోని దండలను, చేతులకుండే గాజులు, ఉంగరాలు ఒకటేమిటి బంగారం కంటే దేశ ప్రజలందరికీ వచ్చే స్వేచ్ఛనే అసలైన బంగారమనుకొన్నవారు కనిపిస్తారు. అంతేనా, ఎందరో కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు కూడ ఓపక్క స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని ఇంకోపక్క తాము నమ్మిన సిద్ధాంతాల కోసం, పార్టీకోసం సర్వం త్యాగం చేశారు.

ఇక రెండోరకం అత్త సొమ్ము అల్లుడు దానం చేశాడంటారు కదా! ఆ టైపు. నేను పదో తరగతి పాసైతే నీ తలవెంట్రుక లిస్తానని దేవుడి దగ్గర ప్రమాణం చేశాను అన్నట్టే ఉంటుంది. నీతల, నీ తలనీలాలు నీ ఇష్టం. అందులోనూ నీ పరీక్ష కాబట్టి నీ వెంట్రుకలు ఇవ్వడం న్యాయం, ధర్మం కూడా. అలాకాదని నీ పరీక్ష నీవు పాసై, పై తరగతికి నీవు ఏ మంచి కాలేజీకో అంతకంటే మంచి క్రాపుతో పోయి నన్ను గుండుతో ఉండమనడం అన్యాయం కదా! అంటే అందరూ అవును నిజమేనంటారు. అన్యాయమే నంటారు. కానీ ఎన్నుకున్న నాయకుడు అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు దేశానికి, ప్రజలకు చెందిన ఆస్తులను, ప్రభుత్వ సంస్థలను చవకగా అమ్మేస్తుంటే అన్యాయాన్ని అన్యాయంగా చూడరు. అందుకే ప్రజలకు ఇన్ని కష్టాలు.

ఒక సినిమాలో బాబూమోహన్ భలే మంచి చౌకబేరమూ అంటూ అసెంబ్లీ భవనాన్ని అమ్ముతూ ఉంటాడు. త్వరగా కోనుక్కోండయ్యా ఇంకా సాలార్జంగ్ మ్యూజియం, గోల్కొండ, జూ అలా ఇంకెన్నో అమ్మాలి అంటుంటే ఏదో తమాషాకు అనుకున్నాం. అది నిజమని తెలుస్తోందిప్పుడు. అలా ప్రభుత్వ అంటే ప్రజల సొమ్ములను అమ్ముతూ ఉన్నారు అని అపోహ పడకుండా వాటిని తొంభైతొమ్మిదేళ్ళు తక్కువ బాడుగకు లీజుకివ్వడం, అలా లీజుకు తీసుకున్నవాళ్ళు దాన్ని బాగా డెవెలప్ చేస్తారని చెప్పడం చూస్తే అబ్బో మన నాయకులు హాస్యం కూడా బాగా పండిస్తారని తెలిసిపోతుంది మనకు. హాస్యం పరమౌషదం కాబట్టే ఆ ఔషదాన్ని కరోనా సమయంలో గంటలు కొట్టించి ఉచితంగా సేవ చేయలేదూ!! దేనికైనా మన ప్రజలు ఎంతో విశాల



హృదయులు కాబట్టి ఓపికా ఎక్కువే, తట్టుకునే శక్తీ ఎక్కువే అదంతా కూడా త్యాగమే అనుకోవాలి.

ఉద్యోగుల సొమ్ములైన పెన్షన్ నిధులు, పి.ఎఫ్ ఖాతాలోని సొమ్ములను కూడా కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలే త్యాగం చేస్తున్నాయని వార్తలు బయట కొస్తున్నాయి. కూతురు పెళ్ళి ఉంది నాసొమ్ము నేనే డ్రా చేసుకుంటానంటే కూడా దయతలచడంలేదు. ఆ మాత్రం ప్రభుత్వంకోసం త్యాగం చేయలేవా, నీకామాత్రం త్యాగ గుణం లేదా అని ఎదురు మాట్లాడే అవకాశమూ ఉంది.

త్యాగయ్య అంటే ఓ సంగీత విద్వాంసుడని ఎవరైనా చెబుతారు. కానీ

సురుకు

కాలం, దేశం, ప్రపంచం, మనుషులూ మారిపోయి అపర త్యాగయ్యలు, త్యాగమ్మలూ తయారయ్యారు. ఇక ఎన్నికలొస్తే చాలు నోరులేని నాలుక ద్వారా సంగీత ప్రపంచాన్ని, గాయకులను తలదన్నేలా తమ నోటితో హామీల మీద హామీలు కుమ్మరించి తడాఖా చూపిస్తారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకంతో ఇహ చూస్కో అని షురూ చేసినట్టు కనిపిస్తుంది. చెప్పినవాటిల్లో చేసేది అదే మొదటిది, చివరిదీ. ఎన్నికలముందు ఇచ్చిన మ్యానిఫెస్టోలోని మిగతా అంశాలు మరుసటి ఎన్నికలకు త్యాగం చేసేస్తారు.

రెండు రోజుల్లో ఎల్.ఐ.సి సొమ్ము పద్దెనిమిది వేల కోట్లు అమాంతం గాలిలో కలిసిపోయింది. ఇది ఒక మిత్రుడికోసం చేసిన త్యాగమని తెలుసుకోవాలి. స్నేహ బంధం ముందు అన్నీ దిగదుడుపే. ఈ త్యాగాన్ని ప్రజలు భరించాలి. ఊరికే దేశభక్తి అంటూ సినిమా హాల్లో జాతీయ గీతం వచ్చేటప్పుడు నిలబడితే సరిపోదు.

> ప్రభుత్వ అంటే ప్రజల సొమ్ములను అమ్ముతూ ఉన్నారు అని అపోహ పడకుండా వాటినితొంభైతొమ్మిదేళ్ళు తక్కువ బాడుగకు లీజుకివ్వడం, అలా లీజుకు తీసుకున్నవాళ్ళు దాన్ని బాగా డెవెలప్ చేస్తారని చెప్పడం చూస్తే అబ్బో మన నాయకులు హాస్యం కూడా బాగా పండిస్తారని తెలిసిపోతుంది మనకు. హాస్యం పరమౌషదం కాబట్టే ఆ ఔషదాన్ని కరోనా సమయంలో గంటలు కొట్టించి ఉచితంగా సేవ చేయలేదూ!! దేనికైనా మన ప్రజలు ఎంతో విశాల హృదయులు కాబట్టి ఓపికా ఎక్కువే, తట్టుకునే శక్తీ ఎక్కువే అదంతా కూడా త్యాగమే అనుకోవాలి.

ఇలాంటి త్యాగాలే అసలైన భక్తికింద లెక్క. అప్పుడే మీరు దేశ పౌరుల లిస్టులో ఉంటారు. కాబట్టి త్యాగధనుల లిస్టులో ఉంటేనే మంచిదని కొందరి ప్రయత్నం.

ఎమ్మెల్యే లేదా ఎంపీ అయితే ఐదు సంవత్సరాలు ఉండొచ్చు. ఒక్కోసారి ముందస్తు ఎన్నికలంటూ తమవారి నందరినీ రాజీనామా చేయమంటారు. నాకోసం మీరంతా త్యాగం చేసి తీరాలంటారు. మళ్ళీ సీటు గ్యారెంటీనో కాదో చెప్పరు.

అందుకే త్యాగధనుల దేశంలో ప్రజలు తమ బతుకుల్ని త్యాగం చేసినా దేనికోసం చేస్తున్నామో తెలిసి చేయాలి. అంతే తప్ప అపాత్రదానం చేసినట్టు దేశానికి చేటు తెచ్చే త్యాగాలను చేయరాదు. చేయనివ్వ రాదు.

సెల్:9849753298

చేదు గుళికలు

సినిమా హీరోలు, హీరోయిన్లు బయట కనిపిస్తేచాలు... చూసేందుకు వేలాది మంది గూమిగూడటంతో ఆ తొక్కిసలాటలో అపశృతులు జరిగేవి. ఒక్కోసారి మరణాలు కూడా సంభవించేవి. ఇటీవల రాజకీయ నాయకుల పర్యటనల్లోనూ ఈ అపశృతులు దొర్లుతున్నాయి. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కొండగట్టు అంజన్న దర్శనానికి వెళ్లిన సందర్భంలో ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సభలకు జనం కిక్కిసిరిపోవడంతో ఐదారుగురు ప్రాణాలు కోల్పోయారు. అది కాస్త రాజకీయ వివాదమైంది. డబ్బులు, చీరెలు ఇస్తామని ప్రజలను మభ్యపెట్టడంతో జనం భారీగా తరలి వచ్చారనే విమర్శలొచ్చాయి. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కూడా ఓ ఎమ్మెల్యే గుండెపోటుకు గురై మరణించారు. మాజీ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హీరో తారకరత్న తీవ్రమైన గుండెనొప్పితో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమించిందని డాక్టర్లు హెల్త్‌బులిటెన్ విడుదల చేశారు. అధికారంలోకి వచ్చేందుకు అనేక వ్యయ ప్రయాసలకోర్చి పాదయాత్రలు, బస్సుయాత్రలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తుంటే, ఇలాంటి ఘటనలు చోటు చేసుకుండటంతో రాజకీయ నాయకులు ఉలికి పడుతున్నారు. ఇలాంటి విషాదభరిత సంఘటనలతో ప్రజల్లో అదరణ పొందటమేమోగానీ, నాయకులు మాత్రం ఒకింత ఆందోళనకు గురి అవుతున్నారు. ముహుర్తాల ఆధారంగా రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకునే నాయకులకు ఇలాంటి ఘటనలు చేదు గుళికలే..!

- గుడిగ రఘు

హాట్సాఫ్..!

కొంత మంది సర్పంచులు, కార్పొరేటర్లు అయితే చాలు.. 2 కార్లు, ఓ పది మందిని వెనకేసుకుని నానా హంగామా చేస్తూ కార్లలో తిరుగుతున్న కాలమిది. ఇక ఎమ్మెల్యేలు అయితే చాలు ఐదారు కార్లు, ఓ 50మందిని వెంటేసుకొని తిరుగుతున్న సందర్భం ఇది. ఇక మంత్రులు అయితే చెప్పక్కర్లేదు. ఇది నాణానికి ఒకవైపే. మరోవైపు కమ్యూనిస్టు ప్రజా ప్రతినిధులు దీనికి భిన్నమని మరో మారు నిరూపితమైంది. బెంగళూరు నగరంలో ఇటీవల ఐదు రోజులపాటు జరిగిన సిఐటియు 17వ మహాసభలకు కేరళ నుంచి ఇద్దరు మంత్రులు(శివన్ కుట్టి, వాసవన్) జార్ఖండ్ నుంచి మరో మంత్రి(బాబుబ్రసే) హాజరయ్యారు. ఆ ముగ్గురు తాము మంత్రులమనే దర్పణాన్ని ఎక్కడా ప్రదర్శించలేదు. అందరి ప్రతినిధుల మాదిరిగానే తమ రాష్ట్రం వారికి కేటాయించిన ఆర్టీసీ బస్సుల్లోనే మహాసభల ప్రాంగణానికి రోజూ వెళ్లారు. తమ రాష్ట్రానికి కేటాయించిన స్థలంలోని సీట్లలోనే ఆసీనులయ్యారు. తమకిచ్చిన వసతిలోనే నిద్రించారు. వారి వెంట గన్‌మెన్లు కానీ, కార్లు గాని లేకపోవడం గమనార్హం. ఓ కమ్యూనిస్టు మంత్రులారా మీ సాధారణ జీవన విధానానికి హాట్సాఫ్.

- అచ్చిన ప్రశాంత్

సేవ చేయాలనే తపన గొప్పది. అందులోనూ జీవితాన్నే త్యాగం చేసి సేవకే అంకితం కావాలనే సంకల్పం మరింత గొప్పది. స్వార్థంతో నిండిపోయిన సమాజంలో మంచి మాటకై, ఒక ప్రేమ పూరిత పలకరింపుకై తపించి పోతున్న వారు ఎందరో ఉన్నారు. అటువంటి వారికి తన చిరునవ్వుతో, ప్రేమగా దగ్గరకు వెళ్లి వారి సాధక బాధలు తెలుసుకుని మాటలతో ధైర్యాన్ని నింపి, కొత్త జీవితాన్నీ సంతోషంగా స్వాగతించేలా చేస్తున్నారు డా.చిన్మయి తమ్మారెడ్డి. ఆమె గురించి మరిన్ని విశేషాలు నేటి మానవిలో...

ప్రేమతో ఏదైనా జయించవచ్చు



మనిషికి జీవితంలో ప్రధానంగా కావాల్సింది మానసిక స్థైర్యం. అది కొరవడిన నాడు ఎన్నో చెడు ఆలోచనలు మెదడులోకి దూరతాయి. వాటి ద్వారా జీవితం అంటే భయపడి పోయి, ఆత్మవిశ్వాసం కోల్పోవడం సహజం. చివరకి చావే శరణ్యం అనుకున్న వారిని మన నిత్య జీవితంలో చూస్తూ ఉంటాం. ఇటు వంటి సంఘటనలు చూసి చిన్మయి చలించిపోయేవారు. వారి జీవితాలను నిలబెట్టాలని తపించేవారు. వారికి జీవితంపై ఆశ కలిగించాలి అనే ఆలోచన వచ్చిందే తడవుగా ప్రభుత్వ పాఠశాలలు, చుట్టూ ప్రక్కల గ్రామాలకు వెళ్లి కౌన్సెలింగ్ ఇవ్వడం మొదలుపెట్టారు.

సామాజిక సేవాభావాలున్నందున

ప్యాషన్ డిజైనింగ్ పట్ల అభిరుచి ఉన్నప్పటికీ తనకు తగిన చదువు అది కాదనుకున్నారు. సేవతోనే ఎదుటివారి జీవితాలలో వెలుగును నింపవచ్చనే ఆలోచనతో బీఏ సైకాలజీ చదివారు. ఇంకా విద్యా ర్హతలు పెంచుకోవాలని, దాని వల్ల మనుషుల మానసిక స్థితిగతులు బాగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది అని అమెరికా విశ్వవిద్యాలయల నుండి ఎమోషనల్ ఇంటెలిజెన్స్, లైఫ్ కోచింగ్ డిప్లొమాలు పూర్తి చేశారు.

సేవకే అంకితం

చిన్నతనం నుండి జీవితంలో ఎప్పుడు సంతోషంగా ఉండాలనే కోరుకునే మనస్తత్వం ఆమెది. అందుకే ఏ ఇబ్బంది వచ్చినా, బాధ అనిపించినా వాటిని వదిలేసి సంతోషంగా ఉండే జోన్‌లోకి వెళ్తుంటారు. ఈ లక్షణాలు స్వతహాగా వచ్చినవే అవడం వలన వీటితో ఎదుటి వారి జీవితాలు సరిదిద్దడం కోసమే ఆమె పుట్టి ఉండవచ్చు. తన మాటలు, చిరునవ్వుతో ఎన్నో వేల కుటుంబాలను నిలబెట్టారు. తన సేవలకు ఎటువంటి ఆటంకాలు కలగకూడదనే ఉద్దేశంతో చివరకు వివాహం కూడా చేసుకోలేదు.

మోటివేషన్ కోసం

కౌన్సెలింగ్ అవసరం ఎందరికో ఉండవచ్చు. కానీ ఆర్థిక పరిస్థితుల రీత్యా వారు కౌన్సెలింగ్‌కి వెళ్లలేక పోతున్నారు. అటు వంటి వారికి ఉచితంగా సేవలు అందిస్తారు. గ్రూప్ మోటివేషనల్ క్లాస్సెస్ చేపడుతూ ఉంటారు. షీ టీమ్స్, భరోసా వారి కోసం ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్ చేస్తూ ఉంటారు. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి పిల్లలకు మోటివేషనల్ క్లాస్సెస్ చెప్తూ ఉంటారు. నేటి సమాజంలో పిల్లలు తల్లి తండ్రుల మాటలను వినకుండా, వివిధ ఆకర్షణలకులోనై అనేక సమస్యలు కొని తెచ్చు కుంటున్నారు. అటువంటి వారికి పరిస్థితులను బట్టి జీవితాన్ని ఎలా మలుచుకోవలో, మనం చేసే పనులు





మన జీవితంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో, స్వీయ నియంత్రణ ఎలా సాధించవచ్చు అనే వాటి గురించి వివరించి చెప్తారు.

అనేక మానసిక రుగ్మతలతో...

ప్రతి మనిషి ముందుగా తనని తాను ప్రేమించు కోవాలి. అలాగే పిల్లలను ప్రేమగా పెంచాలి. ప్రేమతో ఏదైనా సాధించవచ్చు. ఈ మధ్య కాలంలో విపరీత ధోరణులతో వ్యక్తులు జీవిస్తున్నారు. బలాత్కారాలు, హత్యలు, ప్రేమ పేరుతో వంచనలకు గురిచేయడం, యాసిడ్ దాడులకు ఒడిగట్టుతున్నారు. ఇలా అనేక



రకాల మానసిక రుగ్మతలు కలిగిన వారి గురించి మనం వింటున్నాము. కొందరిని చూస్తున్నాము. సమాజం ఎటు పోతోంది.? ఎందుకు వీళ్ళు ఇలా ప్రవర్తిస్తున్నారు.? ఇటువంటి దుర్ఘటనలు కొనసాగకుండా ఉండలంటే ముందుగా యువతలో మార్పు తీసుకురావాలని ప్రేమతో చెప్తే ఎవరైనా సరే ఈరోజు కాకపోయిన ఏదో ఒకరోజు తప్పక వింటారనే విశ్వాసంతో యువతకు కౌన్సెలింగ్ చేస్తున్నారు.

బాధ్యత తీసుకోవాలి



పిల్లలను ఎప్పుడు ఒక కంట కనిపెట్టి ఉండాలని, చదువు ఒక్కటే కాదు వారికి ఇష్టమైన వ్యాపకాలలో కూడా ప్రోత్సాహం అందించాలని ఆమె అంటున్నారు. ఎప్పుడు మొబైల్ ఫోన్లు చూడటం, కంప్యూటర్ల ముందు కూర్చోవడం సరైనది కాదని ఆమె గట్టిగా చెబుతున్నారు. వారిని ఇష్టమైన వ్యాపకాలలో బిజీగా ఉండేలా చూసే బాధ్యత తల్లి తండ్రులదే అని అంటున్న చిన్మయి సినీ ప్రముఖులు మనీషా కోయిరాలా, జగపతిబాబు, ఈషా డియోల్, సురేఖ వంటి వారికి కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు.

– పాలపర్తి సంధ్యారాణి

మీ ఎదుగుదలకు అడ్డం కావొద్దు



కొందరు ఉద్యోగినులు... బాధ్యతల్ని ఎంత సక్రమంగా నిర్వర్తించినా సరే, నలుగురిలోనూ ప్రెజంటేషన్లు ఇవ్వాలన్నా, సెమినార్లూ, మీటింగ్‌లకు నాయకత్వం వహించాలన్నా.. వెనకడుగు వేస్తారు. దీనికి కారణం.. ప్రతిభ లేక కాదు... ఎవరైనా ఏమైనా అనుకుంటారనే భయం. ఈ తీరు మీ ఎదుగుదలకు అడ్డంకి అవుతుంది అంటారు కెరియర్ నిపుణులు.

- ఏదైనా చేయాలని అనుకున్నప్పుడు ఇతరుల సంగతి పక్కనపెట్టి ముందు మిమ్మల్ని మీరు నమ్మండి. అందరికీ అన్నీ తెలిసి ఉండాలని ఏమీ లేదు. కానీ పనిపై పూర్తి అవగాహనతో చేస్తే... తడబాటుకి అవకాశం ఉండదు. ఆందోళన దరిచేరదు.
- గెలుపోటముల్ని సమానంగా తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. పనిలో విమర్శను సానుకూలంగా తీసుకోవాలి. ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తున్నారంటేనే మీరు వాళ్ల గుర్తించదగ్గ ఏదో ఒకపని చేస్తున్నారనే అర్థం. అయినా అసలు ప్రతికూలంగా ఆలోచించడం ఎందుకు? మీ ఆలోచన అద్భుతం అనికూడా అందరూ ప్రశంసించే అవకాశమూ ఉంది కదా. నలుగురిలో ఒకరిలా ఉండి పోతారు. మీ ఆలోచనలు బావుండొచ్చూ, లేకపోవచ్చు.. కానీ అవి చెప్పకుంటే 'అసలు ఈ అమ్మాయికి ఏ ఆలోచనా లేదు' అనే ముద్రపడుతుంది. అదే అసలైన ప్రమాదం.
- మీరూ, మీ కెరియర్ వేర్వేరు అనే విషయం గుర్తుంచుకోండి. చదువు లేదా ఉద్యోగంలో మీ విజయాలూ, ఓటముల్ని మీ వ్యక్తిత్వం నుంచి వేరుగా చూడండి. వీటిలో పాతాళానికి పడిపోయినా సరే దాని ప్రభావం మీ వ్యక్తిత్వంపై పడకుండా చూడండి. అప్పుడే ఎన్ని విమర్శలొచ్చినా వాటి మంచి చెడుల్ని తార్కికంగా ఆలోచించగలరు.

ఆవిరి పట్టండి



ముఖం అందంగా కనిపించాలని ఎవరికి ఉండదు. ఇందుకోసం మనకు తెలిసిన అన్ని బ్యూటీ టెక్నిక్‌లూ పాటించేస్తాం. వాటన్నింటినీ పక్కన ఉంచి ఈసారి ఆవిరి పట్టి చూడండి. కచ్చితంగా మీ మోము మెరిసిపోతుంది.

- చర్మం లోపలి పొరల్లో పేరుకున్న దుమ్మూ, ధూళీ, ఇతర మలినాలను శుభ్రపరచడానికి ఆవిరి ఉపయోగపడుతుంది. సాధారణంగా బ్లాక్‌హెడ్స్, వైట్‌హెడ్స్‌ని తీయాలంటే నొప్పి తప్పదు. కానీ ఆవిరి పడితే... వాటిని సులువుగా తీసేయొచ్చు. మృతకణాలు బయటికి వచ్చేస్తాయి. ఫలితంగా మొటిమలు తగ్గుతాయి.
- ఆవిరి చర్మానికి తేమనందిస్తుంది. అలాగని ఎక్కువ సేపు పెడితే... నూనె స్రవించే సహజ గ్రంథులు పొడి బారిపోతాయి. అవి ముడతలకు దారి తీయొచ్చు.
- మోము సహజ మెరుపుతో కనిపించాలంటే... ఆవిరి పట్టాలి. ఇది రక్త ప్రసరణను మెరుగు పరుస్తుంది. ఫలితంగా కొలాజెన్, ఎలాస్టిన్ ఉత్పత్తి పెరుగుతుంది. దాంతో చర్మం యౌవనంగా కనిపిస్తుంది.

ఈ సారైనా నిధులు పెరిగేనా?

(మొదటిపేజి తరువాయి)

సంబంధించి డాక్టర్లు, నర్సులు, మేధావులు, నిపుణుల నుంచి అనేక సూచనలు వస్తున్నాయి. వాటి అమలుకు కేంద్రం బడ్జెట్‌లో తగినంతగా నిధులు కేటాయించాల్సి ఉన్నది. కేంద్రంలోని బీజేపీ సర్కారు చివరి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఈ రంగానికి చెందిన నిపుణులు, ఐఎంఏ తదితర సంఘాల నుంచి పలు సలహాలు వస్తున్నాయి.

బడ్జెట్‌లో 2025 నాటికి జీడీపీలో 2.5శాతం కేటాయించేలా ప్రతి ఏడాది పెంచుకుంటూ వెళ్తామని మోడీ సర్కార్ 2017లో ఆరోగ్య విధానాన్ని రూపొందించింది. ఆ మేరకు నిధులు పెరగకపోగా గతేడాది నాటికి కేటాయిం పులు 1.1శాతం వద్దే ఆగిపోయాయి. ఆరోగ్య రంగానికి రూ.89 వేల కోట్లు కేటాయించగా, ఇందులో రూ.83 వేల కోట్లు రెవెన్యూ ఖర్చులు కాగా రూ.5,630 కోట్లు క్యాపిటల్ ఖర్చులుగా విభజించారు. ప్రతి ఏడాది 99,063 మంది ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని బయటికి వస్తుండగా, అదే స్థాయిలో నర్సింగ్, పారామెడికల్ కోర్సులను పూర్తి చేసేందుకు అవకాశాలు లేకపోవడం గమనార్హం. ప్రతి 15



వేల మందికి 24 గంటలు పని చేసే ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవసరముండగా, ఇప్పటికీ 30 వేల మందికి ఒక పీహెచ్‌సీ, అదీ కూడా కొన్ని గంటలు మాత్రమే పని చేసేలా ఉన్నాయి. మరిన్ని ఫస్ట్ రెఫరల్ యూనిట్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరమున్నది. భవనాల మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కింద రూ.64,180 కోట్లు వెచ్చించనున్నట్టు ప్రకటించినప్పటికీ, గత రెండేండ్లలో కేవలం రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. 2022లో జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ.37 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, నివారణ, చికిత్స కోసం ఈ నిధులను పెంచాల్సిన అవసర మున్నది. మానవ వనరుల అభివృద్ధికి రూ.7,500 కేటాయించడంతో, ఇప్పటికీ అర్హత, తగిన శిక్షణ పొందిన ఆరోగ్యసంరక్షణ సిబ్బంది చాలినంత మంది లేక కొరతను ఎదుర్కొంటున్నారు.

జీఎస్టీని తొలగించాలి

ఆరోగ్యరంగ సేవలపై జీఎస్టీ వేయడాన్ని ఉపసంహరించుకోవాలని నిపుణులు కోరుతున్నారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో చేసే చికిత్సల రేట్లు తక్కువగా ఉంటున్నాయనీ, వాటిపైనా జీఎస్టీ విధిస్తుండటం తగదని సూచిస్తున్నారు. ఇతర చికిత్సలు, వైద్య సదుపాయాలు, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు వేసే పన్నులు పరోక్షంగా ప్రజల వైద్యఖర్చులను పెంచుతున్నాయి. వారి జేబులకు చిల్లులు పెడుతున్నాయి. కరోనా మహమ్మారి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడే క్రమంలో దేశవ్యాప్తంగా 2,000 మంది డాక్టర్లు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చాలా కుటుంబాలకు ఇప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం అందలేదు. వీరి కోసం ప్రత్యేక నిధి ఏర్పాటుకు ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో నిర్ణయం తీసుకుంటారని ప్రజలు ఆశిస్తున్నారు. వృద్ధుల కోసం ప్రత్యేక క్లినిక్ లు, ఇంటి వద్ద సేవలందించడం తదితరమైన వాటిపైనా దృష్టి సారించాల్సిన అవసరముంది. వలస కార్మికుల ఆరోగ్య పరిస్థితి మిగిలిన వారితో పోలిస్తే దుర్భరంగా ఉంటుండడంతో వారి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉన్నది.

దేశంలో ఇప్పటికీ 44 శాతం మంది ప్రజలు ప్రయివేటు డాక్టర్లు, క్లినిక్‌లు, నర్సింగ్ హోంలకు వెళ్లేందుకు ఆసక్తిగా ఉన్నారని ఐఎంఏ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ శరద్ కుమార్ అగర్వాల్,

క్లినిక్‌లను కాపాడుకోవాలి

డాక్టర్ అనిల్ కుమార్ జె.నాయక్ తెలిపారు. ప్రభుత్వరంగానికి, కార్పొరేట్ కు మధ్యస్తంగా ఉండే వీరి సేవలను ప్రోత్సహించాలని వారు కోరారు. తక్కువ ఖర్చుతో ప్రజారోగ్య పరిరక్షణలో సొంత క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు నడుపుతున్న డాక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అభిప్రాయపడ్డారు.

అమెరికా పోలీసుల చేతిలో మరో నల్లజాతీయుడు బలి

(మొదటిపేజి తరువాయి)

జో బైడెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నికోలస్ మృతికి బైడెన్ సంతాపం వ్యక్తం చేశారు. అతని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాగా, నికోలస్ మృతి పట్ల అతని తల్లి రోవ్‌వాన్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... 'నా కుమారుడిని పోలీసులు నుజ్జు నుజ్జుగా కొట్టడం తెల్ల జాతీయుల పరువు తీయడమే' అంటూ కన్నీరు పెట్టుకున్నారు. అయితే నికోలస్ మద్యం సేవించి డ్రైవ్ చేయడం వల్లే తనను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. కానీ పోలీసుల ప్రవర్తనకు ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు తన కుమారుడిని కొట్టిన దెబ్బలను కప్పిపుచ్చుకునేందుకు మద్యం సేవించారని అబద్ధాలు చెబుతున్నారని ఆమె ఆరోపించారు.

హిమాయత్‌నగర్‌లో కుంగిన రోడ్డు

(మొదటిపేజి తరువాయి)

డ్రైవర్, ఇద్దరు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నారాయణగూడ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, వారిని ఆస్పత్రికి తరలించారు. వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది కలిసి క్రేన్ సహాయంతో టిప్పర్‌ను బయటకు తీశారు. అటుగా వాహనాల రాకపో కలను నిలిపివేశారు. నాణ్యత లేని రోడ్ల నిర్మాణం వల్లే తరచూ నగరంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

స్వాతంత్ర్య పోరాటంలో సామాన్యులెందరో...

(మొదటిపేజి తరువాయి)

తరానికి స్వాతంత్ర్య సమరయోధుల గురించి అవగాహన కల్పించలేకపోయిందని విమర్శించారు. అల్లూరి సీతారామరాజు, మల్లు స్వరాజ్యం వంటి వారు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ధీరోదాత్తమైన పోరాటాన్ని నిర్వహించారని గుర్తు చేశారు. ఒరిస్సా బార్గా జిల్లా పానీమోరా ప్రాంతంలో 42 మంది సామాన్యులు పోరాడారని గుర్తుచేశారు. మల్లు స్వరాజ్యం లాంటి వారు తుపాకులు పట్టి పోరాటం నిర్వహించారనీ, ఆమె రజాకార్లకు ధీటుగా నిలబడిన వీరవనిత అని గుర్తుచేశారు. స్వాతంత్ర్య పోరాటం పిడికెడు మందికి పరిమితమైంది కాదనీ, రైతులు, కూలీలు, గృహిణులు, అటవీ ఉత్పత్తులపై ఆధారపడ్డ వారు సైతం తమ తమ పరిధుల్లో బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా నిలబడ్డారని తెలిపారు. గాంధీయన్లతో పాటు వామపక్షవాదులు, అంబేద్కరిస్టులు, ఆదివాసీలు, దళితులు, ఓబీసీలు, బ్రాహ్మణులు, ముస్లింలు, సిక్కులు, హిందువులు పోరాటంలో భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. 1947 తర్వాత తరానికి ఈ వాస్తవాలు తెలియాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన తరంలో ఇప్పుడు కొద్ది మంది మాత్రమే మిగిలారనీ, వారంతా ఐదారు సంవత్సరాల కన్నా ఎక్కువగా బతికే అవకాశం లేదని చెప్పారు. ఆజాదీ అని నినదించినందుకు ఐదుగురు విద్యార్థులను ఏడాది పాటు జైలుకు పంపిన కేంద్రంలోని బీజేపీ సర్కారు 'ఆజాదీ' అనేది తమ ఆస్తి అయినట్టు ఉత్సవాలు నిర్వహించిందని ఎద్దేవా చేశారు. దామోదర వినాయక సావర్కర్ జైలుకెళ్లేంత వరకూ విప్లవ భావాలు కలిగే ఉన్నారనీ, అనంతరం బ్రిటీష్ ప్రభుత్వంతో రాజీ పడ్డారని తెలిపారు. తనను క్షమిస్తే తప్పుదోవ పట్టిన యువతను తిరిగి బ్రిటీష్ వారికి అనుకూలంగా నడిపిస్తానంటూ నాటి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సావర్కర్ రాసిన ఏడు ఉత్తరాల్లో ఐదు ఉత్తరాలు నేషనల్ ఆర్కైవ్‌లో ఇప్పటికీ ఉన్నాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో పోరాడిన వారిని పట్టుకున్న పోలీసులకు పేర్లు చెప్పేందుకు నిరాకరిస్తే వారి పేర్లను ఎ, బీ, సీ, డీగా రాసుకున్నారనీ, వారిని జైలులో ఉంచేందుకు జైలరు కూడా అనుమతించలేదని వివరించారు.. ప్రజలు తమ చరిత్రను తాము చదువుకోవాలనీ, నిజమైన చరిత్రను తెలుసుకునేందుకు స్వాతంత్ర్య సమరయోధులను కలుసుకుని వారితో ముచ్చటించాలని సూచించారు. ఆ పోరాట వాస్తవ చరిత్రను చెప్పేందుకే తాను పుస్తకం రాసినట్టు తెలిపారు.

ఫ్లోరోసిస్ బాధితుడు అంశాల స్వామి మృతి

(మొదటిపేజి తరువాయి)

తనలాంటి సమస్యతో బాధపడుతున్న వారి తరపున గట్టిగా పోరాడారు. ఫ్లోరైడ్ రక్కసి పోరాటంలో భాగంగా జలసాధన సమితిని స్థాపించిన దుశ్చర్ల సత్యనారాయణ, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి కన్వీనర్ కంచుకట్ల సుభాష్ అప్పట్లోనే ఫ్లోరైడ్ బాధితులను ఢిల్లీకి తీసుకెళ్లారు. స్వయంగా నాటి ప్రధాని వాజ్‌పేయ్ టేబుల్‌పై ఐదేండ్ల వయస్సున్న అంశాల స్వామిని కూర్చోబెట్టి సమస్యను వివరించారు. వరుసగా ఢిల్లీలో ఐదుగురు ప్రధాన మంత్రులను కలిసి బాధితుల గోడును వివరించారు.

గతేడాదే అంశాల స్వామి సొంత ఇంటి కల నెరవేరింది. మంత్రి కేటీఆర్ సాయంతో ఇంటిని పూర్తి చేశాడు. ఉపాధి కోసం హెయిర్ కటింగ్ షాపు ఏర్పాటు చేయించారు. గృహప్రవేశ కార్యక్రమానికి హాజరుకాని కేటీఆర్.. మునుగోడు ఉపఎన్నిక సందర్భంలో స్వామి ఇంటికి వెళ్లారు. స్వయంగా స్వామి యోగక్షేమాలు, ఇంటి నిర్మాణం గురించి ఆరా తీశారు. స్వామితో కలిసి మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి భోజనం చేశారు. స్వామి కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా కల్పించిన సంగతి తెలిసిందే.

మానవీయ కోణాన్ని తట్టి లేపిన స్వామి : సీఎం కేసీఆర్

ఫ్లోరోసిస్ నిర్మూలన కోసం తన జీవిత కాలం పోరాడిన అంశాల స్వామి మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సామాజిక సమస్యగా మారిన ఫ్లోరోసిస్ సమస్యతోపాటు తక్షణమే గుర్తుకు వచ్చే పేరు అంశాల స్వామి అని సీఎం గుర్తుకు చేసుకున్నారు. మానవీయ కోణాన్ని తట్టి లేపుతూ తెలంగాణ ఉద్యమంలో అంశాల స్వామి చేసిన పోరాటం ఎందరికో



స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. స్వరాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం ద్వారా, ఫ్లోరోసిస్ రహిత శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే దృఢ సంకల్పానికి, ఫ్లోరోసిస్ బాధితులైన అంశాల స్వామి వంటి వారే ప్రేరణగా నిలిచారని తెలిపారు. సీఎం స్వామి మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

స్వామి మృతి పట్ల మంత్రి కేటీఆర్ దిగ్భ్రాంతి

స్వామి మరణ వార్త విన్న మంత్రి కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ట్విటర్ వేదికగా కేటీఆర్ స్పందించారు. స్వామి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్వామి ఫ్లోరోసిస్ నివారణ, బాధితుల కోసం పోరాటం చేసిన గొప్ప యోధుడని కొనియాడారు. ఎంతో మందికి ఆయన ఆదర్శమన్నారు. స్వామి ఎప్పుడూ తన హృదయానికి దగ్గరగా ఉంటాడని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ట్వీట్ చేశారు.

దమ్ముంటే పార్లమెంట్‌ను రద్దు చేసి..

ముందస్తుకు వెళ్లండి

(మొదటిపేజి తరువాయి)

తీసుకొస్తానని హామీ ఇచ్చి, ఇక్కడ ఉన్న జూట్ బోర్డును ఎత్తేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా తెలంగాణపై కక్ష సదింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రం నుంచి వసూలు చేస్తున్న పన్నులను ఇతర రాష్ట్రాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నినాదం సబ్ కా వికాస్, సబ్ కా జీవన్, సబ్ కా బక్వాస్ అని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని, కానీ తాము మాటల్లోకి దిగితే మీ తాత, తండ్రి గుర్తుకు వస్తారని అన్నారు. పెద్దాయన కొడుకువని ఊరుకుంటున్నామని, మీ తండ్రి(డీఎస్‌ను)ని గౌరవిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కెఆర్.సురేష్ రెడ్డి, ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ , బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు.

ముందస్తు అరెస్టులు

మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలని, ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీని నిర్మించాలని డిమాండ్ చేస్తూ మంత్రిని పర్యటనను అడ్డుకుంటామని పిలుపునివ్వడంతో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేశ్‌తోపాటు పలువురిని అరెస్టు చేశారు. మంచిప్ప భూ నిర్వాసితులు ఆందోళన చేపట్టకుండా ఆ గ్రామంలో పోలీస్ పికెట్ నిర్వహించారు. ముంపు బాధితులెవరూ ఊరి దాటి వెళ్లకుండా బందోబస్తు చేపట్టారు. కాగా, కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించిన కాంగ్రెస్, బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

సమాచారానికి సంకెళ్లు..

(మొదటిపేజి తరువాయి)

సమాచార కమిషన్ల వద్ద మూడు లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

కొత్త ఐటీ నిబంధనలు

ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా సంస్థల్ని తమ చెప్పు చేతుల్లో పెట్టుకునేందుకు 'ఐటీ నిబంధనలు, 2021'ని తెరపైకి తెచ్చింది. ఇందులోని పలు నిబంధనల్ని చూపుతూ బెదిరిస్తోంది. ఇందులోని 'అత్యవసర అధికారాలు' అనేది ప్రయోగిస్తూ 'బీబీసీ డాక్యుమెంటరీ'పై కేంద్రం నిషేధ ఉత్తర్వులు జారీచేసింది. దాంతో ఈ వీడియో, వాటి లింకులు, స్పందనలు.. అన్నింటినీ ట్విట్టర్, యూట్యూబ్ తొలగించాల్సి వచ్చింది. తొలగించిన వాట్లో ప్రఖ్యాత న్యాయవాది ప్రశాంత్ భూషన్ ట్వీట్ కూడా ఉంది. వాస్తవానికి కొత్త ఐటీ నిబంధనలు, 2021..ఒక ముసాయిదా బిల్లు మాత్రమే. అయితే ఇది పార్లమెంట్ ముందుకు రాకుం డానే, పార్లమెంట్ సమీక్షించకుండానే అమల్లోకి తెచ్చింది. ప్రభుత్వ సమాచారం ఫేక్ అని 'ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో' గుర్తిస్తే, ఇక దానిని మీడియా సంస్థలు ప్రసారం చేయరాదంటూ కేంద్ర సమాచార, ఎలక్ట్రానిక్, టెలి కమ్యూనికేషన్ శాఖ హడావిడి చేస్తోంది ఈ వ్యవహారంపై దేశంలోని పలు మీడియా సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ముసాయిదా బిల్లులోని వివాదాస్పద అంశాల్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశాయి.

'కారు' చిచ్చు

- ఓవైపు అసమ్మతి రాగాలు.. మరోవైపు అవిశ్వాస అలజడులు
- సతుల స్థానంలో పతుల అధిపత్యం
- మానకొండూర్‌లో ఓ అధికారిపై ఎంపీపీ భర్త దౌర్జన్యం
- ఎమ్మెల్యే వర్సెస్ చైర్‌పర్సన్‌గా జగిత్యాల రాజకీయం
- మంత్రి కేటీఆర్ ఇలాకాలోనూ గ్రూపుల కొట్లాట
- ఇప్పటికే క్యాంపులతో బుజ్జగించేందుకు నేతల యత్నాలు
- ఇప్పటికే గోవా ట్రిప్‌కెళ్లొచ్చిన కరీంనగర్ నియోజకవర్గ 'స్థానిక' నేతలు


మానకొండూర్‌లో ఎంపీపీ భర్త దౌర్జన్యం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి:

ఎన్నికలకు మరో ఏడాది ఉందనగానే.. అధికారపార్టీలో అక్కడక్కడా 'కారు' చిచ్చు మొదలైంది. అదీ ముఖ్యంగా మున్సిపల్ స్థానిక సంస్థల నేతల్లోనే బాహాటంగా కనిపిస్తోంది. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఏకంగా స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌ను టార్గెట్‌గా విమర్శలు చేస్తూ కన్నీరుమున్నీరైన ఘటన సంచలనం రేపగా.. మంత్రి కేటీఆర్ ఇలాకాలోని సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గంలో గ్రూపుల కొట్లాట నివురుగప్పిన నిప్పులానే ఉంది. మరోవైపు 'స్థానిక' నేతల్లో పదవి భార్యకు ఉంటే భర్తల ఆధిపత్యానికి అవధుల్లేవనే చెప్పవచ్చు. ఇందుకు రెండురోజుల క్రితం మానకొండూర్ ఎంపీపీ భర్త ఆమె కార్యాలయంలోనే పంచాయతీ ఏఈని దుర్భషలాడుతూ బాటిల్ విసిరిన ఘటన అద్దం పడుతోంది. మరోవైపు గ్రూపు రాజకీయాలను నిలువరించేందుకు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు క్యాంపులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కరీంనగర్ నియోజకవర్గ స్థానిక సంస్థల నేతలు మంత్రి గంగుల ఇచ్చిన గోవా టూర్ ముగించుకుని రావడం గమనార్హం.

వాటాల్లో వివాదం.. చైర్మెన్ పీఠం కోసం కొట్లాటలు...

స్థానిక సంస్థల్లో అభివృద్ధి పనుల కాంట్రాక్టుల్లో వాటాల అంశంపైనా అక్కడక్కడా ఒకరినొకరు గుర్రుగా ఉంటున్నారు. ప్రధానంగా కాంట్రాక్టర్ల నుంచి వచ్చే కమీషన్ల మొత్తాన్ని పెంచాలనే ప్రతిపాదనలూ తీసుకొస్తున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేను కాదని సమావేశాలూ నిర్వహించారు. ఇదే సమయంలో కాంట్రాక్టు పొందినవారికి సకాలంలో బిల్లులురాక.. ఇచ్చే కమీషన్ మొత్తాన్ని తగ్గించుకోవాలనే ఒత్తిడి చేసినా ఫలితం లేక కొన్ని చోట్ల పనులు మధ్యలోనే నిలిపివేస్తున్న ఘటనలూ ఉన్నాయి. 2020 జనవరిలో కొన్ని పురపాలిక సంఘాల్లో చైర్మన్ స్థానాల కోసం కొందరు పోటీ పడ్డారు. అంతర్గత సమస్యలు రాకుండా చూస్తేందుకు మూడేండ్ల కాలపరిమితి దాటాక అవకాశం ఇస్తామని కొందరికి హామీ ఇవ్వడం, ఇప్పుడు ఆ సమయం సమీపించడంతో ఎమ్మెల్యేల వద్ద చక్కర్లు కొడుతున్నారు. సానుకూల పరిస్థితి కనిపించకపోయేసరికి అవిశ్వాస అలజడిని సృష్టిస్తున్నారు. మిగిలిన రెండేండ్ల కాలానికైనా తమకు అవకావం ఇవ్వాలనే డిమాండ్ వస్తోంది.

బిల్లుకు ఆమోదముద్ర పడకపోవడంతోనే అవిశ్వాసానికి అవకాశం

ప్రస్తుతం అన్ని పురపాలికల్లో పదవీకాలం మూడేండ్లు దాటవస్తోంది. ఇదే సమయంలో ఈ ఏడాది సాధారణ ఎన్నికలకూ అవకాశం ఉండటంతో స్థానిక ఎమ్మెల్యేలు ఆందోళన పడుతున్నారు. అయితే అవిశ్వాసాలకు తావివ్వకుండా రాష్ట్ర సర్కారు మూడేండ్ల కాలపరిమితిని నాలుగేండ్లకు పెంచుతూ ఉభయసభల్లో బిల్లును ఆమోదించింది. అయితే అది గవర్నర్ ఆమోద ముద్ర పడకపోవడంతో చట్టప్రకారం నోటీసు ఇస్తే తాము దాని ప్రకారం నడుచుకోవాల్సిందేనని అధికారులు చెబుతుండటం గమనార్హం.

మచ్చుకు కొన్ని...

– 8 నెలల క్రితం రాజన్నసిరిసిల్ల పట్టణంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లలో కొంత మంది కౌన్సిలర్లు డబ్బులు వసూల చేస్తే అందరూ అలాగే ఉన్నారన్న ముద్ర వేయడం ఏంటని పలువురు కౌన్సిలర్లు గొడవకు దిగారు. అందరినీ బదనాం చేయడమే కాకుండా తమనూ దోషులుగా చూస్తున్నారని వారు బాహాటంగానే ఆగ్రహం వ్యక్తం చేశారు.

– సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త కౌన్సిల్ నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు గొడవకు దిగారు. మరోవైపు ఇక్కడి అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టు ఇచ్చేప్పుడు కూడా ఏకపక్షంగా తమకు అనుచరులకు ఇవ్వడం పైనా గుస్సా నడుస్తోంది. దీంతో అప్పుడు ఏకంగా చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా మెజార్టీ కౌన్సిల్ సభ్యులు రహస్యంగా సమావేశవడం అప్పుడు సంచలనం రేపింది.

– సెస్ ఎన్నికల కంటే ముందు ఆ సంస్థలో పదవులన్నీ నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. దీంతో ఎన్నికలు నిర్వహించాలని అధికారపార్టీ నేతలు సహా పలువురు విపక్షనాయకులు కోర్టుమెట్లెక్కారు. తీరా ఇటీవల ఎన్నికలు జరిగి అధికారపార్టీయే ఆ సంస్థ డైరెక్టర్‌స్థానాలన్నీ కైవలం చేసుకుని సెస్‌పీటాన్ని దక్కించుకుంది.

– గతేడాది జులై 4న సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మెన్ గాజుల నారాయణపై స్థానిక మంత్రి కేటీఆర్‌కు సమాచారం ఇవ్వకుండానే స్థానిక నేతలు అవిశ్వాసం పెట్టడంతో ఆ పార్టీలో అంతర్గత విభేదాలకు అద్దంపట్టింది.


విలేకరుల సమావేశంలో కన్నీటి పర్యంతమవుతోన్న జగిత్యాల చైర్‌పర్సన్

– జగిత్యాల మున్సిపాలిటీ పాలవర్గంలో నాలుగు రోజుల క్రితం అవిశ్వాస అలజడి రగులుకుంది. మొత్తం 38 కౌన్సిలర్లు ఉన్న ఆ పురపాలికలో 27 మంది చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో చైర్‌పర్సన్ మీడియా ఎదుట ఎమ్మెల్యేను టార్గెట్ చేస్తూ తనను కావాలనే వేధిస్తున్నారని కన్నీరుమున్నీరయ్యారు. అయితే చైర్‌పర్సన్‌పైనా కౌన్సిలర్లు తీవ్ర ఆరోపణలే చేస్తున్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతోపాటు అభివృద్ధి పనుల్లో వార్డు కౌన్సిలర్లకు అవకాశం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని, అందులోనూ చైర్‌పర్సన్ భర్త పెత్తనంపైనా తీవ్ర అసంతృప్తి నెలకొలకొనడం అక్కడి గ్రూపురాజకీయాలు ముదిరేలా చేశారు. అందులోనూ ఎమ్మెల్సీ కవిత వర్గం తామంటే తాము అంటూ గ్రూపురాజకీయాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

– హుజూరాబాద్‌లోనూ ఎమ్మెల్సీ పాడికౌశిక్ వర్సెస్ జడ్పీ చైర్‌పర్సన్ గొడవ ఉండనే ఉంది. అక్కడ అన్నీ తానై పెత్తనడం చెలాయించడం, అక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ విజయ విషయంలో తలదూర్చడం వంటి గొడవ ఇప్పటికీ సాగుతోంది. ఇప్పటికే అక్కడి అధికారపార్టీలో పాడి కౌశిక్‌కు కొందరు నేతలు వ్యతిరేక గళాన్ని వినిపిస్తుండటం గమనార్హం.

మంత్రి కేటీఆర్ సభను అడ్డుకుంటాం

కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పత్తి కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న పత్తి కృష్ణారెడ్డి

నవతెలంగాణ-జమ్మికుంట: ఉప ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాతే మంత్రి కేటీఆర్ హుజురాబాద్ నియోజకర్గంలో అడుగుపెట్టాలని, లేనిపక్షంలో జమ్మికుంట డిగ్రీ కళాశాలలో జగిరే సభను అడ్డుకుంటామని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పత్తి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజురాబాద్ నియోజకవర్గంలో తీవ్రమైన సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని, హామీలు నెరవేర్చకుండా మంత్రి కేటీఆర్ భారీ భహిరంగ సభ ఎలా పెడుతారని ప్రశ్నించారు. సభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లే కార్డులు ప్రదర్శించి, కాంగ్రెస్ జెండాలను ఎగురవేస్తామన్నారు. మానేరు పరివాహ ప్రాంతమైన తనుగుల, వావిలాల గ్రామాల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా ఇసుక అక్రమ దందా నడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ఏసీడీ ఛార్జీలు వెంటనే తగ్గించాలని, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూల్లూరి సదానందం, జమ్మికుంట పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మానుపాటి సూర్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహాల శాంతి కళ్యాణం

నవతెలంగాణ-గన్నేరువరం: మండల కేంద్రంలోని మానసా దేవి ఆలయంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయి శర్మ, వేద పండితుల ఆధ్వర్యంలో నవగ్రహాలకు ఘనంగా కళ్యాణం జరిపించారు. గరికపాటి గురుజాడ వారి ప్రవచనాలు ప్రజలు, భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు బద్దం చిన్న నరసింహా రెడ్డి, చైర్మెన్ ఏలేటి చంద్రారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన


పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-శంకరపట్నం: శంకరపట్నం మండల పరిధిలోని తాడికల్, అంబల్‌పూర్‌లో ఏఆర్ఎస్ జమ్మికుంట శాస్త్రవేత్తలు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, మొగి పురుగు, జింకు లోపం, సల్ఫైడ్ ఇంజూరీ ఉన్న వరి పొలాలను శనివారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మొగి పురుగు నివారణకు కర్టాఫ్ హైడ్రోక్లోరిక్ 4జి 2 గ్రాముల లీటర్ నీటికి, జింక్ లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటర్ నీటికి, సల్ఫైడ్ ఇంజురీ వేరు కుల్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఆర్.శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారులు శైలజ, లక్ష్మీ ప్రసూన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మృతి చెందిన ఆశావర్కర్

నవతెలంగాణ-చొప్పదండి: కరీంనగర్ మున్సిపల్ సుభాష్‌నగర్ పరిధిలో ఆశా వర్కర్‌గా పని చేస్తున్న బత్తుల పద్మ (45) గత కొన్ని సంవత్సరాలుగా ఆశా వర్కర్‌గా ప్రజలకు సేవలందిస్తోంది. ప్రస్తుతం కంటివెలుగు కార్యక్రమంలో పని చేస్తున్న ఆమె శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. తీవ్ర పని ఒత్తిడితోనే ఆశా వర్కర్ పద్మ మృతి చెందిందని, ప్రభుత్వం ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీ నారాయణ కోరారు. ఆమె కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం, కుటుంబానికి 30 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు.

వరి తడి,పొడి విధానంపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీసీఎక్స్ సభ్యులు

నవతెలంగాణ-రామడుగు: మండలంలోని పందికుంటపల్లి, కుర్మపల్లిలో పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సీసీఎక్స్ మెంబర్ రమేష్, బెన్నిలు తడి,పొడి విధానంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. తడి, పొడి విధానం అవలంభించడం వల్ల మిథేన్ వాయు కాలుష్యం తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం తడి, పొడి విధానంలో సాగు చేసేందుకు రైతులు తమ పేర్లను అధిక సంఖ్యలో నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎక్స్ సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ ప్లాంటేషన్ వల్ల రైతులకు అధిక దిగుబడి

వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్

నవతెలంగాణ-శంకరపట్నం: మండల పరిధిలోని మొలంగూర్ గ్రామంలో చింతరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్‌ను వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ మాట్లాడుతూ, ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ వల్ల రైతులకు అధిక దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం మెట్‌పల్లి చైర్మన్ పొద్దుటూరి సంజీవ రెడ్డి, మండల కో ఆర్డినేటర్ వీరస్వామి, రాజాపూర్ గ్రామ సర్పంచ్ పిన్ రెడ్డి, వసంత - నరసింహారెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ మంజువాణి, వ్యవసాయ అధికారి ఆర్.శ్రీనివాస్, విస్తరణాధికారులు శ్రావణి, రాజ్ కుమార్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థినికి అంతర్జాతీయ గుర్తింపు



నవతెలంగాణ-కరీంనగర్: అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెనెసిక్స్ విద్యార్థిని నత్య ప్రదర్శనకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కాలంలో సంగీత నృత్య మహోత్సవ్ వారు చేపట్టిన ప్రపంచ బుక్ ఆఫ్ రికార్డ్స్ వేడుక నమోదు కోసం అంతర్జాతీయ కార్నాటిక్ మ్యూజిషియన్స్, డ్యానర్స్ అసోసియేషన్ వారు చేపట్టిన సాముహిక కార్యక్రమంలో పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న బి.అక్షిత అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిందన్నారు. ప్రశంసాపత్రం పొందడంతో పాటు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు కోసం ప్రదర్శించిన తీరు ప్రశంసనీయమైందని అభినందించారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువల పట్ల అవగాహన, కళల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన మానేర్ వెలస్కో 23 ప్రదర్శనలు

నవతెలంగాణ-కరీంనగర్: కరీంనగర్ పద్మనగర్‌లోని మానేర్ సెంట్రల్ స్కూల్ వేదికగా శనివారం మానేర్ వెలస్కో 23 పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్‌కిరణ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలు చేశారని, ఈ ప్రదర్శనలు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. మానేరు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం క్లాస్ రూం విద్యే కాకుండా ఇలా తమలోదాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, ప్రముఖ వైద్యులు సీహెచ్ రమణాచారి, ఎల్. అమృత్ రెడ్డి, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ నిరంజనా చారి, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు, ప్రిన్సిపల్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

38వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-కరీంనగర్: కరీంనగర్ నగరపాలక సంస్థ 38వ డివిజన్ పరిధిలో 10 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన రోడ్లు, మురికి కాలువ అభివృద్ధి పనులను ఎంపీ బండి సంజయ్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పట్టణ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే కరీంనగర్ నగరాన్ని స్మార్ట్ సిటీ పథకంలో చేర్చినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో పాటు తన ఎంపీ లాడ్స్ నుండి అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులతో పాటు అధిక సంఖ్యలో డివిజన్ ప్రజలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో అగ్రగామి..జవహర్ నవోదయ!

- కేంద్ర మానవరుల మంత్రిత్వ శాఖ ఆధీనంలో సీబీఎస్‌సీ తరహాలో విద్యా విధానం
- ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబోధన
- గ్రామీణ విద్యార్థులకు వరం

నవతెలంగాణ-చొప్పదండి:

ఉన్నత విద్యలో దక్షిణ భారతదేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది జవహర్ నవోదయ విద్యాలయం. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో 1986 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూపీఏ హయాంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ, కేంద్ర మానవరుల శాఖ మాజీ మంత్రి స్వర్గీయ పీవీ నరసింహారావు జవహర్ నవోదయ విద్యాలయాలకు రూపకల్పన చేయగా ... 1986-87 విద్యా సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం జవహర్ నవోదయ విద్యాలయాలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 646కు పైగా విద్యాలయాలు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ జిల్లా మినహా 9 నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణతో పాటు నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాలకు నవోదయ విద్యాలయ సమితి ప్రాంతీయ కార్యాలయాన్ని హైదరాబాదులో ఏర్పాటు చేశారు. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్వహించే నవోదయ విద్యాలయాలకు ఆయా జిల్లాల కలెక్టర్లు చైర్మన్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 23 జిల్లాలను ఏర్పాటు చేయడంతో మరో 23 నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయనుంది.





ఆంధ్రాలో చిత్తూరు, తెలంగాణలో చొప్పదండి:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిత్తూరు నవోదయ, తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ ఉమ్మడి జిల్లా చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయానికి ఎక్కువ డిమాండ్ ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1986 లో నూతన విద్యా విధానంతో ఏర్పాటయిన చొప్పదండి నవోదయ విద్యాలయం దినదినాభివద్ధి చెందుతోంది. గత 37 సంవత్సరాలుగా 10,12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా నిలుస్తూ అందరి మన్నల్ని పొందుతోంది. 30 ఎకరాల విస్తీర్ణంలో నాణ్యమైన క్రీడా మైదానంతో అత్యుత్తమైన గ్రంథాలయంతో, డిజిటల్ విద్యా బోధనతో పిల్లలు తమ మేధాశక్తిని పెంపొందించుకోవడానికి 15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యాబోధన కొనసాగుతోంది. బాలబాలికలకు ప్రత్యేక వసతి గృహాలు, పౌష్టికాహారాన్ని అందిస్తూ, డాక్టర్, నర్సింగ్ సిబ్బంది పర్యవేక్షణలో నిరంతరం వైద్య సదుపాయాలు కల్పిస్తోంది.

రిజర్వేషన్లు, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధీనంలో..

జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి 80 సీట్లలో 75 శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం పట్టణ ప్రాంతం, 15 శాతం ఎస్సీలకు, 7.5 శాతం ఎస్టీలకు, 3 శాతం దివ్యాంగులకు, బాలికలకు 1/3 వంతు రిజర్వేషన్ ఉంటుంది. మొత్తం సీట్లలో గ్రామీణ ప్రాంతాలకు 75 శాతం, అంటే 60 సీట్లు కేటాయించి మిగతా పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కేంద్ర మానవ వనరుల మంతృత్వ శాఖ న్యూఢిల్లీ వారు మెరిట్ మార్కుల ఆధారంగా 80 మంది విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం: 2023-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నవోదయ విద్యాలయం వారు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా జనవరి 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

న్యూఢిల్లీ వారి ఆధీనంలో ఎంపిక

జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ పడమటి మంగతాయారు : చొప్పదండి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా



2023-24 విద్యా సంవత్సరానికి చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నాం. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ న్యూ ఢిల్లీ వారి ఆధీనంలో మెరిట్ కేటగిరి ప్రకారం విద్యాలయ సమితి విద్యార్థులను ఎంపిక చేస్తారు. విద్యార్థులు కష్టపడి చదివితే పరీక్షలో ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు క్రమశిక్షణతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. జనవరి 31 వరకు దరఖాస్తుల స్వీకరణ, ఏప్రిల్ 29న పరీక్ష ఉంటుంది. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

రెనే హాస్పిటల్ ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం



నవతెలంగాణ-కరీంనగర్: రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి తల్లి కీర్తి శేషులు బంగారి లక్ష్మి స్మారకార్థం రెనే హాస్పిటల్, శ్రీ లక్ష్మి మహేశ్వర ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉచిత అంబులెన్స్ సేవలను తెలంగాణ సాంఘిక సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెనే హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి వైద్యంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు అభినందించారు. ఇంత మంచి సౌకర్యాన్ని కరీంనగర్ ప్రజలు వినియోగిం చుకోవాలని కోరారు. అంబులెన్స్‌లో ఉన్న సౌకర్యాల గురించి హాస్పిటల్ చైర్మన్ ప్రొపెసర్ డాక్టర్ బంగారి స్వామి, ఎమర్జన్సీ ఫిజీషియన్ డాక్టర్ దీక్షిత్ బొజ్జ మంత్రికి వివరించారు. కార్యక్రమంలో గంగుల సుధాకర్, సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, రెనే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రజనీ ప్రియదర్శిని, ఎమర్జెన్సీ ఫిజీషియన్ డాక్టర్ దీక్షిత్ బొజ్జ, హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రవి మల్లా రెడ్డి, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ రావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అపోలో రీచ్ హాస్పిటల్‌లో అరుదైన గుండె శస్త్ర చికిత్స

నవతెలంగాణ-కరీంనగర్: కరీంనగర్ పట్టణంలోని అపోలో రీచ్ హాస్పిటల్ వైద్యులు అరుదైన గుండె శస్త్ర చికిత్స చేశారు. హైదరాబాద్ పట్టణానికి చెందిన రాజ్యలక్ష్మి (29) అనే యువతి ఏడాది కాలంగా గుండె సంబంధిత వ్యాధితో భాదపడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా లాభం లేకపోవడంతో ఆర్థిక పరిస్థితులు సరిగా లేని యువతి కుటుంబం కరీంనగర్ పట్టణంలోని అపోలో రీచ్ హాస్పటల్‌కు చికిత్స కోసం తీసుకువచ్చారు. ప్రముఖ గుండె వైద్య శస్త్ర చికిత్స నిపుణులైన డాక్టర్ అనిల్ కుమార్ ముల్బార్ సదరు యువతికి తెలంగాణ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ద్వారా జనవరి 24న విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. శస్త్ర చికిత్స జరిగిన మరుసటి రోజే యువతి కోలుకొని పూర్తి ఆరోగ్యాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ రంగంలో అపోలో వంటి సామాజిక దృక్పథం ఉన్న ఆసుపత్రుల్లో మాత్రమే నాణ్యమైన వైద్యం సామాన్య జనాలకు అందించడం సాధ్యమన్నారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, తనకున్న పరిచయాలతో భవిష్యత్తులో రాజ్యలక్ష్మి కుటుంబానికి ఆర్థికంగా చేయూతనం దిస్తానని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పరిపాలనాధికారి డాక్టర్ ప్రమోద్ గుప్తా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణ కిరణ్, ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ ఆకుల విద్యాసాగర్, డాక్టర్ కె.కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ



నవతెలంగాణ-కరీంనగర్: ఉద్యోగులుగా విధి నిర్వహణ సక్రమంగా నిర్వహించడంతో పాటు ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యతను ఇవ్వాలని జిల్లా జడ్జి బి.ప్రతిమ సూచించారు. శనివారం కరీంనగర్ జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును జిల్లా జడ్జి ప్రారంభించి మాట్లాడారు. మెడికల్ క్యాంపులో సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఓపీ, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని, మెడికల్ క్యాంపు ద్వారా నిర్వహించిన రక్త పరీక్షల ఫలితాలను ప్రభుత్వ డయోగ్నస్టిక్ కేంద్రాలు పూర్తి ఉచితంగా ఆన్‌లైన్ ద్వారా తెలియజేస్తాయని తెలిపారు. అంతకుముందు మెడికల్ క్యాంపులోని ప్రతి విభాగాన్ని సందర్శించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ సుజయ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జువేరియా, స్పెషలిస్ట్ డాక్టర్లు అర్చన, హుమేరా ఫాతిమా, అంకిత్, అనుదీప్, గౌతమి, ఆదిత్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఇంటి ముందే పురుగుల మందు తాగిన సబ్ కాంట్రాక్టర్

నవతెలంగాణ-శంకరపట్నం: ఓ కాంట్రాక్టర్ ఇంటి ముందే సబ్ కాంట్రాక్టర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శంకరపట్నం మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ... మండల పరిధిలోని అంబాల్ పూర్ గ్రామానికి చెందిన గొల్లెన తిరుపతి.. సిరిసిల్ల జిల్లా కందికట్కూర్ గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ కనకయ్య వద్ద గత కొన్నేళ్లుగా సబ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తిరుపతికి సుమారు రూ. 30 లక్షల వరకు కాంట్రాక్టర్ బిల్లులు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నుండి బిల్లులు వచ్చిన కాంట్రాక్టర్ డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్థాపానికి గురైన తిరుపతి శనివారం కనకయ్య ఇంటి ముందే ఆత్మహత్యాయత్నం చేసుకోగా కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అచీవర్స్‌లో ఆకట్టుకున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్



నవతెలంగాణ-కరీంనగర్: స్థానిక కోతిరాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలలో శనివారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థిని విద్యార్థులు పేపర్ క్రాఫ్ట్, హ్యాండ్‌మేడ్ క్రాఫ్ట్ లలో విభిన్నమైన బొమ్మలను తయారు చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ పల్లవి, పాఠశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ


క్రీడాకారులకు టీ షర్టును పంపిణీ చేస్తున్న సర్పంచ్ విజేందర్ రెడ్డి

నవతెలంగాణ-గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామ క్రికెట్ క్రీడాకారులకు ఆ గ్రామ సర్పంచ్ కంకణాల విజేందర్ రెడ్డి మైత్రీ గ్రూప్ టీ షర్టులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభను చాటుతూ గ్రామానికి గుర్తింపు తేవాలని సూచించారు. గ్రామీణ స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల వరకు ప్రతి క్రీడాకారుడు ఎదిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

తడి,పొడి పద్ధతిలో వరి సాగు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-సైదాపూర్: తడి,పొడి పద్ధతిలో వరి సాగు చేయాలని ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లస్మన్నపల్లి గ్రామంలో పద్మపాని స్వచ్ఛంద సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో వరిసాగులో తడి, పొడి విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.వరిసాగు చేసే రైతులు తడి, పొడి విధానం పద్దతి పాటించటం వల్ల నీటి వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. తడి, పొడి వరిసాగుతో మిథేన్ కాలుష్య కారకం విడుదల తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాయిత రాములు, ఏఈఓ రజిత, క్లస్టర్ కోఆర్డినేటర్ మధుకర్ రెడ్డి, మండల ఫీల్డ్ కోఆర్డినేటర్ కానుగంటి బిక్షపతి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జాతర ఆహ్వానపత్రం అందజేత


ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఆలయ చైర్మన్

నవతెలంగాణ-శంకరపట్నం: మండల పరిధిలోని కొత్తగట్టు ఆలయం శ్రీ మత్సగిరీందరస్వామి జాతర ఆహ్వాన పత్రికను రాష్ట్ర సాంస్కృతిక చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు ఆలయ చైర్మన్ సాగి మల హాళ్ రావు శనివారం కొత్తగట్టు శ్రీ మచ్చగిరింద్ర స్వామి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఫిబ్రవరి 1 నుండి 6 వరకు జరిగే జాతరకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకరపట్నం జడ్పీటీసీ లింగంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంట మహిపాల్, కొత్తగట్టు సర్పంచ్ మొకిరాల కిషన్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉమ్మెంతల సతీష్ రెడ్డి, రమణ రావు తదితరులు పాల్గొన్నారు.

శక్తి ఉన్నంత వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తా..

బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



నవతెలంగాణ-కరీంనగర్: నాలో శక్తి ఉన్నంత వరకు కరీంనగర్‌లో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ మార్కె ట్ రోడ్డు వెంకటేశ్వర టెంపుల్‌లో షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండు వలా కొనసాగుతుండగా మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యక్షంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆరో రోజు నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ పాల్గొని స్వయంగా భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే సంవత్సరం నాటికి కరీంనగర్‌లో టీటీడీ దేవస్థానా న్ని నిర్మించి అక్కడే బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. ఇప్పటికే ఆలయ నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ పదెకరాల స్థలాన్ని, నిధులను సైతం కేటాయించినట్లు తెలిపారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

కరీంనగర్ నియోజక వర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం 17వ డివిజన్ శ్రీ రామ్ నగర్ కాలనీ 3లో 26.75 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు నగర మేయర్ యాదగిరి సునిల్ రావ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో నగరానికి ప్రత్యేక నిధులు మంజూరు చేశారనీ, పనులన్నీ పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కోల భాగ్యలక్ష్మి-ప్రశాంత్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు, కోల భాగ్యలక్ష్మి-ప్రశాంత్, ఐలేందర్ యాదవ్ దిండిగాల మహేష్, బోనాల శ్రీకాంత్, భూమా గౌడ్, గందె మహేష్, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాదవ మహాసభ మండల అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని నంచర్ల గ్రామ ఉపసర్పంచ్ ఆదినవేని తిరుపతి యాదవ్ అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు నియమితులయ్యారు. శనివారం కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను తిరుపతి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్‌ను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నంచర్ల సింగిల్ విండో చైర్మన్ మంత్రి వేణుగోపాల్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోలి సురేందర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు తోడేటి లోకేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


తిరుపతిని సన్మానిస్తున్న మంత్రి ఈశ్వర్

ఎర్దండిలో విపత్తులపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి గ్రామంలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరిత్యాలు, విపత్తులపై అవగాహనా సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాము కాటు, నీటిలో మునిగిపోవడం, వరదల్లో చిక్కుకోవడం, మొదలగు విపత్తుల సమయంలో ప్రథమ చికిత్సగా సిపియర్ పద్ధతిని ఎలా వాడాలో అందరికి అర్థమయ్యేరీతిలో వివరించారు. ఈ కార్యక్రమలో అనంతరం ఈ కార్యక్రమం నిర్వ హించిన యన్‌డిఆర్ఎఫ్ బృందాన్ని గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ మహేశ్వర్, ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున్ యాదవ్, ఎన్‌డిఆర్ఎఫ్ టెన్ బిఎస్‌టర్మ్ కమాండర్ బిథిన్ సింగ్, నాగేశ్వర్, గ్రామసర్పంచ్ కల్లెడ లక్షణ గంగాధర్, ఉపసర్పంచ్ బట్టురాజశేఖర్, ఎంపీటీసీ బాశెట్టి రాధగణేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజీనామా ఆమోదమా..
'రాజీకి 'యమా.?

- అవిశ్వాసంలో నెగ్గలేనేనే.. రాజీనామాతో హైడ్రామా?
- పార్టీలో కొనసాగేనా.. ఇతర పార్టీ తీర్థం పుచ్చుకునేనా.!
- అధిష్టానానికి తెలపకుండానే రాజీనామా ఎందుకు.?
- సీనియర్లను కాదని కొత్త వారికి అధికారం అప్పజెప్పడమే సంక్షోభానికి కారణమా.?

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

2013 జనవరి 27 నాటికి మున్సిపల్ చైర్పర్సన్‌గా మూడు సంవత్సరాలు పూర్తి అయ్యేలోపే పార్టీ అధిష్టానానికి, ఎమ్మెల్సీ కవిత, మంత్రి కేటీఆర్‌లకు తన రాజీనామా విషయాన్నీ తెలుపకుండానే అవిశ్వాసం ఏర్పడితే నెగ్గలేననే భయంతోనే పలు నాటకీయ పరిణామాల నేపథ్యంలో జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి భోగ శ్రావణి బుధవారం రాజీనామా చేసి అందరినీ ఆశ్చర్యంలో ముంచేత్తి, తన రాజీనామాతో ఎమ్మెల్యేను ఇరకాటంలో పెట్టాలనే వ్యూహంతోనే రాజీనామాను కలెక్టర్ కార్యాలయంలో సమర్పించారు. కానీ ఆ రాజీనామాను ఆమోదించుకుంటే బాగుం డేదని ఆమె అలా చేయకుండా రాజీనామాతో బెదిరింపులకు పాల్ప డుతుందని అధిష్టానం బుజ్జగిస్తుందన్న ధీమాతోనే రాజీనామా చేశారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.

బుధవారం ఆమె రాజీనామా సమర్పించే సమయం లోనే పార్టీ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే సమావేశం ఉండగా ఆమె ఆ సమావేశానికి వెళ్లకూడదనే ఉద్దేశంతోనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి మరి ఆమె స్వగృహంలోనే మీడియా సమక్షంలో అప్పటికే కలెక్టర్ కార్యాలయంలో సమర్పించిన రాజీనామా ప్రతిని ప్రదర్శిస్తూ తాను రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రాజీనామా సమర్పణ ప్రకటన తర్వాత అదే మీడియా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యేపై పలు తీవ్రమైన ఆరోపణలు చేశారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఖండన..



అదే రోజు సాయంత్రం మోతే పార్టీ కార్యాలయంలో సుమారు 34 మంది కౌన్సిలర్లు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆమె ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేకు ధన దాహం ఉంటే ఎంతోమంది ఆర్థికంగా ఉన్నవాళ్లు పార్టీలో ఉన్నారని కౌన్సిలర్‌గా గెలిచారని కానీ నూతనంగా గెలిచిన మహిళకు ఉన్నత విద్యావంతురాలని ఎందుకు అవకాశం ఇస్తారని మరి ఆమె పదవి చేపట్టేందుకు ఎంత ఖర్చు పెట్టి ఆ కూర్చుని కొనుక్కున్నారని, ఒకవేళ అలా చేసి ఉంటే ఆ సామాన్య మహిళకు అంత డబ్బు ఎక్కడి నుండి వచ్చిందని పలువురు నాయకులు ప్రశ్నించారు.

మహిళలకు అధిక ప్రాధాన్యం..

గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాలో జగిత్యాల నియోజ కవర్గంలో చాలా పదవులను మహిళలకు కేటాయించిన ఘనత పార్టీకే దక్కుతుందని ఆ కృషి ఎమ్మెల్యేకే చెందుతుందని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పదవి కంటే వైద్య వృత్తినే ఎక్కువగా ఇష్టపడతారని ఇప్పటికి నిరుపేదలకు ఎన్నో ఉచిత కంటి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తూ సేవాభావంతోనే సంతృప్తి చెందుతున్నారని గతంలో ఒకసారి ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటమి చెందిన వైద్య వృత్తిలో ఆర్థికంగా ఎదిగేందుకు అపార అవకాశాలు ఉన్నాగాని ప్రజాసేవ చేయడానికే ఆయన మొగ్గు చూపారని వారు తెలిపారు.

బహిరంగంగా ఆస్తుల వివరాలు వెల్లడిస్తారా...?

మున్సిపల్ చైర్ పర్సన్‌గా పదవి చేపట్టకు ముందు వారి కుటుంబ సభ్యుల స్థిర,చర ఆస్తుల వివరాలను మూడు సంవత్సరాల పదవిని అనుభవించిన తరువాత అనగా ప్రస్తుత ఆస్తుల వివరాలను మున్సిపల్ చైర్ పర్సన్ ప్రజలకు తెలుపాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. గతంలో ఎంతో మంది పదవులలో కొనసాగి ప్రజలకు కుచ్చుటోపి పెట్టి ప్రస్తుతం మన మధ్యనే తిరుగు తున్నారని పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆరోపించారు.

తీర్థయాత్రల పేరుతో బిజెపితో సంప్రదింపులు...!

జనవరి రెండవ తేదీన తీర్థయాత్రల పేరుతో ఉజ్జయినిలోని మహంకాళి అమ్మవారిని భర్త మామలతో కలిసి దర్శించుకుని పనిలో పనిగా ఓ పార్టీ నేతలతో మంతనాలు జరిపి జగిత్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ ఇస్తారనే హామీ తీసుకొని వచ్చి అదును చూసి నొప్పించక తానోవ్వక అన్నట్లు అవిశ్వాస తీర్మానానికి ముందే పనిలో పనిగా వేరే పార్టీలోకి మారేందుకు ఇదే అదునుగా భావించి రాజీనామా చేశారని పలువురు పార్టీ నాయకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

సోషల్ మీడియాలో ఎమ్మెల్యేకు మద్దతుగా...

మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి బోగ శ్రావణి రాజీనామా చేసిన రోజు సాయంత్రం నుండే సోషల్ మీడియాలో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యేకు మద్దతును తెలుపుతున్నారు.

కుల రాజకీయాల ఎర ...

సుమారు మూడు ఏళ్ల పదవిలో ఉండి ఆ సామాజిక వర్గానికి ఎంత మేలు చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలని పలువురు నాయకులు సూచిస్తున్నారు. ఎమ్మెల్సీ రమణను జగిత్యాలలోని ఆయన నివాసంలో ఈరోజు మెజార్టీ కౌన్సిలర్లు కలిశారు. ఈ సందర్భంగా వారు రమణకు ఆమె రాజీనామా లేఖను ఉపసంహరించుకున్న లేక అధిష్టానం కొనసాగించాలని నిర్ణయం తీసుకున్న మేము కౌన్సిలర్ల మందరము ముకుమ్మడిగా రాజీనామా చేస్తామని ఇదే విషయాన్ని అధిష్టానం దష్టికి తీసుకెళ్లాలని రమణను కోరారు.

బీసీలు రాజకీయంగా ఎదిగితే ఓర్చుకోలేకపోతున్న దొరలు

- మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి

నవతెలంగాణ-మెట్‌పల్లి

తెలంగాణలో బీసీలు రాజకీయంగా ఎదిగితే దొరలు ఓర్చుకోలేక పోతున్నారని అందుకు నిదర్శనమే జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి రాజీనామా అని పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, దొర అహంకారంతో బీసీ బిడ్డ ఎదుగుదలను చూసి ఓర్వలేక మూడు సంవత్సరాలుగా ఆమెపై కక్షగట్టి ఆమె ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే నిరంకుశంగా వ్యవహరిస్తు న్నాడన్నారు. పార్టీలకతీతంగా బీసీలందరూ ఏకమై ఆమెకు సంఘీభావం తెలపాలని కోరారు. ఒక బీసీ ఆడబిడ్డను కన్నీటి పాలు చేసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల జిల్లా గౌడ సంఘం అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ గోపా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ ఆవిష్కరించారు. నూతనంగా జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన కసారపు మల్లేశం గౌడ్‌నుగౌడ సంఘం ఆధ్వర్యంలో సాల్వతో సన్మానించారు. జగిత్యాల జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కసారపు మల్లేశంగౌడ్, డాక్టర్ సురేష్‌గౌడ్, గోపాగౌడ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షులు దుర్గపు రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు బాలసాని సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజల రక్షణే ధ్యేయంగా పని చేస్తా

- జగిత్యాల ఎస్పీ భాస్కర్

నవతెలంగాణ-జగిత్యాల

జిల్లా ప్రజల భద్రత, రక్షణే ప్రధాన లక్ష్యమని పని చేస్తామని జగి త్యాల జిల్లా ఎస్పీ భాస్కర్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సింధు శర్మ నుంచి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కార్యాలయానికి చేరుకున్న ఆయనకు సాయుధ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సామన్య ప్రజలకు తనతో పాటు అధికారుల చేత కూడా సేవలందిచడంలో కృషి చేస్తానన్నారు. జిల్లా పరిధిలోని సామ్యానుడిని దృష్టిలో పెట్టుకోని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ ఉంటుందని తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ

విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బిక్షాటన

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శనివారం బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి మడవేని సునీల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగాన్ని కేసీఆర్ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని మండ పడ్డారు.. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.5300 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌ను వెంటనే ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్, సంజీవ్, మహదేవ్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.


బిక్షాటన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

వైద్య సిబ్బందికి ఘన సన్మానం

నవతెలంగాణ-మెట్‌పల్లి రూరల్


మెట్‌పల్లి మండలంలోని కోనారావుపేట గ్రామంలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజుతో పాటు వైద్య సిబ్బందిని పంచాయతీ పాలకవర్గం సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను ఏఐఎస్ఎఫ్ వ్యతిరేకిస్తూ ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం 10శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు 30శాతం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్ సహాయ కార్యదర్శి వంశీ పవన్, నాయకులు రాహుల్, రాజేష్, సుకుమార్, మనోజ్, సులేమాన్, రఘు, చంద్ర షేకర్ విద్యార్థులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో వీడ్కోలు హంగామా



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలోని పద్మ నాయక కల్యాణ మండపంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల వీడ్కోలు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట పాటలతో హోరేంతించారు. విద్యార్థుల నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండంట్, ముసిపట్ల రాజేందర్, డైరెక్టర్ నేరెళ్ల మల్లేశం గౌడ్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఈనెల 30న అరుణోదయలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30న ది ట్రైమ్స్ ప్రో వారి సహకారంతో ఐసిఐసిఐ బ్యాంకు వారు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నారని కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ శనివారం ఒక ప్రటనలో తెలిపారు. గతంలో నిర్వహించిన ఇంటర్వ్యూలో కళాశాలకు చెందిన 78 మంది సెలెక్ట్ అయ్యారని, వారందరికీ ఆఫర్ లెటర్ ఇచ్చారని తెలిపారు ఈనెల 30న అరుణోదయలో నిర్వహిస్తున్నామని,1997-2003 మధ్య జన్మించి 26 సంవత్సరాలలోపు ఉన్న వారు పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరాలకు 8106764653, 78939 22966 ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం అందజేత

నవతెలంగాణ-కొడిమ్యాల

కొడిమ్యాల మండలంలోని డబ్బు తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన జంగిడి మల్లయ్య- లచ్చవ్వ జ్ఞాపకార్థం కరీంనగర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డులో గల వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధాశ్రమానికి రూ.5వేల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మహేందర్, మహిపాల్ ,పావని, గౌతమి, లాస్య పాల్గొన్నారు.



గోవిందారంలో పశు వైద్య శిబిరం

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండలంలోని గోవిందారం గ్రామంలో పశు వైద్యాధికారి వెన్నెల ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో గేదెలకు, ఆవులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, సూది పరీక్షలు, నట్టల నివారణ మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, పశువైద్య సహాయకులు భరత్‌కుమార్, గోపాల మిత్రలు దేవయ్య, రమేష్, రిటైర్డ్ జెవివో మురళి, ఎంపీటీసీ పూర్ణిమ ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.


పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

ఉత్తమ తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రవి చేతుల మీదుగా ఉత్తమ తహసిల్దార్‌గా ప్రశంస పత్రాన్ని అందుకున్న ఇబ్రహీంపట్నం తహసీల్దార్ మహేశ్వర్‌ను ఎర్దండి గ్రామంలో శనివారం ప్రజాప్రతినిధులు సన్మా నించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రక్షణ గంగాధర్, ఉప సర్పంచ్ బట్టు శేఖర్, ఎంపీటీసీ రాధా గణేష్, గ్రామ యువకులు ప్రజలు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న గ్రామస్తులు

శ్రీచైతన్య టెక్నో విద్యార్థుల సస్యభారత్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా కృష్ణానగర్‌లో గల శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఆరో తరగతి విద్యార్థులు సస్య భారత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, డీన్, ధరూర్ దగ్గర్‌లో గల పొలాలకు వెళ్లి రైతులను కలుసుకొని వ్యవసాయ పనులను గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు కూడా పొలంలోకి దిగి రైతులతో కలిసి నాట్లు వేశారు. అత్యంత ఆనందోత్సాహాలతో పొలాలలో పనులు చేశారు. ఈ సస్యభారత్ కార్యక్రమంలో శ్రీ చైతన్య ప్రిన్సిపాల్ టీ.సచిన్, వంశీకష్ణ, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ గంగాధర్, తరగతి పాల్గొన్నారు.


పాల్గొన్న విద్యార్థులు

పలు అభివృద్ధి పనులు పరిశీలన

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని మ్యాకవెంకయ్యపల్లి గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం ఎంపీవో మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీవో మహేందర్ మాట్లా డుతూ ..గ్రామాల్లో వారం రోజుల్లోపు ఇంటి పన్ను 100శాతం వసూలు చేయాలని అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇనుగంఢ్ల లక్ష్మీ మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పీటర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఎంపీవో

జ్యోతిష్యుడికి డాక్టరేట్

నవతెలంగాణ- కోరుట్ల

పట్టణంలోని జ్యోతిష్యుడు జక్కుల రామకృష్ణకు తమిళనాడులోని హోసూర్‌లో శనివారం ఆసియా రిసెర్చ్ యూనివర్సిటి వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు డాక్టరేట్ ఇచ్చినం దుకు నాకు సంతోషంగా ఉందని తెలిపారు.



అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

- పురపాలికలో కుటుంబ పాలనతోనే సమస్యలు
- ఎమ్మెల్యేపై ఆరోపణలు అవాస్తవం
- ప్రెస్‌మీట్‌లో జగిత్యాల మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్లు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల మున్సిపాలిటీలో ముగ్గురు చైర్మెన్ల కుటుంబ పాలనతోనే సమస్యలకు కారణమైందని, తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఎమ్మెల్యే సంజయ్ పై భోగ శ్రావణి ఆరోపణలు చేశారని మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్లు పేర్కొన్నారు. జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు మాట్లాడుతూ.. మూడేండ్లుగా కౌన్సిల్‌లో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి పురపాలికల్లో ఒకే చైర్మన్ ఉంటారని, జగిత్యాలలో ముగ్గురు చైర్మెన్లు ఉన్నారన్నారు. భోగ శ్రావణి కుటుంబ పాలనతోనే సమస్యకు దారి తీసిందన్నారు. అయినా ఈ సమస్య పరిష్కార దిశగా శ్రావణి ఏనాడు ప్రయత్నించలేదన్నారు. ప్రతి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఓపిక పట్టాలని ఎమ్మెల్యే తమకు సూచించినట్టు తెలిపారు. అయినా మున్సిపాలిటీలో పాలనా పరంగా కొత్త ధనాన్ని చూపించాల్సిన చైర్‌పర్సన్ ఆదిశగా ప్రయత్నించలేదన్నారు. కేవలం మున్సిపల్ చైర్మెన్ మార్చాలని కోరామని,అవిశ్వాస తీర్మానం కొరలేదన్నారు. పార్టీ మారేందుకు నిచ్చయించుకొన్న భోగ శ్రావణి ఎమ్మెల్యే సంజయ్‌పై నిరాధార ఆరోపణలు చేశారన్నారు. ప్రెస్ మీట్‌ను తన ఫేస్ బుక్‌లో టెలికాస్ట్ ఎంపీ అరవింద్ చేశాడని ఆరోపించారు. శ్రావణి ఆరోపణల వెనుక ఎవరు ఉన్నారో ప్రజలకు అర్థమైందన్నారు. మున్సిపల్ చరిత్రలో లేని విధంగా శ్రావణి హయాంలో ఏసీబీ దాడలు జరిగాయని, దీనికి ఎవరు బాద్యులు అని ప్రశ్నించారు. మూడేండ్లుగా జగిత్యాల మున్సిపాలిటీలో కమిషనర్లు పట్టుమని పది రోజులు పనిచేయడం లేదని దీనికి ఎవరు బాద్యులని ప్రశ్నించారు. ఒక సమర్థ మహిళా కమిషనర్ జగిత్యాల మునిసిపల్ వస్తుంటే ఎందుకు శ్రావణి ఒప్పుకోలేదని ప్రశ్నించారు. బిజెపి కనుసన్నల్లోనే శ్రావణి ఎపిసోడ్ నడిచిందని పార్టీ మారేడుంటే మారాలని అనవసర ఆరోపణలను ఎమ్మెల్యేపై చేయడం దురదష్టకరమని కౌన్సిలర్ రాము అన్నారు. ఈ సమావేశములో కౌన్సిలర్‌లు బండారి రజని (నరేందర్), తోట మల్లికార్జున్, తరున్నమ్, అనీస్ కు తేజ (కోఆప్షన్), చదువుల తిరుపతమ్మ, ముస్కు నారాయణ రెడ్డి, సమంఢ్ల వాణి, బద్దం లత (జగన్) బోడ్ల జగదీష్, కూతురు రాజేష్, ఆరుముల్ల నర్సమ్మ,జంబర్తి రాజ్ కుమార్,కూతురు పద్మ శ్రీకాంత్,చుక్క నవీన్, ఆస్మా అంజుమ్, సిరికొండ భారతి, పంబల రామ్ కుమార్, కోలగాని ప్రేమలత, కోరే గంగ మల్లు,పిట్ట దర్మరాజు,క్యాదాసు నవీన్, ఎస్ .కె. చాంద్, వానరాసి మల్లవ్వ,అల్లె గంగసాగర్,మేక పద్మావతి, ఒద్ది శ్రీలత,దాసరి లావణ్య,సిరికొండ పద్మ,ఒల్లెపు రేణుక,బాలే లత తోపాటు పలువురు ఉన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

త్వరలో ప్రవేశపెట్టనున్న తెలంగాణ బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని టీపీసీసీ ఎన్నారై సెల్ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2014 ఎన్నికల సమయం లో టీఆర్ఎస్ పార్టీ గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు ఎనిమిదిన్నర ఏళ్లలో 1700 మంది తెలంగాణ వలస కూలీలు గల్ఫ్ దేశాలలో వివిధ కారణాలతో మృతి చెందారని తెలిపారు. ఇందుకు శంషాబాద్ విమానాశ్రయం పోలీస్ స్టేషన్‌లో శవపేటికల రిజిస్టర్ సాక్ష్యం అని సింగిరెడ్డి నరేష్‌రెడ్డి అన్నారు.

ఏటా రూ.18 వేల కోట్ల విదేశీ మారకం

ప్రస్తుతం గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న 15 లక్షల మంది తెలంగాణ వలస కార్మికులు ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున ప్రతినెలా 1,500 కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని పంపిస్తున్నారని టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బి. ఎం. వినోద్ కుమార్ అన్నారు. ఈ విధంగా ఏడాదికి 18 వేల కోట్ల రూపాయల చొప్పున గత ఎనిమిదిన్నర ఏళ్లలో లక్షా 53 వేల కోట్ల రూపాయలు తెలంగాణకు చేరి ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడిందని ఆయన అన్నారు.

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ -మెట్‌పల్లి

రాష్ట్రంలో సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం (ఐసిడిఎస్) పథకం జాతీయస్థాయిలో గుర్తింపు పొందడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమైదని, అందువలన ఐసిడిఎస్‌ను శాశ్వత సేవగా మార్చి అంగన్వాడీ టీచర్లు, ఆయాల డిమాండ్లను పరిష్కరించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఫిబ్రవరి 6న హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సాయిశ్వరి పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో ప్రధాన డిమాండ్ లైన అంగన్వాడీ టీచర్స్ మినీ టీచర్స్, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వరకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, ప్రావిడెంట్ ఫండ్ చట్టం అమలు పెన్షన్స్ సౌకర్యం, ఐసిడిఎస్ లోని ఖాళీ పోస్టులను అర్హులైన అంగన్వాడీ టీచర్స్ ద్వారానే భర్తీ, ప్రతి సంవత్సరం సూపర్వైజర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఎండి. ఉస్మాన్, అంగన్వాడీ టీచర్స్ సంధ్య, లక్ష్మీనరసు, సుమ, పద్మ, సునీత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి

- సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

రాష్ట్రంలో వృద్ధులు ఎక్కడ ఆత్మహత్యలకు పాల్పడ్డా వారి మృతి పట్ల విచారణ జరిపించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో వద్దుల ఆత్మహత్యలు- అభద్రత, నివారణ అన్న అంశంపై తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వ హించారు. ఆత్మహత్యల వంటి భాదకర నిర్ణయం తీసుకొని తమ జీవితానికి ముగింపు కోరుతున్న వారిలో ఎక్కువ మంది వృద్ధులే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలంలో వారి పోషణను కొందరు పిల్లలు పట్టించుకోక ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు పి.సి.హన్మంత రెడ్డి,బొల్లం విజయ్, ఎం.డి .యాకుబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఆశోక్‌రావు, సత్యనారాయణ, డాక్టర్ రాజగోపాల్ చారి,బోబ్బాటి కరుణ, డింది గాల విట్టల్, పబ్బా శివానందం, వేణుగోపాల్‌రావు, మురళి, జిల్లా, డివిజన్, వివిధ మండలాల సీనియర్ సిటిజన్స్ ,వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హరిఅశోక్‌కుమార్

ఆర్టీసీ రాయితీ పథకాలపై అవగాహన

నవతెలంగాణ - కథలపూర్

కథలాపూర్ మండలంలోని బొమ్మెన గ్రామపంచాయతీ ఆవరణలో "ప్రజల వద్దకు ఆర్టీసీ" కార్యక్రమాన్ని సర్పంచ్ పిడుగు లావణ్య - తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయితీ బస్ పాసులు, పెళ్ళిలకు, విహారయాత్రలకు ఇచ్చే అద్దె బస్‌లపై వివరించారు. ఆర్టీసీ ప్రవేశపెడుతున్న అన్ని రకాల పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల డిపో ట్రాఫిక్ సుపరిడెంట్ వెంకటేశం, బస్ స్టాండ్ కంట్రోలర్ కిషన్‌రావు, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేష్, సిఆర్‌సి రామ్మోహన్ పాల్గొన్నారు.



నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటాం..

- శాంతి భద్రతల పరిరక్షణమే ప్రథమ కర్తవ్యం
- పెద్దపల్లి డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన వైభవ్ గైక్వాడ్



నవతెలంగాణ - పెద్దపల్లి : పెద్దపల్లి ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణే తమ కర్తవ్యంగా పని చేస్తామని పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ డీసీపీగా నియమించబడిన వైభవ్ గైక్వాడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దపల్లి జోన్‌కు చెందిన పోలీస్ అధికారులు డీసీపీని మర్యాదపూర్వకంగా కలుసుకోని పుష్పాగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. డీసీపీ పెద్దపల్లిజోన్ పరిధిలోని పోలీస్ అధికారులతో మాట్లాడి ఈ ప్రాంతం భౌగోళిక పరిస్థితులను, ఎక్కువగా నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం 24గంటల పాటు పనిచేసేందుకు అందుబాటులో ఉంటామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని, శాంతి భద్రతల విషయంలోనూ కఠినంగా వుంటామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన డీసీపీని కలిసి పుష్పగుచ్చాలు అందించిన వారిలో గోదావరిఖని ఏసీపీ గిరి ప్రసాద్, సీఐలు ప్రదీప్ కుమార్, అనిల్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, సతీష్, వేణుగోపాల్, చంద్రశేఖర్, రమేష్ బాబు తోపాటు ఎస్సైలు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ఓదెల మల్లికార్జున స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల

నవతెలంగాణ - ఓదెల : పెద్దపల్లి జిల్లాలోని అతిపెద్ద పుణ్యక్షేత్రమైన ఓదెల శ్రీ మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. అనంతరం మంత్రి కొప్పుల ఈశ్వర్ ను ఆలయ చైర్మెన్ ధర్మకర్తలు సన్మానించి, స్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు. ఫిబ్రవరి 9వ తేదీన ఓదెల మల్లికార్జున ఆలయ ఆవరణలో వీరభద్ర స్వామి ఆలయం, బంగారు పోచమ్మ, మదనపోచమ్మ కోనేరులను ప్రారంభించే కార్యక్రమాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ మేకల మల్లేష్ యాదవ్, ఈఓ సదయ్య, ధర్మకర్తలు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, బత్తుల రమేష్, కర్రె కుమారస్వామి, అరెల్లి మొండయ్య, ఆలయ పూజారి వీరభద్రయ్య జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి పాల్గొన్నారు.

క్రీసెంట్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

అలరించిన వంటకాలు



ఫుడ్ ఫెస్టివల్‌ను తిలకిస్తున్న అతిథులు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : పెద్దపల్లిలోని క్రీసెంట్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ అయాజ్ మాట్లాడుతూ పోషకాలతో కూడిన సమతుల్య ఆహారంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి ఫుడ్ ఫెస్టివల్స్ దోహదపడతాయన్నారు. విద్యార్థులకు పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన సూచించారు. ఫుడ్ ఫెస్టివల్ వేడుకల్లో భాగంగా విద్యార్థులు వివిధ రకాల రుచికరమైన వంటలు చేసి అలరించారు. ఈ వేడుకల్లో కౌన్సిలర్ బెక్కం ప్రశాంత్, సాబీర్ ఖాన్, ప్రిన్సిపాల్ రాజేష్, ఉపాధ్యాయులు ఫిరాసితుల్ల శహజాద్, సలామతుల్ల శనవాజ్, తహ బిలాల్, శానవాజ్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లక్ష ఖాతాలు ఓపెన్ చేయడమే లక్ష్యం

పోస్టల్ ఎస్పీ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ : కొత్త వడ్డీ రేట్లతో లక్ష ఖాతాలను తెరవడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ లో భాగంగా సెలవు రోజు ఆదివారం కూడా అన్ని పోస్టాఫీసులు తెరచే ఉంటాయని కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరిండెంట్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త వడ్డీ రేట్లను ప్రజలకు వర్తింపజేయాలనే సంకల్పంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పోస్టాఫీసులు ఆదివారం తెరచే ఉంటాయని, ఆర్థిక చేయూతనిచ్చే వివిధ పథకాలలో ప్రజలు చేరాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేవలం వివిధ ఖాతాలను తెరవడం కోసమే ఆదివారం పోస్టాఫీసులు ఓపెన్ చేస్తున్నామని, ఇతర కార్యకలాపాలేవి కొనసాగవని, ఈ విషయం ప్రజలు గమనించాలని పోస్టల్ ఎస్పీ ప్రకటనలో కోరారు.

2లోగా అభ్యంతరాలు తెలపాలి

పెద్దపల్లి డీఈవో డి.మాధవి

నవతెలంగాణ - పెద్దపల్లి : ప్రధానోపాధ్యాయులు గ్రేడ్ -2, ఇతర క్యాటగిరి లకు చెందిన తాత్కాలిక సీనియారిటి జాబితాను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, జిల్లా వెబ్సైట్, జిల్లా విద్యా శాఖ అధికారి వెబ్సైట్లలో అందుబాటులోఉందనిడీఈవో మాధవి ప్రకటనలో తెలిపారు. సీనియారిటి జాబితాలో తేడాలు, అభ్యంతరాలు ఉన్నట్లయితే రుజువు చేసే సాక్ష్యాలతో ఆన్లైన్‌లో నమోదు చేసి ప్రింటెడ్ కాపీని ఫిబ్రవరి 2లోగా జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని డీఈవో ప్రకటనలో తెలిపారు.

రైతులు ఆందోళన చెందవద్దు

- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి
- పొలం బాట కార్యక్రమంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

నవతెలంగాణ - పెద్దపల్లి : పంటల సాగుపై చీడపీడల నివారణ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాలలో పొలాస శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో కలిసి పంట పొలాలను సందర్శించారు. ఇటీవల వరి పొలంలో విపరీతంగా పెరిగిన మొగి పురుగుపై రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో స్పందించిన ఆయన పొలాలను పరిశీలించి అన్నదాతకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పొలాస శాస్త్రవేత్తలు రజనీకాంత్, ఓం ప్రకాశ్, బలరాం, కునారం శాస్త్రవేత్త శ్రీధర్ సిద్ధి, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, ఏడీఏ శ్రీనాథ్, ఏఓ అలివేణి, ఎంపీపీ బాలాజీ రావు,రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు ఇనుగాల అనంతరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా అవుతున్నా పట్టించుకోరా?



నిరసన తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ 5వ డివిజన్ మల్కాపూర్‌లో రెండు సంవత్సరాల కిందట అధికారులు ఇక్కడ అధికార పార్టీ నాయకులు అట్టహాసంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యుల చేతుల మీదుగా ప్రారంభించిన అంబేద్కర్ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం వల్ల ప్రజాధనం పూర్తిగా దొంగల పాలవుతోందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాగర్ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజధాని తరహాలో రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతామని అధికార పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఆచరణలో అమలు కావాలని లేదని, దానికి ప్రత్యక్ష సాక్ష్యమే ఆగిపోయిన అంబేద్కర్ భవన నిర్మాణ పనులు అన్నారు. భవనం నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం వల్ల ఇక్కడ లక్షల విలువైన ప్రజాధనం దొంగలపాలవుతోందని, కనీసం ఒక సీసీ కెమెరా అయినా ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఈస్ట్ ఏరియా కన్వీనర్ కృష్ణ కుమార్, కో కన్వీనర్ సురేష్ పాల్గొన్నారు.

మంత్రి హామీ.. నెరవేరదేమీ?

- కోనరావుపేటలో కళాశాల మైదానం
- కలగానే కళాశాల ప్రహరీ
- డిగ్రీ కళాశాల అయ్యేనా..
- 2016లో డిప్యూటీ సీఎం హామీ
- నేటికీ విద్యార్థులకు తప్పని తిప్పలు



ప్రహరి గోడ లేని జూనియర్ కళాశాల

నవతెలంగాణ - కోనరావుపేట : సాధారణంగా మంత్రులు తమ ప్రాంతానికి వస్తే ఆ ప్రాంత సమస్యలకు ఓ పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశిస్తారు. అలాంటిది ఓ మంత్రి వచ్చి హామీ ఇచ్చినా పనులకు ఆరేండ్లుగా అతీగతీ లేదు. పదో తరగతి వరకే చదివి మధ్యలోనే చదువు ఆపేయకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ప్రాంత నాయకుడు అది శ్రీనివాస్ అప్పటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డితో మాట్లాడ్ మారుమూల ప్రాంతానికి జూనియర్ కళాశాల మంజూరు చేయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ కళాశాలకు రూ.1.30 కోట్లు మంజూరయ్యాయి.

హామీ అటకెక్కింది..

2016 అక్టోబర్ 20న కోనరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన విద్యా సదస్సుకు హాజరైన అప్పటి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి మాట్లాడుతూ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని, కళాశాలకు ప్రహరీ నిర్మించాలని, అలాగే కళాశాల ముందు కూల్చిన తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల శిథిలాలను వారం రోజుల్లోగా తొలగించాలని ఆదేశించారు. ప్రజలు, విద్యార్థుల ఆందోళనతో కార్యాలయాల శిథిలాలను మాత్రం తొలగించారు. కానీ అప్పటి అధికారులు అంచనాలు తయారు చేయడంలో నిర్లక్ష్యం మూలంగా ప్రహరీ నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చలేదు. దీంతో కళాశాల ఆవరణలోకి పశువులు, మేకలు వస్తుండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు డిగ్రీ కళాశాలకు వెళ్లాలంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. కొందరు విద్యార్థినుల తల్లిదండ్రులు ఇంటర్ వరకే పూర్తి చేయించి జిల్లా కేంద్రానికి పంపించే స్తోమత లేక మధ్యలోనే విద్యార్థుల చదువులు ఆగుతున్నాయి. మంత్రి హామీని నిలబెట్టుకోవాలని విద్యార్థులు మండల ప్రజలు యువజన సంఘాలు కోరుతున్నారు.

మూడేండ్లలో గణనీయమైన అభివృద్ధి

రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్



మాట్లాడుతున్న మేయర్

నవతెలంగాణ-గోదావరిఖని: ప్రస్తుత పాలక వర్గం నేతృత్వంలో మూడేళ్లుగా రామగుండం నగరంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం పాలకవర్గం ఏడవ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖామంత్రి, జిల్లా మంత్రి, స్థానిక ఎంపి, ఎంఎల్ఎల నేతృత్వంలో డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కొ ఆప్షన్ సభ్యుల సమన్వయంతో కమిషనర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది సహకారంతో నగరంలో అభివృద్ధి పనులు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. శనివారంతో పాలక వర్గం మూడవ సంవత్సరం పూర్తి చేసుకొని నాలుగవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇటీవల మరణించిన జంగపల్లి(గడ్డి) కనకయ్య నోటిఫైడ్ ఏరియా నుండి సీనియర్ మున్సిపల్ కాంట్రాక్టర్‌గా, కార్మిక నాయకుడిగా, అందరికీ ఆత్మీయుడిగా పలు సేవలందించినందున నివాళులర్పిద్దామని ప్రతిపాదించగా మేయర్, సభ్యులు ఆమోదించి సభలో ఒక నిమిషం పాటు మౌనం పాటించి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ అత్యవసర సమావేశంలో నాలుగు అంశాలు ప్రవేశ పెట్టగా మూడు అంశాలు ఆమోదించారు. మరొక అంశంకు సంబంధించి తిరిగి సర్వే జరిపి పూర్తి స్థాయిలో ప్రవేశ పెట్టవల్సిందిగా సభ్యులు సూచించడంతో వాయిదా వేశారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్ రావు, కమిషనర్ సుమన్ రావు, కార్పొరేటర్లు, కొ ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వం విఫలం

- అనర్హులకు అందిన డబుల్ బెడ్రూం ఇండ్లు
- అఖిలపక్ష నాయకుల ఆవేదన

నవతెలంగాణ - మంథని : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ కల్లబొల్లి మాటలతో మోసం చేస్తుందని అఖిలపక్ష నాయకులు అన్నారు. ఆదివారం మంథని ప్రెస్ క్లబ్‌లో అఖిలపక్ష నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంథనిలో డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపులో 80శాతం మంది అనర్హులే ఉన్నారన్నారు. దళితుడైన మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేష్‌లు డబుల్ బెడ్రూం ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు ఈ ఇండ్లలో ఒక్కరైనా దళితులు ఉన్నారా అని చూసుకోకపోవడం శోచనీయమన్నారు. 8సంవత్సరాల టీఆర్ఎస్ పాలనలో ఎస్సీ,ఎస్టీ బీసీలకు ఏమాత్రం న్యాయం జరగలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ ప్రాంతం నుండి సహజ వనరులు దోచుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని లేనిపక్షంలో అన్ని పార్టీలు అఖిలపక్షంగా ఏర్పడి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ఈ అఖిలపక్ష సమావేశంలో లేబర్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఇరుగు రాళ్ల సంతోష్, ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బూడిద తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజు, లైసెట్టి రాజు,గంట బాలయ్య,కెక్కిర్ల సాగర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంథని రాకేష్, కందుల శ్రీనివాస్, సీపీఐ(ఎం) నాయకుడు ఆర్ల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడిల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

నవతెలంగాణ - పెద్దపల్లి : అంగన్వాడి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కషి చేయాలని ఎమ్మెల్యేకు తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి యూనియన్ ప్రతినిధి బృందం శనివారం తమ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జ్యోతి మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులకు గత ఏడు సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరినట్టు తెలిపారు. ప్రధానంగా గత 40ఏండ్లుగా ఐసీడీఎస్ సేవలు అందిస్తున్న అంగన్వాడీ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా గ్రాట్యూటీ సౌకర్యం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని, వేతనంలో సగం పెన్షన్ చెల్లించాలని, 8ఏండ్లుగా పెండింగ్లో ఉన్న టిఏడిఎలకు నిధులు వెంటనే విడుదల చేయాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ ఆయా పోస్టులు తక్షణం భర్తీ చేయాలన్నారు. 2018కేంద్రం పెంచిన వేతనం వేతనాల ఏరియర్స్ చెల్లించాలని, ఆరోగ్య లక్ష్మి మెనూ చార్జీలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజనరసమ్మ, బి.ఉమారాణి, ఉపాధ్యక్షులు ఎం.హేమలత, ఎస్.కళావతి, సహాయ కార్యదర్శి శ్రీమతి, ఆర్ రేణుక, జమున, జి.అరుణ, వసంత పాల్గొన్నారు. అనంతరం పెద్దపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారులకు కూడా సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

చీడపీడల నివారణలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లావ్యవసాయ అధికారి ఆదిరెడ్డి



వరి పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి

నవతెలంగాణ - ధర్మారం : రైతులు వరి పంటలపై చీడపీడల నివారణలో జాగ్రత్తగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని దొంగతుర్తి గ్రామంలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ పరిశోధన స్థానం పొలస, కునారం వారి ఆధ్వర్యంలో గ్రామంలోని వరి పంటలను క్షేత్ర ప్రదర్శనలో భాగంగా పరిశీలించారు. సందర్భంగా ఆది రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ చీడపీడల నివారణలో అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలను పాటిస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తల బృందం వరి సస్యరక్షణలో భాగంగా వరి కాండం తొలుచు పురుగు ఉనికి, అగ్గి తెగులు నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. ప్రధానపొలంలో మొగి పురుగుకి పిప్రోనిల్ 0.6శాతం గుళికలను 4 కిలోలు లేదా 15 రోజుల వయస్సు వరి పైరులో ఈ యాసంగి లో తప్పకుండా ఎకరాకు కార్బోఫురాన్ 3 జి గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.40 జి 4 కిలోలు వేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనాథ్ ,శాస్త్రవేత్తల బందం శ్రీధర్ సిద్ధి, బలరాం, ఓమ్ ప్రకాష్, రజనీకాంత్,మండల వ్యవసాయ అధికారి ఎస్ ఎం ఎస పూర్ణిమ, ఏఈఓ ప్రశాంత్,గ్రామ సర్పంచ్ సత్తయ్య ,ఎంపీటీసీ సదయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షులు గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మానేరు వాగులో డీసిల్టేషన్ నిలిపివేత

నవతెలంగాణ-మంథని : పెద్దపల్లి జిల్లాలోని మానేరు వాగులోని ఇసుక రీచ్‌లలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు డీసిల్టేషన్‌ను నిలిపివేసినట్లు టిఎస్ఎండిసి ప్రాజెక్ట్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. అయితే స్టాక్ యార్డులలోవున్న ఇసుకను ప్రభుత్వ పనులకు ఇసుకను తరలిస్తామన్నారు. ఎన్‌జీటీ ఆదేశాలకు లోబడి ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ పనులకు ఇసుక రీచ్‌ల నుంచి డీస్లిటేషన్ చేస్తామని తెలిపారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.

సింగరేణి ఆర్జీ-1లో క్వార్టర్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ-గోదావరిఖని: సింగరేణి ఆర్జీ 1లో విధులు నిర్వహిస్తున్న అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో, వివిధ క్యాటగిరీలలో పని చేస్తున్న (ఎస్‌సిడబ్ల్యూఏ) క్యాటగిరి-1 నుండి క్యాటగిరి-6 వరకు గల ఉద్యోగులకు స్థానిక ఆర్‌సిఓఏ క్లబ్‌లో క్వార్టర్ కౌన్సిలింగ్ శనివారం నిర్వహించారు. ఈ క్వార్టర్ కౌన్సిలింగ్‌లో డిటి2, ఎస్టి2, బిజిహెచ్ టైప్ క్వార్టర్‌లకు కౌన్సిలింగ్ చేపట్టారు. క్వార్టర్ కౌన్సిలింగ్ మొత్తం 107 క్వార్టర్‌లకు గాను 195 మంది అప్లై చేసుకున్నారు. క్వార్టర్‌లను అర్హత, క్యాటగిరిని, పదవీని బట్టి క్వార్టర్‌లను కేటాయించారు. ఈ క్వార్టర్ కౌన్సిలింగ్‌ను పూర్తి పారదర్శకంగా అధికారుల సమక్షంలో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎం.జెడ్ఏ సలీం, సీనియర్ పర్సనల్ అధికారి నరేన్ చక్రవర్తి, సంక్షేమాధికారులు రవీందర్, ఫిరోజ్ ఖాన్, పర్సనల్ డిపార్ట్ మెంట్ పిఏ దేవా చారి, క్వార్టర్ సెక్షన్ సిబ్బంది మదన్ తదితరులున్నారు.

మందులపై జీఎస్టీ రద్దు చేయాలి

- అన్‌లైన్ అమ్మకాలను నిషేధించాలి
- మెడికల్ రిప్రజెంటేటివ్స్ రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు
- సర్వసభ్య సమావేశంలో జిల్లా శాఖ ఎన్నిక




నవతెలంగాన - కరీంనగర్ డెస్క్ : తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ కరీంనగర్ జిల్లా శాఖను శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండా శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, గత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో 5శాతం నిధులు ఆరోగ్యరంగానికి కేటాయించాలని, ప్రభుత్వ ఫార్మా కంపెనీలను పునరుద్ధరించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతీ సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయికీ రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా జెఎల్.నర్సింహారెడ్డి, మిరుపాల అంజయ్య, ఉపాధ్యాక్షులుగా పబ్బ నరేందర్, కొక్కుల శ్రావణ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా కె.సంపత్‌రెడ్డి, ఎ.రమేష్, కోశాధికారిగా కె.వెంకటేశ్వర్లను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి సీటీయూ జిల్లా నాయకులు ఎడ్ల రమేష్, ముకుందరెడ్డి, రాజేశం, సత్యం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేరాల అదుపు, కరోనా జాగ్రత్తలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు కళాబృందం

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం : కరీంనరగ్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు శనివారం 'షీ'టీమ్, పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో నేరాల అదుపు, కరోనా జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ విజయమణి మాట్లాడుతూ.. డ్రంకెన్ డ్రైవ్, ట్రిబుల్ రైడ్, రాష్ డ్రైవింగ్ చేయవద్దని, హెల్మెట్ ధరించాలని, వాహనాల నెంబర్ ప్లేట్‌ను ట్యాంపరింగ్ చేయవద్దన్నారు. రాంగ్ రూట్లో వెళితే, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే ఈచాలన్ ద్వారా జరిమానాలు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబందం ఇన్‌చార్జి ఏఆర్ ఎస్ఐ ముల్కల కాంతయ్య, సభ్యులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు రాయికల్ రైతుల వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

నవతెలంగాణ - రాయికల్ : రాయికల్ మండల రైతులు సమిష్టిగా కొనుగోలు చేసి వ్యవసాయ మార్కెట్‌కు కేటాయించిన స్థలంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతులు ధాన్యం నిలువ చేసేందుకు స్థలం సరిపోదని రాయికల్ పట్టణ మండల రైతులు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మంద మకరందుకు శనివారం వినతి పత్రాన్ని అందించారు. కార్యాలయం, గోదాములు, పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారని రైతులు పండించిన పంట ఆరబోసేందుకు స్థలం సరిపోదని వివరించారు. రాయికల్ మండల పరిధిలోని 32గ్రామల రైతులు పండిచే వాణిజ్య పంటలకు ఏమాత్రం సరిపోక మరికొంత స్థలాన్ని సేకరించినందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి, మాజీ సర్పంచ్ డాక్టర్ రాజారెడ్డి, రాయికల్ మండల రైతులు అయిలేని గంగారెడ్డి, ఏద్దండి దివాకర్, మండ రమేష్, బాపురపు రమేష్, భుమేష్, గంగారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ స్థలాన్ని మళ్లింపు చేయడం ఏంటి?

- ప్రజలకు అందుబాటులో సమీకృత మార్కెట్ ఉండాలి
- బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చిలుకమర్రి మధన్ మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కన్వీనర్

నవతెలంగాణ - రాయికల్ : వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం అందుబాటులో లేక రైతాంగం సమిష్టిగా 5ఎకరాల స్థలాన్ని సమకూర్చి వ్యవసాయ మార్కెట్ కోసం అప్పగిస్తే రైతులకు చెందాల్సిన మార్కెట్ స్థలాన్ని ఇతర అవసరాల కోసం మళ్ళించడం ఏంటని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చిలుకమర్రి మధన్ మోహన్ మండిపడ్డారు. శనివారం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అందుబాటులో ఉండని సమీకృత మార్కెట్‌ను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యాల్లో ఏర్పాటు చేయడాన్ని అధికారులు విరమించుకోవాలని సూచించారు. రైతులు, ప్రజల అభిప్రాయం మేరకే సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భాజపా పట్టణ అధ్యక్షులు కల్లెడధర్మపురి,ప్రధాన కార్యదర్శి కుంభోజి రవి,దళిత మోర్చా అధ్యక్షులు బన్న సంజీవ్,బీజేవైఎం అధ్యక్షులు చిలువేరి ప్రవీణ్,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు గుర్తింపు కార్డులు



నవతెలంగాణ - రాయికల్ : జగిత్యాల జిల్లా సీఐటీయూ ఆధ్వర్యంలో రాయికల్ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల గుర్తింపు కార్డులను మున్సిపల్ చైర్మెన్ మోర హన్మండ్లు చేతుల మీదుగా కార్మికులకు పంపిణీ చేశారు. భవిష్యత్తులో పారిశుధ్య కార్మికులకు బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. యూనిఫామ్, శానిటైజర్ కిట్లు, పనిముట్లు అందించడంతోపాటు సకాలంలో జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సీఐటీయూ నాయకులు ముడుగు రాజలింగు, కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, తురగ శ్రీధర్, సాయికుమార్, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ - గోదావరిఖని క్రైం:



ఎన్టీపీసీ భీమునిపట్నం మజీద్ ఏరియాలో నివాసముండే అబ్దుల్ హసీబ్ శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారి ఆటోనగర్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొన్న అదుపు తప్పి ఢీకొట్టగా హసీబ్ మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ తన వాహనాన్ని అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఆకస్మాత్తుగా సర్వీస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డుకు ఎక్కించడంతో హసీబ్ తన వాహనాన్ని అదుపు చేయలేక ఢీకొట్టడంతో తలకు తీవ్రమైన గాయమయ్యి రక్తస్రావం జరిగింది. అతన్ని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు తెలిసింది. ఈ మేరకు హసీబ్ తండ్రి ఖాలీఖ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు.

ప్రజలతో మమేకమై శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలి

రాజన్న జోన్ డీఐజీ రమేష్‌నాయుడు

ఇల్లంతకుంట ఠాణాలో తనిఖీ


స్టేషన్ పరిసరాలు పరిశీలిస్తున్న డీఐజీ, ఎస్పీ

నవతెలంగాణ - ఇల్లంతకుంట : ప్రజలతో మమేకమై శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషిచేయాలని రాజన్న జోన్ డీఐజీ రమేష్‌నాయుడు సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట పోలీసు స్టేషన్‌ను శనివారం ఆయన ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, కేసులు పెండింగ్‌లో ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్, ఎస్ఐ మామిడి మహేందర్, సిబ్బంది ఉన్నారు.

సింగరేణి జోలికొస్తే ఊరుకోం..

రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ

తెలంగాణ కొంగుబంగారమైన సింగరేణి జోలికొస్తే ఊరుకోబోమని, సింగరేణి సంస్థకు చెందిన కె.కె.5, పెనగడప, శ్రావనపల్లి, సత్తుపల్లి నాలుగు బ్లాకుల వేలం వెంటనే నిలిపివేయాలని రామగుండం ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం ఆర్జీ-2 పరిధిలోని వకిల్‌పల్లి గని వద్ద సింగరేణి బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గనిర్దేశంలో సింగరేణి సంస్థ గొప్ప లాభాలు సాధించిందని అన్నారు. తక్కువ కాలంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకునేందుకు మోడీ సర్కార్ కుట్ర చేస్తుందని ఆరోపించారు. సింగరేణికి చెందిన నాలుగు బ్లాక్‌లను వేలంవేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు చూస్తుందన్నారు. సింగరేణి సంస్థ ప్రయివేటు పరం కాకుండా కాపాడుకునేందుకు ఈ ప్రాంతం నుండే మరో పోరాటానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, టీబీజీకేఎస్ నాయకులు కెంగర్ల మల్లయ్య, అయిలి శ్రీనివాస్, దశరథం, బానకర్, కొంగర రవీందర్, చంద్రమౌళి, ఇనుముల సత్యం, బీఆర్ఎస్ నాయకులు ఎండీ.గౌస్‌పాషా, గుడేళ్ళి రాంచందర్, దాసరి బాలరాజు, మారెల్లి మలారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందేలా నిబద్ధతతో పనిచేయాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - సిరిసిల్ల క్రైం/తంగళ్ళపల్లి


పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

క్రమశిక్షణ, నిబద్ధతతో ప్రజల మన్ననలు పొందేలా పనిచేస్తూ, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పోలీసులకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. తంగళ్ళపల్లి మండలంలోని తాడూరులోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా ఆర్మడ్ రిజర్వ్, సివిల్ పోలీస్, హోమ్ గార్డ్ సిబ్బందికి శనివారం నిర్వహించిన వీక్లీ పరేడ్‌కు ఎస్పీ హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్, సిబ్బంది ప్రదర్శనని పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రతిరోజు ఉదయాన్నే కనీసం అరగంట పాటు యోగ, ధ్యానం, నడక ఏదో ఒకటి చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు బయట ఆహారం తినడం మానివేయాలన్నారు. రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేసుకోవాలని తెలిపారు. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి క్రమశిక్షణ, యూనిటీగా ఉండడం, ఫిజికల్ ఫిట్నెస్‌కు ఉపయోగపడుతుందన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలు నిర్వర్తించి ప్రజల మన్ననలను పొందేలాగా పనిచేస్తూ పోలీస్ శాఖకు, జిల్లాకు మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. సిబ్బందికి ఏదైనా సమస్యతో వుంటే ఎప్పుడైనా తనను కలిసి తెలుపాలని సూచించారు. ఫిర్యాదులు, సమాచారం, సహాయం కోసం మనదగ్గరికి వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారికి సేవలు అందించడంతో ప్రజలందరికీ పోలీస్ వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందన్నారు. పరేడ్‌లో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ విశ్వప్రసాద్, ఆర్ఐలు కుమారస్వామి, రజినీకాంత్, యాదగిరి, సీఐలు అనిల్ కుమార్, ఉపేందర్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

మంత్రిని కలిసిన ఉపాధి హామీ మేట్లు


మంత్రికి తమ సమస్యలు తెలుపుతున్న ఉపాధి హామీ మేట్లు

నవతెలంగాణ - ధర్మారం

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఉపాధి హామీ మేట్లు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఉపాధి హామీ మేట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పాలమాకుల అస్విజ్ కుమార్ ఆధ్వర్యంలో, జిల్లా ఉపాధ్యక్షులు డబ్బేటా సంపత్ కుమార్, సల్పల శైలజ, ప్రధాన కార్యదర్శి చుక్క స్వామి, ప్రచార కార్యదర్శి బారు పాటి కోటేష్, ప్రధాన సలహాదారుడు దొమ్మాటి మల్లయ్య మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్లతో సమానంగా పనిచేస్తున్నామని, వంద రోజులతో సంబంధం లేకుండా నిరంతర ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో కూలీలతో అనుసంధానంగా ఉంటూ రాష్ట్రంలోని ఉపాధి హామీ పథకాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలపడంలో కృషిచేస్తున్నామని, తమను గుర్తించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ప్రభుత్వం న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు.

ముస్తాబాద్ గ్రామపంచాయతీలో వసూళ్ల పర్వం

వార్డు సభ్యుల ఆగ్రహం

సర్పంచ్ రాజీనామా చేయాలని డిమాండ్

నవతెలంగాణ - ముస్తాబాద్


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వార్డు సభ్యులు

ముస్తాబాద్ మండల కేంద్రం మేజర్ గ్రామపంచాయతీలో ఏ పనికైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సర్వసభ్య సమావేశం జరిగినది. వార్డు సభ్యులు మాట్లాడుతూ ఇంటి అనుమతితో పాటు నల్ల కలెక్షన్ ఇతర అవసరాల కోసం ఎవరు వచ్చినా డబ్బులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాకుండా దానికి రెండు మూడు రెట్లు ఎక్కువగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బిల్లులు మాత్రం ప్రభుత్వ నిబంధన ప్రకారమే ఇస్తున్నారని అన్నారు. ఈవో సమాధానం చెప్పాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్నిరోజుల క్రితం ఇంటి అనుమతి కోసం వచ్చిన ఒకరి వద్ద నుంచి నిబంధనల ప్రకారం రూ.30వేలు తీసుకోవాల్సి ఉండగా వారి వద్ద నుండి రూ.50వేలు వసూలు చేశారన్నారు. రసీదు మాత్రం 30వేలకే ఇచ్చారని సాక్షాధారాలు ఉన్నాయంటూ ఆందోళనకు దిగారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయని ఏ పని కావాలన్నా డబ్బులు అడుగుతున్నారంటూ ఆరోపించారు. ఇది నిరూపించకపోతే రాజీనామా చేస్తారని సర్పంచ్ అధికారులు అనగా నిరూపించినట్లయితే సర్పంచ్ బేషరతుగా రాజీనామా చేయాలని వార్డు సభ్యులు సత్యం డిమాండ్ చేశారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు : ఈవో రాజు, సర్పంచ్ సుమతి

కాగా వసూళ్ల ఆరోపణలపై ఈఓ రాజు, సర్పంచ్ సుమతి స్పందించారు. వార్డు సభ్యుల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మహిళా సర్పంచ్‌నని కొంతమంది వార్డు సభ్యులు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఈవో రాజు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఏ అధికారి కూడా డబ్బులు వసూళ్లకు పాల్పడలేదని కావాలనే కొందరు వార్డు సభ్యులు రాద్ధాంతం చేస్తున్నారని ప్రజా సమస్యలు తీర్చడం కోసమే అధికారులము ఉన్నామని అన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ - కొనరావుపేట


లారీ అసోసియేషన్‌ను ప్రారంభించిన మార్కెట్ చైర్మన్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ మిరియాల ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కొలనూరు గ్రామంలో లారీ అసోసియేషన్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మర్తన్నపేట సర్పంచ్ వంశీకృష్ణ, లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ జవ్వాజి తిరుపతిగౌడ్, వైస్ ప్రెసిడెంట్ సంకినేని రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి సంకినేని సందీప్‌రావు, కోశాధికారి నూగురి గణేష్, రాజేందర్ రావు, గొర్రె సుధాకర్, మెర్గు శంకర్, జవ్వాజి శేఖర్, మూడపల్లి పర్శరాములు, రైస్ మిల్లర్ ఓనర్స్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ అధికారుల అవగాహన

నవతెలంగాణ - జూలపల్లి



జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామంలో వ్యవసాయ అధికారి ప్రత్యూష శనివారం వరి పొలాల క్షేత్ర పరిశీలన చేశారు. కాండం తొలుచు పురుగు నివారణకు జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పిలక దశలోనే కాండం తొలచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. ఆమెవెంట ఏఈవో టి.రాకేష్ ఉన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం

అధ్యక్షుడిగా వీరస్వామి

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్



సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లి గ్రామంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షునిగా ఐలవేణి వీరస్వామి శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ఉపాధ్యక్షుడిగా నరేందర్ కార్యదర్శిగా మొగిలి, డైరెక్టర్లుగా నాగుల కుమారస్వామి, ఐలవేణి కుమారస్వామి, మొండయ్య, కనుకయ్య శ్రీనివాస్, రాజమల్లు ఎన్నికయ్యారు. అధ్యక్షుడు వీరస్వామి మాట్లాడుతూ సహకారం సంఘం సభ్యులు, ముదిరాజ్, గంగపుత్ర కులస్తులకు ధన్యవాదాలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషిచేస్తామని అన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ - ఇల్లంతకుంట


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మండలంలోని చింతల కుంటపల్లె గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన బంధువు తన్నీరు జలంధర్‌రావు తల్లి లక్ష్మీభాయి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం పరామర్శించారు. ఆమెవెంట మానకొండూర్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సంజయ్‌కుమార్, రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లె మోహన్, బీఆర్ఎస్ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు జీవి.రామకృష్ణ, తోట ఆగయ్య, సిరిసిల్ల జెడ్పీ వైస్ చైర్మన్ వేణు, ఎంపీపీ ఊట్కూర్ రమణారెడ్డి, నాయకులు అనిల్, నర్సయ్య యాదవ్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

దళితబంధుతో ఆర్థికంగా ఎదగాలి


హోటల్ ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ - వీర్నపల్లి

దళిత బంధు పథకంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని వీర్నపల్లి జెడ్పీటీసీ గుగులోతు కళావతి, ఎంపీపీ భులా అన్నారు. మండలంలోని రంగంపేట గ్రామంలో దళిత బంధు పథకం ద్వారా కుమ్మరి దేవయ్య స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న శభరి హోటల్‌ను శనివారం సర్పంచ్ నందగిరి లింగంతో కలిసి వారు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ చాంద్ పాషా, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ సాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కళ, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎంపీటీసీలు నక్క రేణుకహన్మండ్లు, అరుణ్ కుమార్, కో ఆప్షన్ ఉస్మాన్, బంజార సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, ప్యాక్స్ వైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచులు రవి, మల్లేశం, ఉపసర్పంచులు రవి, నరహరి, ఉప తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహావిష్కరణకు

బీనవేని రవిగౌడ్ విరాళం

నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ



సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ రామగుండం మండల గౌరవ అధ్యక్షుడు బీనవేని రవిగౌడ్ పెంచికల్‌పేట్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ విగ్రహావిష్కరణ భూమిపూజకు హాజరై రూ.20వేల విరాళం కమిటీ సభ్యులకు శనివారం అందించారు. ఆయన్ని గౌడ సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బైరి అంజన్న, కమ్మగోని చలమయ్యగౌడ్, రంగు సత్యనారాయణగౌడ్, వడ్లకొండ శ్రీనివాస్‌గౌడ్, మేడగోని సదానందగౌడ్ పాల్గొన్నారు.

పెద్దమ్మ, పెద్ద రాజుల కల్యాణోత్సవం

నవతెలంగాణ - ముస్తాబాద్ : మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో శుక్రవారం పోచమ్మ బోనాలు, పెద్దమ్మ బోనాలు పుట్టకు ధనిపోయుట కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం పెద్దమ్మ పెద్దరాజుల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ ఉత్సవాలకు డాక్టర్ చందర్ దంపతులు, పోతుగల్ సహకార సంఘం చైర్మన్ బాపురావు, ఎంపీపీ శరత్‌రావు, ప్రజాప్రతినిధులు సహకరించినట్టు నిర్వాహకులు తెలిపారు.

అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే

ఆస్తులు అమ్మి చెల్లిస్తా

కొండాపూర్ సర్పంచ్ మల్యాల దేవయ్య


మాట్లాడుతున్న సర్పంచ్

నవతెలంగాణ - కొనరావుపేట : ఎదుగుదలను ఓర్వలేకనే తనపై కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, ప్రజల మధ్య పంచాయతీ నిధుల దుర్వినియోగం, అవినీతిని నిరూపిస్తే తన ఆస్తులు అమ్మి చెల్లిస్తానని మండలంలోని కొండాపూర్ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య అన్నారు. దళిత సర్పంచ్ అని తనపై ఆరోపణలు చేస్తూ, రాజకీయంగా దెబ్బతీయాలని కొందరు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. శనివారం కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు పాలకవర్గంతో పాటు స్థానికులు సమక్షంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలో రూ.25 లక్షల అవినీతి చోటు చేసుకుందని రత్నాకర్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. కేవలం జిల్లా కలెక్టర్ మాత్రం చెక్ పవర్ ఎంపీవోకు కూడా సంతకం ఉండాలని ఆదేశాలు జారీ చేశారని అన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కులపెద్దలు, స్థానికులు, వార్డు సభ్యులు ఫిర్యాదు చేసిన వ్యక్తి రత్నాకర్‌ను పిలిచి పంచాయతీ కార్యాలయం ఆవరణలో అడిగారని గుర్తు చేశారు. అదేవిధంగా అంతా అవినీతి జరిగిందా అని నిరూపించాలని రత్నాకర్‌ను నిలదీయడంతో అక్కడి జారుకున్నాడని అన్నారు. దీంతో తనను చంపుతామని తనపై ఇద్దరు కొడుకులతో పాటు గ్రామానికి చెందిన మొత్తం 13 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం వెనక రాజకీయ ఉద్దేశం ఉందని అన్నారు.

విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర

నవతెలంగాణ - వీర్నపల్లి : వీర్నపల్లి మండలం అంబేద్కర్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం విజ్ఞాన విహార యాత్రకు వెళ్లారు. ప్రధానోపాధ్యాయురాలు తెల్ల వకుళ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని కొత్త చెరువు, ఇందిర పార్క్, హరిదాస్ నగర్ ఏటుజెడ్ పార్క్, గ్రంథాలయాలను సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రఘుపతి, ఎస్ఎంసీ చైర్మన్ జోసెఫ్, అటెండర్ లక్ష్మి పాల్గొన్నారు.



బైండోవర్ అతిక్రమించిన నిందితుడి రిమాండ్

నవతెలంగాణ - ధర్మారం : గుడుంబా అమ్మకాలు సాగిస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినప్పటికీ, తిరిగి అమ్మకాలు సాగిస్తూ నిబంధనలను అతిక్రమించిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామానికి చెందిన గుజ్జుల మల్లేశం గుడుంబా అమ్ముతూ ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి దొరికగా గత సంవత్సరం ఏప్రిల్ 28న అప్పటి ధర్మారం తహసీల్దార్ ఆర్.వెంకటలక్ష్మి ఎదుట బైండోవర్ చేశారు. ఏడాదిలోపు మళ్లీ గుడుంబా అమ్మితే లక్ష రూపాయల జరిమానాతో పాటు జైలు శిక్ష షరతు విధించారు. అయినప్పటికీ మల్లేశం మళ్లీ గుడుంబా అమ్ముతూ పట్టుబడ్డారు. బైండోవర్‌ను అతిక్రమించిన మల్లేశం వెంటనే జరిమాన చెల్లించాలని ఎక్సైజ్ శాఖ తరపున రెండుసార్లు నోటీసులు పంపారు. స్పందించకపోగా, బైండోవర్‌ను అతిక్రమించిన మల్లేశంను శనివారం ఎక్సైజ్ ఎస్ఐ మనీషా రాథోడ్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది ఖిలావనపర్తిలో అరెస్ట్ చేసి ధర్మారం డిప్యూటీ తహసీల్దార్ కే.మల్లారెడ్డి ముందు హాజరుపరిచారు. నిబంధనలను అతిక్రమించడంతో పాటు నోటీసులను బేఖాతరు చేసినందున వెంటనే రిమాండ్‌కు పంపించారు. ధర్మారం ఆర్ఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జీడికే టూ టౌన్ ఎస్ఐ పి.శ్యామ్ పటేల్



నవతెలంగాణ - యైటింక్లైన్ కాలనీ : చట్టాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని గోదావరిఖని టూటౌన్ ఎస్ఐ పి.శ్యామ్ పటేల్ అన్నారు. గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్పందన పాఠశాలలో శనివారం విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. చిన్ననాటి నుండే చట్టాలపై, శాంతి భద్రలపై పూర్తి అవగాహన వస్తేనే నేరాల వైపు మల్లకుండా అదుపులో ఉంచవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కళాధర్‌రెడ్డి, కానిస్టేబుల్ కనుకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి మండలాల ఎంఎస్‌పీ

కన్వీనర్‌ల నియామకం



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల ఎంఎస్‌పి కన్వీనర్‌లను శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా కోఆర్డినేటర్ కానాపురం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎంఎస్‌పి మండల కన్వీనర్లుగా నేరెళ్ల శ్రీనివాస్‌ను, వద్దూరిరాజంను నియమించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో పాటు రాజ్యాధికార దిశగా ముందుకు సాగుదామన్నారు. మహాజన సోషలిస్ట్ పార్టీకి తెలంగాణ మహాజనులంతా అండగా నిలవాలని విజ్ఞాప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గద్దరాశి భగవంతం, వంతడుపుల గోపాల్, కట్కూరి సురేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు నేరెళ్ల పరశురాములు, మల్యాల ప్రహ్లాద్, తిమ్మాపురం రాజు, కొత్తూరి రాజం, పసులా సతీష్, మల్లారపు రాజయ్య, నమిలికొండ నర్సయ్య, కత్తెరపాక అశోక్ పాల్గొన్నారు.

గౌడ సంఘం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ - బోయినిపల్లి : మండలంలోని తడగొండ గ్రామంలో గౌడ సంఘ సభ్యులు సమావేశం ఏర్పాటు చేసి శనివారం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉయ్యాల రమేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడుగా బండారి మహేందర్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా ఉయ్యాల లచ్చయ్యగౌడ్, కార్యదర్శిగా బత్తిని లస్మయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా బత్తిని మల్లయ్యగౌడ్, క్యాషియర్‌గా చింతలకోటి లచ్చయ్యగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికలకు సహకరించిన గౌడ సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీలో యువకుల చేరిక

నవతెలంగాణ - వేములవాడ రూరల్ : వేములవాడ రూరల్ మండలం వట్టేంల, అచన్నపల్లి గ్రామాల నుండి సుమారు 50 మంది యువకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ యువకులకు పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెగుల మల్లికార్జున్, నాయకులు బండ మల్లేశం, గొప్పు బాలరాజు, చెట్టిపల్లి రవికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - ధర్మారం : పోస్ట్ ఆఫీసు అందించే చిన్న మొత్తాల పొదుపు వడ్డీ రేట్లు భారీగా పెరిగాయని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని సబ్ పోస్ట్ ఆఫీస్‌లో శనివారం పోస్టల్ ఎంప్లాయిస్, తపాలా ఏజెంట్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోస్టు ఆఫీసు సేవింగ్స్ అకౌంటు బ్యాంక్ కన్నా ఎక్కువ ఇంటరెస్ట్ రేట్ 4శాతం ఇస్తుందని, ఒక సంవత్సరం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 6.6శాతం, 2 సంవత్సరాలకు 6.8, 3 సంవత్సరాలకు 6.9, 5సంవత్సరాలకు 7శాతం, అలాగే సీనియర్ సిటిజన్స్ డిపాజిట్లపై 8శాతం వడ్డీ అందిస్తున్నామని చెప్పారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ కూడా మంచి బోనస్‌తో పాటు ఇన్సూరెన్స్ కవరేజు ఉంటుందని వివరించారు. ఈ నెల 31 వరకు పరిసర గ్రామాల పోస్టు ఆఫీసులలో ప్రత్యేక కౌంటర్ లు ఓపెన్ చేసి ప్రజలకు పోస్టల్ సేవలు అందిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెయిల్ ఓవర్ సెల్ రవి కుమార్, సబ్ పోస్ట్ మాస్టర్ రవి పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని తిమ్మాపూర్, సింగారం గ్రామాలలో రెండవ విడత డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి శనివారం ఎంపిపి పిల్లి రేణుక, జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తహశీల్దార్ జయంత్ కుమార్ భూమి పూజ చేశారు. రెండవ విడతలో 10 మంది ఇండ్ల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి, జడ్పిటిసి మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన, నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



నవతెలంగాణ - బోయినిపల్లి : బోయినిపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ప్రణీత పంట నమోదులో భాగంగా పొలాలను శనివారం పరిశీలించారు. మొగిపురుగు, సల్ఫైడ్ దుష్ప్రభావం వంటి పంట వ్యాధుల నివారణ గురించి రైతులకు సూచనలు చేశారు.

నవతెలంగాణ

అలరించే బుట్టబొమ్మ ప్రేమకథ


సూర్య వశిష్ఠ, అనిఖా సురేంద్రన్

ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ భాగస్వామ్యంతో సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించిన ఫీల్ గుడ్ రూరల్ డ్రామా 'బుట్ట బొమ్మ'. సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంతో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం హైదరాబాద్‌లోని ఏఎంబీ మాల్‌లో జరిగిన ట్రైలర్ లాంచ్ వేడుకకు హీరో విశ్వక్ సేన్ ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ, 'వంశీ నిర్మాణంలో సినిమా చేద్దామని ఎదురుచూస్తున్న హీరోలలో నేను ఒకడిని. నిజానికి ఈ సినిమాలో నేను నటించాల్సి ఉంది. కానీ డేట్స్ కుదరకపోవడం వల్ల చేయలేకపోయాను. ఇది నాకు చాలా ఇష్టమైన కథ. గుండెల మీద చేతులేసుకుని వచ్చేయొచ్చు ఈ సినిమాకి.. అంత బాగుంటుంది. అనిఖా, సూర్యలకు మొదటి సినిమాకే సితార బ్యానర్‌లో వంశీ నిర్మాణంలో నటించే అవకాశం రావడం అదృష్టమని చెప్పాలి. గోపిసుందర్ అద్భుతమైన సంగీతం అందించారు. 'మేజర్' తర్వాత వంశీ పచ్చిపులుసు సినిమాటోగ్రాఫర్‌గా చేశారు. నవీన్ నూలి ఎడిటర్‌గా చేశారు. వంశీ నిర్మాణంలో నేను చేయబోయే సినిమాని కూడా త్వరలో ప్రకటిస్తాం. ఇక ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో నటించిన అర్జున్ దాస్‌కి అభిమానిని. ఈ సినిమా మంచి విజయం సాధించాలి' అని చెప్పారు. 'ఇది ఒక మంచి పల్లెటూరి కథ. ఐదేళ్ల క్రితం 'ఉయ్యాల జంపాల' అనే సినిమా చూశాం. అలాంటి సినిమాలో సస్పెన్స్‌లు, ట్విస్ట్‌లు ఉంటే ఎలా ఉంటుందో.. అలా ఉంటుంది ఈ సినిమా. సస్పెన్స్‌తో కూడిన ఒక క్యూట్ విలేజ్ లవ్ స్టోరీ ఇది. విశ్వక్ సేన్ చెప్పినట్లు త్వరలోనే మా కలయికలో కొత్త సినిమా ప్రకటన వస్తుంది. అందులో విశ్వక్ సేన్ విశ్వరూపం చూస్తారు' అని నిర్మాత నాగవంశీ తెలిపారు.

నాయిక అనిఖా సురేంద్రన్ మాట్లాడుతూ, హీరోయిన్‌గా ఇది నా మొదటి సినిమా. సితార బ్యానర్‌లో పనిచేయడం సంతోషంగా ఉంది. నన్ను నమ్మి ఇంత పెద్ద అవకాశం ఇచ్చినందుకు నిర్మాత వంశీకి, దర్శకుడు రమేష్‌కి ధన్యవాదాలు' అని అన్నారు. ' నన్ను నమ్మి నాకు ఇంతమంచి అవకాశం ఇచ్చినందుకు.. నేను త్రివిక్రమ్, వంశీ, చినబాబుకి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. అలాగే దర్శకుడు రమేష్ సినిమాని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని హీరో సూర్య వశిష్ఠ చెప్పారు.

నవచిత్రం

బాగుందని ప్రశంసిస్తున్నారు


భరత్, సుధీర్‌బాబు

సుధీర్ బాబు కథానాయకుడిగా భవ్య క్రియేషన్స్ పతాకంపై నిర్మాత వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన సినిమా 'హంట్'. శ్రీకాంత్, 'ప్రేమిస్తే' ఫేమ్ భరత్ నివాస్ ప్రధాన పాత్రల్లో నటించారు. మహేష్ దర్శకత్వం వహించారు. రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి అప్రిసియేషన్ లభిస్తోంది.

ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ, 'ఈ సినిమా స్టార్ట్ చేసినప్పుడు ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారోనని భయపడ్డాం. అయితే ప్రేక్షకులు అందరూ సెకండాఫ్‌లో 30 మినిట్స్ అద్భుతంగా ఉందని చెబుతున్నారు. సోషల్ మీడియాలో చాలా మంది సినిమాను అప్రిషియేట్ చేస్తూ పోస్టులు చేశారు. ఇది డిఫరెంట్ ఫిల్మ్' అని తెలిపారు.

'క్రిటిక్స్, ఆడియన్స్ నుంచి రెస్పాన్స్ చాలా బావుంది. డేరింగ్ అటెంప్ట్ అని ఆడియన్స్ ట్వీట్స్ చేస్తున్నారు. సుధీర్ బాబు ధైర్యంగా ఆ రోల్ చేశారు. నేను ఎప్పటికీ గర్వపడే సినిమా' అని దర్శకుడు మహేష్ చెప్పారు.

భరత్ మాట్లాడుతూ, 'తెలుగు ప్రేక్షకుల ముందుకు స్ట్రెయిట్ సినిమాతో రావడానికి కొన్నేళ్ళు టైమ్ తీసుకున్నా... మంచి సినిమా చేశా. సరైన సినిమా చేశా. కంటెంట్ సినిమాల కోసం చూసే ప్రేక్షకులకు సరైన చిత్రమిది. కమర్షియల్ విలువలతో సినిమా తీశాం. దర్శకుడు మహేష్ కెరీర్‌లో ఇదొక మంచి సినిమా. సుధీర్ బాబు కొత్తగా ట్రై చేశారు. ఈ సినిమాలో నేను ఒక భాగం అయినందుకు సంతోషంగా ఉంది. నాకు అవకాశం ఇచ్చిన భవ్య క్రియేషన్స్ సంస్థకు థ్యాంక్స్" అని అన్నారు.

యూనివర్సల్‌గా రీచ్ అయ్యే సినిమా


దివ్యాంశ కౌశిక్, సందీప్ కిషన్

హీరో సందీప్ కిషన్ నటించిన రొమాంటిక్ యాక్షన్-ప్యాక్డ్ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'మైఖేల్'. రంజిత్ జయకోడి దర్శకుడు.

విజయ్ సేతుపతి, వరలక్ష్మీ శరత్ కుమార్, దివ్యాంశ కౌశిక్, వరుణ్ సందేశ్, గౌతమ్ మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి కలిసి ఈ చిత్రాన్ని భారీగా నిర్మించాయి. భరత్ చౌదరి, పుస్కూర్ రామ్ మోహన్ రావు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి నారాయణ్ దాస్ కె నారంగ్ సమర్పకులు.

ఫిబ్రవరి 3న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సందీప్ కిషన్ మాట్లాడుతూ,'ఇది చాలా ప్రత్యేకమైన చిత్రం. మేమందరం కథని, దర్శకుడు రంజిత్‌ని బలంగా నమ్మాం. మా నమ్మకాన్ని ట్రైలర్‌కి వచ్చిన స్పందనే నిలబెట్టింది. ఈ సినిమా ఈ రోజు ఇంత పెద్దగా మారిందంటే దానికి కారణం భరత్. అలాగే సునీల్, రామ్ మోహన్‌కి కృతజ్ఞతలు. కథ, కంటెంట్, ఫిల్మ్ మేకింగ్ పరంగా 'మైఖేల్' యూనివర్సల్‌గా రీచ్ అయ్యే సినిమా' అని అన్నారు. 'ఈ కోసం అందరం చాలా హార్డ్ వర్క్ చేశాం. ముఖ్యంగా సందీప్, దర్శకుడు రంజిత్ ఫిజికల్‌గా, మెంటల్‌గా చాలా హార్డ్ వర్క్ చేశారు. అలాగే వరుణ్ సరికొత్త స్వాగ్‌తో తెరపై కనిపిస్తారు' అని నాయిక దివ్యాంశ కౌశిక్ చెప్పారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా సందీప్ కోసం పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అందరూ ఈ సినిమాని చూసి చాలా పెద్ద సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'తెలుగులో ఇది నా మొదటి చిత్రం. ఇందులో యాక్షన్, రొమాన్స్, ఎమోషన్స్ అన్నీ ఉంటాయి. టెక్నికల్‌గా కూడా సినిమా చాలా ఉన్నతంగా ఉంటుంది. నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా సినిమాని భారీ నిర్మించారు' అని దర్శకుడు రంజిత్ జయకోడి చెప్పారు.

ఈ సినిమాలో చాలా మంచి నటీనటులు భాగమయ్యారు. టీజర్, ట్రైలర్, పాటలు సినిమాపై హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేశాయి. సినిమాకి క్రేజ్ పెరుగుతూ వచ్చింది. ఖచ్చితంగా సక్సెస్ కొడతాం.

- నిర్మాత భరత్ చౌదరి

దర్శకుడు రంజిత్ ఈ కథ చెప్పిన వెంటనే మరో ఆలోచన లేకుండా సినిమా చేద్దామని చెప్పాం. సందీప్ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. సినిమా విషయంలోనే కాదు పబ్లిసిటీతో పాటు మిగతా అన్ని విషయాల్లో ఆయన ఎంతో ఆసక్తితో ఇన్వాల్ అయ్యి వర్క్ చేయడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. వరుణ్ అద్భుతంగా చేశాడు. హీరోయిన్ దివ్యాంశ క్యూట్‌గా ఉంది.

- నిర్మాత పుస్కూర్ రామ్ మోహన్ రావు

తెలుగులో రాలేదు


శివ కందుకూరి, రాశి సింగ్

శివ కందుకూరి, రాశి సింగ్ జంటగా పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'భూతద్దం భాస్కర్ నారాయణ'. ఈ సినిమాను స్నేహల్ జంగాల, శశిధర్ కాశి, కార్తీక్ ముడుంబై సంయుక్తంగా మిలియన్ డ్రీమ్స్ క్రియేషన్స్, విజయ సరాగ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై నిర్మిస్తున్నారు. ఈ సినిమా మార్చి 31న రిలీజ్ కానుంది. అందులో భాగంగా ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర బృందం శనివారం నిర్వహించింది.

హీరో శివ కందుకూరి మాట్లాడుతూ,'ఈ టీజర్‌ను బిగ్ స్క్రీన్ పై చూడటం చాలా ఆనందంగా ఉంది. మా ప్రొడ్యూసర్స్ కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమా అవుట్‌పుట్ కోసం చాలా ఖర్చుపెట్టారు. హీరో తేజ సజ్జ, నిర్మాత రాహుల్ యాదవ్, హీరో తిరువీర్‌కి కృతజ్ఞతలు. ఇలాంటి సినిమా తెలుగులో రాలేదు. ఒక మంచి సినిమాను మీకు ఇవ్వబోతున్నాం. ఈ సినిమా చూసి మీరొక క్రేజీ ఫీలింగ్‌తో బయటకు వస్తారు' అని తెలిపారు. 'ఈ సినిమాలో నాకు మంచి రోల్ ఇచ్చారు. ఈ స్టోరీ వినగానే నా పాత్ర, ఈ సినిమా ఖచ్చితంగా వర్కౌట్ అవుతుందనిపించింది' అని హీరోయిన్ రాశి సింగ్ అన్నారు.

డైరెక్టర్ పురుషోత్తం మాట్లాడుతూ,'ఈ కథ రాయడానికి మెయిన్ రీజన్ ప్రొడ్యూసర్ రాహుల్ యాదవ్. ఈ సినిమాకి ప్రొడ్యూసర్స్ నాకు మంచి ఫ్రీడమ్ ఇచ్చారు. మా హీరో శివ కందుకూరి ఫస్ట్ బెంచ్ స్టూడెంట్. ఆయన ఒక అసోసియేట్ డైరెక్టర్‌లా హెల్ప్ చేశారు. ఈ సినిమాని చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా' అని చెప్పారు. ప్రొడ్యూసర్ స్నేహాల్ మాట్లాడుతూ, 'ఈ పూర్తి స్క్రిప్ట్‌ను నాకు డైరెక్టర్ ముందే పంపించాడు. శశిధర్, కార్తీక్, నేను 150 పేజీల వరకు చదివి ఇది చేయాలని ఫిక్స్ అయిపోయాం. డైరెక్టర్ పురుషోత్తం వెరీ టాలెంటెడ్. సినిమా చాలా బాగా వచ్చింది' అని తెలిపారు.



చెడ్డి గ్యాంగ్ తమాషా రిలీజ్‌కి రెడీ


గాయత్రి పటేల్

అబుజా ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ లీల ఎంటర్టైన్మెంట్స్ సంయుక్త నిర్మాణంలో వెంకట్ కళ్యాణ్ దర్శకత్వంలో సిహెచ్ క్రాంతి కిరణ్ నిర్మించిన చిత్రం 'చెడ్డి గ్యాంగ్ తమాషా'. సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఫిబ్రవరి రెండవ వారంలో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్ర టైటిల్ టిజర్‌ను నటుడు సునీల్ లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత సిహెచ్ క్రాంతి కిరణ్ మాట్లాడుతూ,'మా మూవీ టైటిల్ పోస్టర్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి, టైటిల్ టిజర్‌ను సునీల్, టీజర్‌ను దర్శకుడు నాగ్‌అశ్విన్, ట్రైలర్‌ను బ్రహ్మానందం రిలీజ్ చేయటంతో సినిమా మీద మంచి అంచనాలు ఏర్పడ్డాయి. బిజినెస్ పరంగా కూడా చాలా హ్యాపీగా ఉన్నాం. ఫిబ్రవరి రెండవ వారంలో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం. సినిమా కచ్చితంగా అలరిస్తుంది' అని తెలిపారు. వెంకట్ కళ్యాణ్, గాయత్రి పటేల్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి డి ఓ పి: జి కె యాదవ్ బంక, సంగీతం: అర్జున్, లిరిక్స్: విహారి, ఎడిటింగ్ : నర్సింగ్ రాథోడ్, ఆర్ట్ : రెడాన్ ఎస్కే, కొరియోగ్రాఫర్ : భాను.

మంచి ఎంట్రీగా ఫీలవుతున్నా

ఆషికా రంగనాథ్ తెలుగులో నటించిన తొలి చిత్రం 'అమిగోస్'. కళ్యాణ్ రామ్ హీరోగా, రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవి శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 17న ఈ మూవీ గ్రాండ్‌గా రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఆషికా రంగనాథ్ మీడియాతో ముచ్చటించారు.

'చిన్నప్పట్నుంచి తెలుగు సినిమాలు, పాటలు వినేదాన్ని. దాని వల్ల తెలుగు అర్థమయ్యేది. ఇప్పుడు వర్క్ చేస్తున్నాను. దాని వల్ల నేర్చుకోవటానికి అవకాశం వచ్చింది. సినిమాలో డైలాగులు చెప్పడం వల్ల తెలుగు కొంచెం నేర్చుకోగలుగుతున్నాను. డైరెక్టర్ రాజేందర్ రెడ్డి కథ చెప్పిన విధానం నాకు బాగా నచ్చింది. సినిమాలో హీరో మూడు పాత్రలు చేయటం, నా పాత్రను మలిచిన తీరు అన్ని నచ్చడంతో సినిమాకు ఓకే చెప్పేశాను. నేను కళ్యాణ్ రామ్‌ని ఫస్ట్ 'అమిగోస్' సెట్ లోనే చూసాను. తెలుగు డైలాగ్స్ విషయంలో ఆయన చాలా సాయం చేశారు. కళ్యాణ్ రామ్ చాలా కూల్ పర్సన్. ఆయనకి చాలా విషయాలు మీద ఎక్కువ అవగాహన ఉంది. అలాంటి ఒక లెజెండ్ ఫ్యామిలీ నుంచి వచ్చిన హీరోతో పని చేస్తున్నందుకు చాలా ఆనందంగా అనిపించింది. ఈ సినిమాలో ఆయన మూడు పాత్రల్లో నటించారు. ప్రతి పాత్రకు ఆయన చేసిన కృషి చూసి ఫిదా అయ్యాను. ఈ సినిమాలోని సాంగ్ డ్రీమ్స్ రిలీజ్ అయినప్పుడు చాలామంది వెల్‌కమ్ టు టాలీవుడ్ అని మెసేజ్ పెట్టారు. ఇక్కడ కొత్త వారిని చాలా బాగా ఆదరిస్తారని పేరు ఉంది. దాన్ని నేను ప్రత్యక్షంగా ఎక్స్‌పీరియన్స్ చేశాను. కన్నడలో ఇప్పటి వరకు 12 సినిమాలు చేశాను. తమిళంలో ఓ సినిమా చేశాను. ఈ చిత్రంతో తెలుగులోకి అడుగు పెట్టాను. నటిగా ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేయాలి. అలాగే పలు భాషల్లోనూ నటించాలి. తెలుగులో ఇతర సినిమాల్లో నటించమని అవకాశాలు వస్తున్నాయి. అయితే ఈ సినిమా రిలీజ్ కోసం వెయిట్ చేస్తున్నాను. దీని తర్వాత మంచి పాత్రలు అనిపించిన సినిమాల్లో నటిస్తాను. తెలుగు ఆడియెన్స్ గొప్ప మనసున్నవారు. ఇక్కడ కన్నడ పరిశ్రమకు చెందిన నటీనటులు చాలా మంది రాణిస్తున్నారు. హీరోయిన్సే కాదు.. కిచ్చా సుదీప్, ధనంజయ్, దునియా విజయ్, యష్.. సహా చాలా మందిని తెలుగు ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. నన్ను కూడా అలాగే ఆదరిస్తారనే నమ్మకంతో ఎదురు చూస్తున్నాను. నటిగా మంచి రోల్ చేయటమే కాదు.. మంచి ప్రొడక్షన్ హౌస్, హీరో ఉన్న సినిమాలో యాక్ట్ చేస్తే మంచి ఎంట్రీ అవుతుంది. నాకు ఈ సినిమాతో అవన్నీ చక్కగా కుదిరాయనిపిస్తుంది. దీంతో ఈ సినిమా నాకు కరెక్ట్ ఎంట్రీ అనిపిస్తుంది. బాలకృష్ణ చేసిన 'ఎన్నో రాత్రులొస్తాయిగానీ..' వంటి ఐకానిక్ సాంగ్‌లో నటించటం లక్కీగా ఫీల్ అవుతున్నాను. ఈజీగా ఆడియెన్స్‌కు కనెక్ట్ అవుతాననిపించింది. కచ్చితంగా నారోల్ అందరికీ నచ్చుతుంది' అని ఆషికా రంగనాథ్ చెప్పారు.

థ్రిల్ చేసే కోనసీమ థగ్స్


హ్రిదు హరూన్

ప్రముఖ డాన్స్ మాస్టర్ బృందా గోపాల్ దర్శకత్వంలో పాన్ ఇండియా లెవెల్‌లో పలు భాషల్లో తెరకెక్కుతున్న చిత్రం 'థగ్స్'. తెలుగులో 'కోనసీమ థగ్స్' పేరుతో విడుదల చేస్తున్నారు. రా యాక్షన్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని భారీ చిత్రాల నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శిబు తమీన్స్ కుమార్తె రియా షిబు హెచ్ ఆర్ పిక్చర్స్ బ్యానర్ పై సమర్పిస్తూ, జీయో స్టూడియోస్‌తో కలిసి నిర్మిస్తున్నారు. తమీన్స్ కుమారుడు హ్రిదు హరూన్ హీరోగా పరిచయం అవుతుండగా, సింహ, ఆర్‌కెసురేష్, మునిష్కంత్, శరత్ అప్పనీ, అనస్వర రాజన్ ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు.

'ఈ మధ్యన విడుదలైన 'థగ్స్' క్యారెక్టర్స్ ఇంట్రడక్షన్ వీడియో మంచి బజ్ క్రియేట్ చేసి, అందరి ప్రశంసలు అందుకుంది. ఆ వీడియో సినిమా పై అంచనాలు రెట్టింపు చేసింది. తాజాగా టీం చిత్ర ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. డిజిటల్ ట్రైలర్‌ను విజయ్ సేతుపతి, దుల్కర్ సల్మాన్, ఆర్య, అనిరుధ్, కీర్తి సురేష్ విడుదల చేశారు. ఈ 'కోనసీమ థగ్స్' ట్రైలర్ వయోలెన్స్‌తో కూడిన ఒక ఇంటెన్స్ ఫిల్మ్‌ను ప్రేక్షకులకు పరిచయం చేసింది. కోనసీమ బ్యాక్ డ్రాప్‌లో జరిగే ఈ చిత్రం ప్రేక్షకులకు గ్రిప్పింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతోంది. ట్రైలర్‌లో హ్రిదు హరూన్, సింహ, ఆర్ కె సురేష్, మునిష్కంత్, అనస్వర రాజన్ పాత్రలు ఉత్కంఠ రేపేలా రివీల్ చేశారు దర్శకురాలు బృంద. ట్రైలర్ కట్ అంచనాలను పెంచేలా ఉండి, సినిమా మీద మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది. ఒక క్రూరమైన వాతావరణం ఉండే జైలు నుండి బయట పడేందుకు పాత్రలు వేసే ఎత్తులు, అందుకు అవసరమైతే ఎంత దూరమైనా వెళ్లేలా చేసే పరిస్థితులతో ఆడియెన్స్‌ను ఆద్యంతం ఉత్కంఠకు గురిచేసేలా ఉంది. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో భారీ స్థాయిలో త్వరలోనే విడుదలకు సిద్ధం అవుతోంది' అని చిత్ర బృందం తెలిపింది.

ఆ 'ప్రేమదేశం' స్థాయిలో


శ్రీకాంత్ సిద్ధం

1996లో విడుదలై పెద్ద సూపర్ హిట్ సాధించిన 'ప్రేమ దేశం' సినిమా అప్పట్లో యువతను విపరీతంగా ఆకట్టుకుని ఉర్రూత లూగించింది. చాలా కాలం తర్వాత అదే టైటిల్‌తో వస్తున్న సినిమా 'ప్రేమదేశం'. సిరి క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై త్రిగున్, మేఘా ఆకాష్ హీరోహీరోయిన్లుగా, శ్రీకాంత్ సిద్ధం స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఫిబ్రవరి 3న గ్రాండ్‌గా రిలీజ్ కానునుంది.

ఈ నేపథ్యంలో దర్శక,నిర్మాత శ్రీకాంత్ సిద్ధం మీడియాతో సంభాషించారు.

'ఒక షార్ట్ ఫిల్మ్ చేసిన తర్వాత ఈ సినిమాని స్టార్ట్ చేశాను. రెండు విభిన్నమైన ప్రేమకథలతో చేసిన సినిమా. మోడరన్ గెటప్ ఉన్న తల్లి పాత్రకు మధుబాలని ఎంపిక చేసుకున్నాం. తనికెళ్ల భరణి ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. ఇందులో తల్లీకొడుకుల రిలేషన్‌ను చాలా చక్కగా చూపించాం. త్రిగున్, మేఘా ఆకాష్ పెయిర్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది. 'ప్రేమదేశం' అంటే ఎక్కువగా కనెక్ట్ అయ్యేది యూత్. యూత్ బేస్డ్‌గా చూస్తే సాంగ్స్, సీన్స్, కాలేజీ బ్యాక్ డ్రాప్ పరంగా చాలా కేర్ తీసుకున్నాం. నాటి 'ప్రేమదేశం' సినిమాకు ఏఆర్ రెహ్మాన్ ప్రాణం పోస్తే, నేటి ఈ సినిమాకి మణిశర్మ తన బ్యాగ్రౌండ్ స్కోర్, సంగీతంతో అంతే ప్రాణం పోశారు. ఈ చిత్ర టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'పదములే లేవు పిల్ల' పాట, 'తెలవారెనే స్వామి..' ఇలా ఈ సినిమాలో ఉన్న అన్ని పాటలూ అన్ని మాధ్యమాలలో టాప్ చార్ట్ బస్టర్‌గా నిలిచాయి. అవుట్ అండ్ అవుట్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించిన ఈ సినిమా అందర్నీ అలరిస్తుంది' అని చెప్పారు.


ప్రేక్షకులకు కొత్త రంగుల ప్రపంచం


క్రాంతి కృష్ణ, శ్రీలు

ఇప్పటివరకు ప్రేక్షకులను తనదైన కామెడీతో, మేనరిజంతో ఆకట్టుకున్న సీనియర్ నటుడు, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ రాజ్ దర్శకత్వం వహించిన సినిమా 'కొత్త రంగుల ప్రపంచం'. పృథ్వీరాజ్, క్రాంతి కృష్ణ, శ్రీలు, విజయ రంగరాజు, అశోక్ కుమార్, గీతాసింగ్, కృష్ణ తేజ, అంబటి శ్రీను, జబర్దస్త్ నవీన్, జబర్దస్త్ గణపతి నటీనటులుగా శ్రీ పిఆర్ క్రియేషన్స్ పతాకంపై పద్మ రేఖ, గుంటక శ్రీనివాస్ రెడ్డి, కుర్రి కృష్ణా రెడ్డి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన గ్లిమ్స్‌ను చిత్రబృందం రిలీజ్ చేసింది. ఈ సందర్భంగా మీడియాతో పృథ్వీ మాట్లాడుతూ,'ఈ సినిమా చాలా బాగా వచ్చింది. ఒక సీన్‌ను మొదలుపెట్టేముందు డీఓపీతో కూర్చుని మాట్లాడుకునే వాళ్ళం. ఈ సినిమాకి సినీ ప్రముఖులు నుండి మంచి ప్రశంసలు వచ్చాయి. సంగీత దర్శకుడు అద్భుతమైన సాంగ్స్ ఇచ్చారు' అని తెలిపారు. 'టెక్నీషియన్స్ అందరూ 100% వర్క్ చేశారు. ఇది నా మొదటి సినిమా. నిర్మాతలు న్యూ టాలెంట్‌ని ఎంకరేజ్ చేయడం చాలా గ్రేట్. సీనియర్ నటులతో సినిమా చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను' అని హీరో క్రాంతి కృష్ణ అన్నారు.

హీరోయిన్ శ్రీలు మాట్లాడుతూ,'ఈ సినిమా కోసం అందరూ వాళ్ళ బెస్ ఎఫెర్ట్ ఇచ్చారు. మా నాన్న దర్శకత్వంలో నేను ఈ సినిమా చేయటం లక్కీగా ఫీల్ అవుతున్నాను.అన్నివర్గాల ప్రేక్షకులను మెప్పించే సినిమా ఇది. ఇందులో నా పాత్ర చాలా వైవిధ్యంగా ఉంటుంది' అని చెప్పారు. ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్ : శ్రీ సంగీత ఆదిత్య, కెమెరామెన్ : శివారెడ్డి.

గోదావరి నేపథ్యంలో సాగే అందమైన కథ


రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్

రక్షిత్ అట్లూరి హీరోగా, కోమలి ప్రసాద్ హీరోయిన్‌గా రూపొందుతున్న లవ్ అండ్ యాక్షన్ డ్రామా 'శశివదనే'.

గోదావరి నేపథ్యంలో సినిమా తెరకెక్కుతోంది. గౌరి నాయుడు సమర్పణలో ఎస్.వి.ఎస్. కన్‌స్ట్రక్షన్స్ ప్రై.లి, ఎ.జి.ఫిల్మ్ కంపెనీ పతాకాలపై సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో అహితేజ బెల్లంకొండ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతుంది.

ఈ చిత్రంలో ప్రవీణ్ యండమూరి, తమిళ నటుడు శ్రీమాన్, కన్నడ నటుడు దీపక్ ప్రిన్స్, జబర్దస్త్ బాబీ కీలక పాత్రల్లో నటించారు.

ఇటీవల నిర్మాత అహితేజ బెల్లంకొండ 'శశివదనే' టైటిల్ ప్రోమోను విడుదల చేశారు. ప్రోమోను గమనిస్తే, కోమలి ప్రసాద్ దేవుడికి పూజ చేసి తులసి చెట్టుకు దండం పెట్టుకుంటూ ఉంటుంది. ఆమె ప్రేమికుడు ఇంటి దగ్గరకు వచ్చాడని తెలియగానే ఆనందంతో మేడ పైకి పరుగులు తీస్తుంది. ప్రోమో చాలా నేచురల్‌గా, కలర్‌ఫుల్‌గా ఆకట్టుకుంటోంది. హరి చరణ్, చిన్మయి శ్రీపాద పాడిన ఈ పాటను సినిమాలో తొలి పాటగా అలరించనుంది. శ్రవణ వాసుదేవన్ సంగీతం అందించిన సంగీతం చాలా క్యూట్‌గా ఉంది. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం ట్యూన్‌కు తగ్గట్లు అందంగా ఉన్నాయి. 'శశివదనే' పూర్తి టైటిల్ సాంగ్‌ను మేకర్స్ ఫిబ్రవరి1న రిలీజ్ చేస్తున్నారు. ఈ వింటేజ్ మెలోడి తప్పకుండా ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటుందని వారు తెలిపారు. కోనసీమ, అమలాపురం తదితర ప్రాంతాల్లో 50 రోజులకు పైగానే ఈ సినిమాను చిత్రీకరించారు. ప్రేమకథల నేపథ్యంలో ఇప్పటికే ఎన్నో సినిమాలు వచ్చినప్పటికీ వాటితో పోలిస్తే ఈ సినిమా కచ్చితంగా భిన్నంగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది.

ఈ చిత్రానికి ఎడిటర్: గ్యారీ బి.హెచ్, సి.ఈ.ఓ: ఆశిష్ పెరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చోలేటి, సినిమాటోగ్రాఫర్: సాయికుమార్ దార, పాటలు: కిట్టు విస్సా ప్రగడ, కరుణాకర్ అడిగర్ల, మ్యూజిక్: శ్రవణ వాసుదేవన్, స్టంట్స్: జాషువా - జీవన్, కాస్ట్యూమ్స్ - సమర్పణ: గౌరీ నాయుడు, నిర్మాత: అహితేజ బెల్లంకొండ, రైటర్ - డైరెక్టర్: సాయి మోహన్ ఉబ్బన.

రెడీ.. ఢీ తరహాలో ఉండే చిత్రం


చేతన్ మద్దినేని

'రోజులు మారాయి' సినిమాతో నటుడిగా తెలుగు తెరకు పరిచయం అయిన చేతన్ మద్దినేని 'గల్ఫ్' సినిమాతో అందరి ప్రశంసలు అందుకున్నారు. అలాగే ప్రయోగాత్మక సినిమా 'బీచ్ రోడ్ చేతన్' సినిమాలో హీరోగా నటించడమే కాకుండా దర్శకత్వం వహించారు. ఐఫోన్‌లో చిత్రీకరించిన ఈ మూవీ థియేటర్స్‌లో విడుదలై శభాష్ అనిపించుకుంది. ఇక 'ఫస్ట్ ర్యాంక్ రాజు' సినిమా ఆయనకు నటుడిగా మంచి గుర్తింపు తెచ్చింది. నేడు (ఆదివారం) చేతన్ మద్దినేని పుట్టినరోజు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'కరోనా కారణంగా రెండు సంవత్సరాలు గ్యాప్ వచ్చింది. ఈ గ్యాప్‌లో లాస్ ఏంజిల్స్‌లో ఉన్న లీస్ట్ ట్రాస్ బర్గ్ ఇన్‌స్టిట్యూట్‌లో మెథడ్ యాక్టింగ్ నేర్చుకున్నాను. అలాగే కథలు వినే క్రమంలో గోపీమోహన్ చెప్పిన ఒక స్టోరీకి బాగా కనెక్ట్ అయ్యాను. రొమాంటిక్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా ఉంటుంది. ఈ కథ నచ్చి నేనే సొంతంగా నిర్మిస్తున్నాను. 50 శాతం పూర్తి అయిన ఈ సినిమాను పోలెండ్‌లో షూట్ చేశాం. 'అల్లరి నరేష్'తో జేమ్స్ బాండ్ సినిమాను డైరెక్ట్ చేసిన సాయి కిషోర్ డైరెక్ట్ చేస్తున్నారు. 'రెడీ, ఢీ, చిరునవ్వు'తో సినిమాల తరహాలో ఈ మూవీ ఉంటుంది. ఈచిత్రాన్ని దర్శకుడు సాయికిషోర్ అత్యద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ఆయనతోపాటు నాకు ఈ సినిమా మంచి పేరు తీసుకొస్తుందనే నమ్మకంతో ఉన్నాం. గోపీసుందర్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఇప్పటికే మూడు పాటలను చిత్రీకరించాం. హెబ్బా పటేల్ ఈ సినిమా కోసం మంచి మేకోవర్ అయ్యారు. అద్భుతంగా నటించింది. అలాగే మేజర్ యాక్టర్స్ ఈ మూవీలో నటించారు. త్వరలో ఈ మూవీ టైటిల్‌ను అనౌన్స్ చేస్తాం. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే సినిమా' అని తెలిపారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.